జనవరి
2024

సంపుటి :19 సంచిక : 8

213

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

సిద్ధాంత వేత్త, కార్యదక్షుడు కామ్రేడ్ లెనిన్
లెనిన్ వారసత్వాన్ని ఈ రోజే అందిపుచ్చుకోండి!
లెనినిజం అంటే ఏమిటి?
మహాపర్వతం ఎక్కుతున్నప్పుడు నిరాశలు కూడా ఎదురవుతాయి!
లెనినిజం - వర్గ చైతన్యం
కార్మికులు శిరమెత్తడం ఖాయం! పెట్టుబడి దారులూ, వారి ప్రభుత్వం భయంతో వణికిపోవడం ఖాయం!!
లెనిన్ -అక్టోబర్ విప్లవం
గొప్ప మానవతా వాది లెనిన్
లెనిన్ గురించి భారతీయుల ప్రత్యక్ష అనుభవాలు

# సిద్ధాంత వేత్త, కార్యదక్షుడు కామ్రేడ్ లెనిన్

ఆర్ రఘు



వి.ఐ.లెనిన్.... జారిస్టు రష్యాను సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్‌గా రూపాంతరం చేయించి, ప్రపంచ చరిత్రలో నూతన శకానికి నాంది పలికిన విప్లవ మేధావి. నవంబరు విప్లవం, సోవియట్ విప్లవం అని ప్రపంచం వేనోళ్ల కీర్తించే రష్యా విప్లవానికి వ్యూహరచన చేయటమే కాదు, విప్లవ అవకాశాలు సృష్టించి, వాటిని చేజిక్కించుకోమని రష్యా కార్మికవర్గాన్ని ఉత్తేజపర్చిన కలం, గళం లెనిన్. దోపిడీకి వ్యతిరేకంగా పోరాడే ప్రతి గొంతులోనూ అజరామరంగా నిలచే పేరు ఆయనది.

రష్యాలో మేధావుల చర్చలకు పరిమితమైన మార్క్సిజాన్ని కర్షకజీవుల విముక్తి సాధనంగా మల్చిన ఘనత లెనిన్‌ది. విప్లవం విజయం సాధించటానికి మార్క్సిస్టు మూల సూత్రాలపై విశ్వాసం ఉంచి దోపిడీకి గురయ్యే వారినందరినీ సమీకరించగలిగే రాజకీయ పార్టీ అవసరాన్ని గుర్తించిన వ్యక్తి లెనిన్. అంతేకాదు. 1905 విప్లవ అనుభవం నేపథ్యంలో రష్యా, మరే ఇతర వెనకబడిన దేశంలోనైనా విప్లవం విజయం సాధించాలంటే కార్మికవర్గం తన సహజ మిత్రులైన రైతాంగాన్ని ఉద్యమోన్ముఖులను చేయటం అనివార్యం అని గుర్తించి కార్మిక కర్షక మైత్రికి సైద్ధాంతికంగాను, ఆచరణాత్మకంగానూ పునాదులు వేసిన వ్యూహకర్త. కమ్యూనిస్టు పార్టీకి మిగిలిన పార్టీలకంటే భిన్నంగా తనదంటూ నిర్మాణం, విలక్షణత, వ్యక్తిత్వం, క్రమశిక్షణ, ప్రమాణాలు ఉండాలని సవాలు చేసి నిరూపించిన సాహసి. విప్లవమే వృత్తిగా ఎంచుకుని పనిచేసే రాజకీయ సైనికులే కమ్యూనిస్టు పార్టీకి పెట్టుబడి అని గుర్తించిన మొదటి విప్లవకారుడు. విప్లవానికి ప్రజాబాహుళ్యాన్ని కర్తవ్యోన్ముఖులను చేయాలని గుర్తించిన దూరదృష్టి కలిగిన దార్శనికుడు. జీవితాంతం మార్క్సిస్టు మూలసూత్రాలను కంటికి రెప్పలా కాపాడుతూ వాటిని మారిన కాలానికి అనుగుణంగా ఆధునీకరించిన గొప్ప తత్వవేత్త. దేశంలో ఉన్నా ప్రవాసంలో ఉన్నా, బహిరంగంగా పని చేస్తున్నా అజ్ఞాతంలో ఉన్నా కష్టజీవుల దైనందిన జీవితాన్ని అత్యంత సమీపంగా అధ్యయనం చేయటం అలవాటుగా మార్చుకున్న మహా మనిషి. కార్యకర్తల బాగోగుల గురించి, వారి భద్రత గురించి నిరంతరం అప్రమత్తంగా మెలిగే ధీరుడు. మార్క్సిజాన్ని, వాస్తవిక జీవితాన్ని, దైనందిన రాజకీయ పరిణామాలను సమగ్రంగా అధ్యయనం చేసి వాటిని సమపాళ్లలో మేళవించి రాజకీయ లక్ష్య నిర్దేశం చేసిన సమగ్ర విప్లవకారుడు. ప్రాణపాయం అని తెలిసినా కర్తవ్యనిర్వహణలో ఒక్క అడుగు కూడా వెనక్కువేయని ధీరుడు. ఇన్ని మహత్తర లక్షణాలను లెనినిజం రూపంలో భావితరాల కార్యాచరణకు మార్గదర్శకాలుగా వదిలి వెళ్లిన వ్యక్తి. అందువల్లనే మార్క్సు సరసన తన పేరు నిలబెట్టుకుని మార్క్సిజం–లెనినిజం అని ప్రపంచ కార్మికులు నినదించేలా మిగిలిపోయిన మహత్తర విప్లవకారుడు. కేవలం పైనుండి నాయకత్వం వహించటానికే పరిమితం అయిన నాయకుడు కాదు. అవసరం అయినపుడు నేరుగా ప్రత్యక్ష కార్యాచరణలో ముందుండి విప్లవ సైన్యాలను నడిపించిన విప్లవ సేనాని.

“లెనిన్ గురించి ఎంతైనా చెప్పుకోవచ్చు, ఎన్నైనా చెప్పుకోవచ్చు. ఎంత చెప్పినా, ఎన్ని చెప్పినా ఇంకా చెప్పాల్సినవి ఎన్నో మిగిలిపోయాయనిపించే మహోన్నత జీవితం ఆయనది. జీవించి ఉన్నప్పుడు ఆయన మాకు తండ్రి, గురువు, సలహాదారుడు, సహచరుడు. ఇప్పుడు ఆయన సాంఘిక విప్లవానికి, మాకు దారి చూపే ధృవ తార. మా కృషిలో ఆయన ఎల్లప్పుడూ జీవించే వుంటాడు.....” ప్రపంచ విప్లవయోధుడు, ఫ్రెంచి, అమెరికా సామ్రాజ్యవాద దేశాలను మట్టిగరిపించి అత్యంత పేద దేశమైన వియత్నాంలో విప్లవాన్ని సాధించిన హో చి మిన్ అన్న మాటలివి. చిన్న దేవమైన వియత్నాంకే కాదు. సకల పీడిత దేశాలకు, ఆ దేశాలలోని కమ్యూనిస్టుల మనస్సుల్లో లెనిన్ అంటే కదలాడే స్ఫురణకు సరైన పదరూపం అదేనని కచ్చితంగా చెప్పవచ్చు.

లెనిన్ సైద్ధాంతిక పోరాటం వెనుక, విప్లవ కార్యాచరణ వెనుక కఠోరమైన స్వయం కృషి వుంది. బహుముఖమైన గతితార్కిక ప్రజ్ఞ వుంది. స్పష్టమైన శాస్త్రీయ ప్రాపంచిక దృక్పథం వుంది. ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త లెనిన్ మహాశయుని జీవితం నుండి నేర్చుకోవాలన్న తపన నుండి ఆయన జీవితాన్ని అధ్యయనం చేయాలి. వ్యక్తిగత జీవితంలో వచ్చే కష్టాలు, నష్టాలు, బాధలు ఏ విధంగా అధిగమించాలి. ఆశయ సాధనలో వ్యక్తిగత సమస్యలకు ఎంత ప్రాధాన్యత ఇవ్వాలి అనే విషయాలను నేర్చుకోవాలని కోరుకునే వారికి కామ్రేడ్ లెనిన్ జీవితం ఒక పాఠ్యపుస్తకం లాంటిది.

### లెనిన్ బాల్యం

లెనిన్ అసలు పేరు వ్లాదిమిర్ ఇల్యిచ్ ఉల్యనోవ్. 1870 ఏప్రిల్ 22 వతేదీన ఒల్గా నది ఒడ్డున వున్న సింబ్రిస్క్ పట్టణంలో ఆయన జన్మించాడు. ఆయన తండ్రి ఇల్యానికోలవిచ్ ఉల్యనోవ్. మధ్యతరగతి ఉపాధ్యాయుడు. తల్లి మార్యా అలెగ్జాండ్రినోవా. తల్లిదండ్రులిద్దరూ ప్రగతిశీల భావాలు కలవారు. తండ్రి

(మిగతా 34వ పేజీలో)

## ఈ సంచికలో...


1. సిద్ధాంత వేత్త, కార్యదక్షుడు కామ్రేడ్ లెనిన్
ఆర్. రఘు .......2

2. లెనిన్ వారసత్వాన్ని ఈ రోజే అందిపుచ్చుకోండి !
స్లోవోజ్ జిజెక్ .......4

3. లెనినిజం అంటే ఏమిటి?
స్టాలిన్ ........9

4. మహాపర్వతం ఎక్కుతున్నప్పుడు నిరాశలు కూడా ఎదురవుతాయి!
లెనిన్ .......13

5. లెనినిజం - వర్గ చైతన్యం
ప్రభాత్ పట్నాయక్.........15

6. కార్మికులు శిరమెత్తడం ఖాయం! పెట్టుబడిదారులూ, వారి ప్రభుత్వం భయంతో వణికిపోవడం ఖాయం!!
వి.ఐ లెనిన్........18

7. లెనిన్ -అక్టోబర్ విప్లవం
ఎస్. వెంకట్రావు.......19

8. గొప్ప మానవతా వాది లెనిన్
పాతూరి వెంకటేశ్వరరావు......25

9. లెనిన్ గురించి భారతీయుల ప్రత్యక్ష అనుభవాలు
ఎల్.వి. మిత్రోఖిన్ ......27



సంపాదకుడు :
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visitcpi(m)site at:cpim.org


# లెనిన్

మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్దిష్టంగా అమలుచేయడం ఎలాగో కార్మికవర్గానికి బోధించి, ప్రపంచంలోనే తొలి సోషలిస్టు విప్లవాన్ని సాధించిన మహా విప్లవనేత వి.ఐ. లెనిన్ శత వర్ధంతిని ఈ నెల 21 నాడు ప్రపంచమంతటా జరుపుకుంటున్నారు. మార్క్స్-ఏంగెల్స్ తరువాత మార్క్సిస్టు మహామహోపాధ్యాయునిగా చరిత్రలో చిరస్థానం సంపాదించుకున్న లెనిన్, మార్క్సిజం అనే శాస్త్రీయ సిద్ధాంతాన్ని మరో మెట్టు పైకి తీసుకుపోయి దాన్ని ఒక విప్లవ కళగా మార్చాడు. అందుకే లెనిన్ తరువాత మార్క్స్-ఏంగెల్స్ సిద్ధాంతం మార్క్సిజంగా కాక మార్క్సిజం-లెనినిజంగా మారింది. "మా సిద్ధాంతం పిడివాదం కాదు, అది ఆచరణకు కరదీపిక" అన్నారు మార్క్స్-ఎంగెల్స్. సిద్ధాంతానికీ, ఆచరణకూ మధ్య ఉన్న గతితార్కిక సంబంధాన్ని ఆచరణలో చూపించడం ద్వారా అక్టోబర్ విప్లవం సాధించాడు లెనిన్. "మార్క్సిజాన్ని సిద్ధాంతం నుండి ఆచరణకు, సైన్సు నుండి కళకు అభివృద్ధి చేయడం ద్వారా లెనిన్ ఈ రెంటి మధ్య ఉన్న గతితార్కిక సంబంధాన్ని అంటే రెంటి మధ్య ఉమ్మడిగా ఉన్నదేమిటి, రెంటి మధ్య తేడా ఏమిటి అన్నదాన్ని చూపించాడు" అని పేర్కొన్నాడు లెనిన్ జీవిత చరిత్ర రాసిన టోనీ క్లిఫ్. రష్యాలో అక్టోబర్ విప్లవం జయప్రదం చేయడంలో లెనిన్ అనుసరించిన వ్యూహాలు, ఎత్తుగడలను పరిశీలిస్తే ఈ విషయం మనకు తేటతెల్లమవుతుంది.

విప్లవం విజయం సాధించాలంటే కార్మికవర్గం తన సహజ మిత్రులైన రైతాంగాన్ని ఉద్యమోన్ముఖులను చేయటం అనివార్యం అని గుర్తించి కార్మిక కర్షక మైత్రికి సైద్ధాంతి కంగానూ, ఆచరణాత్మకంగానూ పునాదులు వేసిన వ్యూహకర్త లెనిన్. కమ్యూనిస్టు పార్టీకి మిగిలిన పార్టీలకంటే భిన్నంగా తనదంటూ నిర్మాణం, విలక్షణత, వ్యక్తిత్వం, క్రమశిక్షణ, ప్రమాణాలు ఉండాలని సవాలు చేసి నిరూపించిన సాహసి.

పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాద దశకు చేరిన విషయాన్ని లెనిన్ బయటపెట్టడమే కాదు, దేశభక్తి పేరుతో సామ్రాజ్యవాద యుద్ధాలను సమర్థించే రివిజనిస్టుల నుండి విప్లవోద్యమాన్ని కాపాడాడు. సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చి రష్యాలో సోషలిస్టు విప్లవానికి బాటలు వేశాడు.

విప్లవంలోనూ, పార్టీ నిర్మాణంలోనూ, పార్టీని ఐక్యంగా ఉంచటంలోనూ విప్లవ పత్రిక పోషించే పాత్రను అత్యంత ప్రతిభావంతంగా నిరూపించాడు లెనిన్. ప్రత్యక్ష కార్యాచరణకు ఎంత ప్రాధాన్యత ఇచ్చాడో పత్రిక నిర్వహణకూ అంతే ప్రాధాన్యత ఇచ్చాడు. అందువల్లనే ఎన్ని అవరోధాలున్నా విప్లవ శ్రేణులకు మార్గదర్శనం వహించే పత్రిక కార్యకలాపాలు మాత్రం యథావిధిగా కొనసాగేలా జాగ్రత్తలు తీసుకున్నాడు.

1905 తొలి తిరుగుబాటుయత్నం అర్థాంతరంగా ముగించాల్సి వచ్చినపుడు లెనిన్ "అధైర్యపడవద్దు. ఈ చీకటి రోజులు తొలగిపోతాయి. గాలిదుమారం సమసిపోతుంది. నిప్పు కణికలు చల్లబడతాయి. మరో మలయమారుతం వీస్తుంది. కార్మికవర్గ విప్లవం విజయం సాధిస్తుంది" అంటూ ధైర్యాన్ని నూరిపోశాడు. అందువల్లనే లెనిన్ నూతన శకానికి విప్లవంతో స్వాగతం చెప్పిన శకపురుషుడుగా చరిత్రలో స్థానం పదిలపర్చు కోగలిగాడు.


లెనిన్ సాధించిన తొలి సోషలిస్టు దేశం - సోవియట్ యూనియన్ కుప్పకూలిపోవచ్చుగాక. కానీ సంపద అంతా కష్ట జీవుల పరం చేసిన ఆ దేశం చూపించిన ఆదర్శం ఎన్నటికీ నిలిచే ఉంటుంది. వలస దేశాల్లో పోరాడే ప్రజలకు అది ఇచ్చిన స్ఫూర్తి, అనేక సోషలిస్టు దేశాల్లో కష్టజీవుల రాజ్యాల ఏర్పాటుకు అది చూపించిన బాట, సామ్రాజ్యవాదుల పట్టు నుండి వర్ధమాన దేశాల విముక్తికి అది ఇచ్చిన ఊతం చరిత్రలో చెరిపేస్తే చెరిగిపోయేవి కావు.

ఈ భూగోళం మీద దోపిడీ, పీడన నశించే వరకు శ్రమజీవులకు విప్లవం సాధించాల్సిన అవసరం ఉంటుంది. విప్లవం సాధించాల్సిన అవసరం ఉన్నంత వరకు వారికి మార్క్సిజం-లెనినిజపు మార్గదర్శకత్వం అవసరపడుతూనే ఉంటుంది. అందులోనూ సామ్రాజ్యవాద గుత్తపెట్టుబడి అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి రూపం సంతరించుకుని ప్రపంచ ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్న నేటి తరుణంలో లెనిన్‌ను అధ్యయనం చేయడం, లెనిన్‌ను ఆకళింపు చేసుకోవడం, లెనిన్‌ను ఆవాహన చేసుకోవడం విప్లవ శక్తులకు తక్షణ అవసరం. ఈ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని లెనిన్ శత వర్ధంతిని దేశవ్యాపితంగా నిర్వహించాలని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ పిలుపునందుకుని లెనిన్ రచనలను ప్రతి పార్టీ కార్యకర్త, ప్రతి సభ్యుడు అధ్యయనం చేయాలి.





# లెనిన్ వారసత్వాన్ని ఈ రోజే అందిపుచ్చుకోండి !



రచయిత స్లోవేనియన్ తత్వవేత్త, సాంస్కృతిక సిద్ధాంతవేత్త, మేధావి. ఆయన లండన్ విశ్వవిద్యాలయంలో మానవశాస్త్రాల సంస్థ అంతర్జాతీయ డైరెక్టర్, న్యూ యార్క్ విశ్వవిద్యాలయ విజిటింగ్ ప్రొఫెసర్.

**స్లొవోజ్ జిజెక్**

నేడు వామపక్షాలకు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. అభ్యుదయ ఉద్యమాలు సోషలిస్టు పంథాను పుటం పెట్టి మరీ పునరన్వేషిస్తున్నాయి. ఇంత మాత్రానికే బెంబేలు పడాల్సిన పనిలేదు. సరిగ్గా ఇలాంటి అనుభవం నుండే 'లెనినిజం' ఆవిర్భవించిందన్న విషయం మనం మరువకూడదు. 1914లో లెనిన్ ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాడో గమనించండి. ఎంతటి తీవ్రమైన దిగ్భ్రమకు లోనయి ఉంటాడో గుర్తుచేసుకోండి. 1914 శీతాకాలంలో మొదటి ప్రపంచ యుద్ధం మొదలయ్యింది. యూరప్ ఖండంలోని సోషల్ డెమొక్రాట్ పార్టీలన్నీ, ఒక్క సెర్బ్ సోషల్ డెమొక్రాట్ పార్టీ తప్ప, జాతీయ దురభిమాన పంథాను ఎంచుకున్నాయి. సోషల్ డెమొక్రాట్ పార్టీతోనే ఉండి పనిచేస్తున్న శక్తుల్లో కొన్ని ఏ పక్షమూ వహించకూడదని వాదిస్తే, మరికొన్ని శక్తులు ఇది సామ్రాజ్యవాద యుద్ధం అని గట్టిగా వాదించాయి. అభ్యుదయ ఉద్యమం యూరప్ ఖండమంతటా నిట్టనిలువునా రెండుగా చీలిపోయింది. తటస్థ మేధావులు అనుకునే వాళ్ళంతా- స్వల్పకాలమే అయినప్పటికీ ఫ్రాయిడ్‌తో సహా జాతీయ దురభిమాన వాదంవైపు కొట్టుకుపోయారు.

బూర్జువా ప్రజాస్వామ్యం సాధించడం, సోషలిస్టు విప్లవాన్ని జయప్రదం చెయ్యడం లక్ష్యాలుగా పెట్టుకుని పని చెయ్యాలనుకున్న అభ్యుదయ-వామపక్ష ఉద్యమాలు 1914లో ఒక్కసారిగా అర్థాంతరంగా అదృశ్యమైపోయాయి. లెనిన్ తన కాళ్ళకింద భూమి మొత్తం కదిలిపోయిన పరిస్థితిని చవిచూశాడు. అయినా తొణకలేదు. 'నే ముందే చెప్పానా ఇట్లా జరుగుతుందనీ' అని వాపోలేదు. 'ఏంచెయ్యాలి' (వాటీజ్ టు బి డన్) అన్నగ్రంథ రచన ద్వారా కర్తవ్య నిర్దేశనం చేశాడు. కమ్యూనిస్టు రెండవ ఇంటర్నేషనల్ మునిగిపోకుండా నిలబెట్టాడు. అక్షరాలా 'లెనిని జానికి' సైద్ధాంతిక పునాది వేశాడు.

అతివాద శక్తులు బూర్జువా రాజ్యాంగ యంత్రాన్ని ధ్వంసంచేసి సైన్యం, పోలీసు, బ్యూరోక్రసీకి తావులేని నూతన సమాజ నిర్మాణంకోసం కృషి చెయ్యాలనీ, సామాజిక అంశాలమీద విధానపరమైన నిర్ణయాలు ప్రజలే సమిష్టిగా తీసుకుంటారనీ, సామ్రాజ్య వాద యుద్ధంలో సమిధలు కాకుండా ఎక్కడి కక్కడ కార్మికవర్గం తుపాకులు తమ తమ దేశాల్లోని పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టి ఆ వ్యవస్థను కూలదోసి సోషలిస్టు సమాజ నిర్మాణానికి కృషి చెయ్యాలనీ లెనిన్ పిలుపునిచ్చాడు. ఆయన ప్రవచించింది ఒట్టి ఊహాజనిత లోకం అని చప్పరించేసిన వాళ్లూ ఉన్నారు. పట్టించుకోనివాళ్లూ ఉన్నారు. కాని లెనిన్ ప్రతిపాదించిన సమసమాజం సిద్ధాంతంగానే మిగిలిపోలేదు. 1917 నాటికి రష్యాలో సోషలిస్టు విప్లవం జయప్రదమయ్యింది. 'ఇరవై లక్షలమందితో కాకపోతే కనీసం పది లక్షల మందితో రాజ్యాంగ యంత్రాన్ని ఒక్కసారిగా పనిలో పెడతా' అని లెనిన్ చెప్పినప్పుడు కిర్క్ గార్డిన్ వంటివాళ్ళు 'ఇది ఉన్మాదం' అనేశారు. లెనిన్ రాసిన 'రాజ్యము-విప్లవము' అన్న గ్రంథంలో ఉన్న విస్ఫోటన శక్తిని తక్కువ అంచనా వెయ్యకూడదు. 'లెనినిజం' గురించి నీల్ హార్టింగ్ రాసిన పుస్తకంలో ఏమంటాడంటే- 'మొత్తం పేజీలన్నీ తిప్పండి. పశ్చిమ దేశాలు అనుసరించే సంప్రదాయ రాజకీయాలకు సంబంధించిన పదజాలం, వ్యాకరణం సమస్తం లుప్తమైపోయి ఉండడం మీకు కనిపిస్తుంది' అంటాడు.

1917 విప్లవ పరిస్థితులు అందరికీ తెలిసినవే. మాకియవెల్లీ గురించి అల్థూసర్ రాసిన వ్యాసం శీర్షిక మాదిరి 'లెనిన్ ఏకాకి' అయ్యాడు. 'ఏప్రిల్ థీసిస్' గురించి స్వంత పార్టీలోనే వ్యతిరేకతను ఎదుర్కొన్నాడు. ఒక్కడుగా పార్టీలో అంతర్గత పోరాటం చేశాడు. 'ఏప్రిల్ థీసిస్' ద్వారా దేశంలో విప్లవానికి పరిస్థితులు పరిపక్వమయ్యాయి అన్న లెనిన్ వాదనను పార్టీలో మెజారిటీ వ్యతిరేకించారు. పేరున్న బోల్షివిక్ నాయకులు ఒక్కరంటే ఒక్కరు కూడా లెనిన్‌కు మద్దతుగా నిలవలేదు. అయితే 'ప్రావ్దా' సంపాదక మండలి మాత్రం లెనిన్ ప్రతిపాదన పట్ల పార్టీ తీసుకున్న ప్రతికూల వైఖరి నుండి విడగొట్టుకుంది. బొగదనోవ్ 'ఏప్రిల్ థీసిస్'ను 'పిచ్చివాడి ప్రేలాపన'గా అభివర్ణించాడు. నెజ్దా కృపస్కయా (లెనిన్ భార్య) అయితే 'లెనిన్‌కి పిచ్చిగాని పట్టలేదుకదా అని భయమేసింది' అని వ్యాఖ్యానించింది. అయినప్పటికీ 'భ్రమ'గా ఊహించిన 'మహత్తర అక్టోబర్ విప్లవం' లెనిన్ జోక్యంతో సఫలమై, సాకారమై ప్రపంచంలోనే తొలి సోషలిస్టు వ్యవస్థ ఆవిర్భావానికి అంకురార్పణ జరిగింది. పార్టీ పెద్దలను పక్కనబెట్టి లెనిన్, శ్రేణులకు ఇచ్చిన పిలుపు విప్లవస్ఫూర్తిని రగిలించింది. దేశంలో ప్రధాన నగరాలు, పట్టణాలన్నింటా స్థానిక కమిటీలను ఏర్పాటుచేసి జారు ప్రభుత్వ అధికారాన్ని గుర్తించ నిరాకరించి, పరిపాలనా వ్యవహారాలను ప్రజలే తమ చేతుల్లోకి తీసుకోవాలన్న లెనిన్ పిలుపు సఫలమయ్యింది.

1917 వసంతకాలం. పరిస్థితుల

సంక్లిష్టతపై లెనిన్‌కు పూర్తి అవగాహన ఉంది. ఫిబ్రవరిలో జరిగిన విప్లవం రష్యా రాజరిక ప్రభుత్వాన్ని కూలదోసింది. ఆనాటికి యూరప్ ఖండంలో అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా రష్యా అవతరించింది. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా ప్రజలు పెద్దఎత్తున ఈ విప్లవంలో పాలు పంచుకున్నారు. సంఘం పెట్టుకోవడానికి స్వేచ్ఛ, పత్రికాస్వేచ్ఛ, ఏ రంగంలో చూసినా స్వేచ్ఛ. అయితే ఈ స్వేచ్ఛ పరిస్థితులను కలగాపులంగా మార్చేసింది. ఒకవిధంగా అనిశ్చిత పరిస్థితులకు దారితీసింది. 1917 ఫిబ్రవరి-అక్టోబర్ నెలల మధ్యకాలంలో విప్లవానికి సంబంధించి లెనిన్ చేసిన రచనలను పరిశీలిస్తే వాటిలో ఒక క్రమపద్ధతి, అంతఃసూత్రం మనకు కనిపిస్తుంది. రాజకీయ పోరాటానికీ, నిర్దేశిత లక్ష్యాల సాధనకూ మధ్య పాటించాల్సిన అంతరాన్ని ఈ కాలపు లెనిన్ రచనలలో మనం గమనించవచ్చు. తక్షణం శాంతి నెలకొనాలి, భూమి పంపిణీ జరగాలి, సోవియట్లకే సర్వాధికారం అంటూ లెనిన్ ఇచ్చిన పిలుపు ఫ్యూడల్-భూస్వామ్య రాజ్యాంగ యంత్రాన్ని బద్దలు కొట్టి సామాజిక యాజమాన్యానికి వీలు కల్పించే 'కమ్యూన్' తరహా రాజ్యాంగ యంత్రాన్ని నెలకొల్పడానికి దోహదం చేసింది. ఈ విధంగా విప్లవానికీ, కఠోరశ్రమతో కూడిన సామాజిక పునర్నిర్మాణానికీ మధ్య ఉండే అంతరాన్ని లెనిన్ అత్యంత ప్రతిభావంతంగా పూరించాడు. విప్లవమంటే ఊహాజనిత స్వేచ్ఛా విస్ఫోటనం, ఏదైనా సాధించుకోవచ్చుననే ప్రజారాశుల సార్వజనీన సమాయత్తత. ఈ భావాన్ని సామాజిక పునర్నిర్మాణంలో కేంద్రంగా చేసుకొని పని చేయించగలగడమే లెనిన్ కార్యాదక్షతకు గీటురాయి.

1789-1793 మధ్యకాలంలో జరిగిన ఫ్రెంచి విప్లవం ఈ అంతరాన్ని అధిగమించడంలో విఫలమయ్యింది. కానీ రష్యా విప్లవానికి వచ్చేసరికి లెనిన్ ఈ అంతరాన్ని అధిగమించాడు. అదే లెనినిజం విశిష్టత. దీన్నిబట్టి నేర్చుకోవాల్సిన పాఠం ఏమిటంటే విప్లవం దెబ్బమీద దెబ్బవెయ్యాలి. విప్లవం ముందు ఒక రూపాన్ని ఎంచుకొని తరువాత సారాన్ని నింపుకోవాలి అనే ఆలోచన తప్పు. సారాన్ని సిద్ధం చేసుకొని విప్లవ రూపాన్ని ఎంచుకోవాలి. విప్లవం దెబ్బమీద దెబ్బవెయ్యాలి అంటే నా ఉద్దేశ్యం విప్లవం వెంబడే ఇంకో విప్లవం రావాలి అని. మొదటి విప్లవం జయప్రదమైనప్పటికీ పాత సమాజపు ఆలోచనా పద్ధతులు (మైండ్‌సెట్) అలాగే కొనసాగుతాయి. "స్వేచ్ఛగా ఎన్నికలు జరిగి 'మంచిపార్టీ' అధికారంలోకి వస్తే అప్పటికే ఉన్న రాజ్యాంగ యంత్రం, ప్రజాస్వామ్యాల ద్వారా మానవులందరికీ స్వేచ్ఛా, న్యాయం ప్రసాదించవచ్చు, సమానత్వం సాధించవచ్చు" అనే నమ్మకం, "చట్టబద్ధంగానే సామాజిక మార్పు సాధ్యం'' అనే అభిప్రాయం అభ్యుదయవాదుల్లో కూడా ఉంది.

❝"స్వేచ్ఛగా ఎన్నికలు జరిగి 'మంచిపార్టీ' అధికారంలోకి వస్తే అప్పటికే ఉన్న రాజ్యాంగ యంత్రం, ప్రజాస్వామ్యాల ద్వారా మానవులందరికీ స్వేచ్ఛా, న్యాయం ప్రసాదించవచ్చు, సమానత్వం సాధించవచ్చు" అనే నమ్మకం, "చట్టబద్ధంగానే సామాజిక మార్పు సాధ్యం" అనే అభిప్రాయం అభ్యుదయవాదుల్లో కూడా ఉంది.❞

(1920లలో కార్ల్ కాట్‌స్కీ రూపొందించిన సిద్ధాంతానికి ఇలాంటి భ్రమలే పునాది. శ్రామికవర్గ పార్టీలు బూర్జువా పార్టీలతోకలిసి పార్లమెంటరీ సంకీర్ణాన్ని ఏర్పాటు చేసి పెట్టుబడిదారీ విధానం నుండి సోషలిజం సాధన దిశగా పనిచెయ్యవచ్చునదే కాట్‌స్కీ సిద్ధాంత సారం). అయితే పాత వ్యవస్థను సమూలంగా రద్దుచేసే మలి అడుగు వెయ్యడానికి ఊగిసలాడే విప్లవకారులు ఎవరైనా చివరికి ఏం కోరుకుంటున్నారయ్యా అంటే- విప్లవం లేకుండా విప్లవం సాధించాలనుకుంటున్నారన్నమాట.

విప్లవ పంథాన సోషలిజం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రతివాళ్లూ 1917లో లెనిన్ చేసిన రచనలను చదవాలి. విప్లవం గ్యారంటీగా వస్తుందనే భరోసా ఏదో ఒకటి వెతుక్కుంటూ వాదాలు లేవదీసిన వాళ్ళందరికీ లెనిన్ తన రచనలద్వారా ధీటైన సమాధానాలు ఇచ్చాడు. రష్యన్ కార్మికవర్గం ఇంకా పరిపక్వం కాలేదు. ఈ దశలో విప్లవానికి పిలుపునివ్వడం తొందరపాటు అంటూ సామాజిక అనివార్యత కోసం దేవులాడిన వాళ్ళకూ, 'మెజారిటీ ప్రజలు మన పక్షాన లేరు కాబట్టి మనం తీసుకురాబోయే విప్లవం ప్రజాస్వామికంగా ఉండదేమో' అంటూ ప్రజాస్వామిక సాధికారత కోసం వెతుకులాడిన వాళ్ళకూ లెనిన్ పదునైన సమాధానాలతో కనువిప్పు కలిగించాడు. రాజ్యాధికారాన్ని కైవసం చేసుకోవడానికి విప్లవ శక్తులకు ఎవరి అనుమతులో కావాల్సి ఉందన్నట్లుగా వ్యవహరించిన వాళ్ళను లెనిన్ ఎండగట్టాడు. ఈ వాదనలన్నీ 'అవకాశవాద ధోరణులని' సవివరంగా ఎత్తిచూపాడు. తొందరపడి రాజ్యాధికారం చేజిక్కించుకోవడం అవుతుందేమో, విప్లవానికి పిలుపునిస్తాం సరే గ్యారంటీ ఉందంటారా అనే అనుమానాలు అగాధంలోకి చూసినప్పుడు మనసులో రేగే భయాలవంటివి. వస్తుగత (ఆబ్జెక్టివ్) సత్యాలు, చట్టాలు, నియమాల మాటున భయాన్ని కప్పిపెట్టుకునే తప్పుడు పద్ధతి ఇది. ఈ అవలక్షణాలన్నిటినీ దునుమాడడానికే లెనిన్....అయితే ఇప్పుడు 'ఏం చెయ్యాలి'. "వాస్తవాలను ప్రకటించండి, నిజం ఒప్పుకోండి. మన కేంద్రకమిటీలో అలాంటి ధోరణులూ, అభిప్రాయాలూ ఉన్నాయని..." అంటూ ఒక ప్రకటన చేశాడు.

బోల్షివిక్ విప్లవానికి ఉన్న పరిమితులను లెనిన్ అర్థం చేసుకున్నాక ఏం జరిగింది? పార్టీలో ఉన్న భ్రమలు వదలగొట్టడానికి 'రాజ్యము-విప్లవం' అన్న చిరుపొత్తం వెలువరించాడు. బోల్షివిక్ విప్లవానికి తగిన వాస్తవిక నమూనా రూపురేఖలను ఆ పుస్తకంలో వివరించాడు. అభివృద్ధికి నోచని ఆర్థికవ్యవస్థ, ప్రజల సాంస్కృతిక వెనుకబాటుతనం వల్ల రష్యా నేరుగా సోషలిస్టు వ్యవస్థలోకి అడుగుపెట్టలేదని గ్రహించాడు. విప్లవం ద్వారా ప్రజలు సాధించుకున్న అధికారాన్ని ఉపయోగపెట్టుకుని ఆర్థికవ్యవస్థలో రాజ్య పెట్టుబడిదారీ విధానం (స్టేట్ క్యాపిటలిజమ్), కార్మికవర్గం-రైతాంగానికి సాంస్కృతిక విద్య గరపడం ద్వారా వారి చైతన్యస్థాయిని పెంచడం తక్షణ లక్ష్యాలుగా ఎంచుకున్నాడు. "పాశ్చాత్య ఐరోపా నాగరిక దేశంలోని సగటు పౌరుడి జీవన ప్రమాణాలు అందుకోవడానికి మనం తక్షణం విశాల ప్రాతిపదికన భారీ ఎత్తు కృషి చెయ్యాల్సి ఉంటుంది' అని ప్రకటించాడు. అర్థ-ఆసియా

> **"ఈనాడు ప్రపంచంలో ఎక్కడ చూసినా పరిస్థితులు ఎలా ఉన్నాయి? రాజ్యం, రాజ్యాంగ యంత్రం, దాని రాజకీయ ప్రతినిధులూ... ప్రజలెదుర్కొంటున్న కీలకమైన సమస్యలను పరిష్కరించలేనంత బలహీనంగా ఉన్నారు. 1917 నాటికి రష్యాలో నెలకొన్న సార్వత్రిక సంక్షోభాన్నీ, సమస్యలనూ పార్లమెంటరీ విధానం ద్వారా పరిష్కరిస్తామని అనుకోవడం ఎలాంటి భ్రమో నేడు ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని మార్కెట్ తర్కం పరిష్కరిస్తుందను కోవడమూ అంతే భ్రమగా మిగిలిపోతుంది."**

అజ్ఞానం నుండి ఇంకా మనల్ని మనం విముక్తం చేసుకోలేదన్న వాస్తవాన్ని గమనంలో ఉంచుకోవాలని చెప్పాడు. లెనిన్ తరచూ 'నేరుగా కమ్యూనిజాన్ని విత్తే పని చెయ్యకండి' అని హెచ్చరిస్తూ ఉండేవాడు. "రష్యా గ్రామీణ ప్రాంతాలలో కమ్యూనిస్టు సమాజ భావనను ప్రజలలోకి ఇంకించడానికి అప్పుడే ఎట్టి పరిస్థితులలోనూ పూనుకోవద్దు. ఎందుకంటే గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనిజం స్థాపించ డానికి అనువైన భౌతిక వనరుల పునాది లేదు. ఇలాంటి పరిస్థితుల్లో కమ్యూనిస్టు సమాజ భావన మనకు మేలు కన్నా కీడు చేస్తుంది. సరిగ్గా చెప్పాలంటే విపరీతానికి దారితీస్తుంది" అని లెనిన్ తగు జాగ్రత్తలు చెబుతూ ఉండే వాడు. 'తొందరపాటు అన్నిటికన్నా ప్రమాద కరం' అని తరచూ జాగ్రత్త పలికేవాడు. అంటే దీని అర్థం లెనిన్ బోల్షివిక్ ఆదర్శవాదం గురించి మెన్షవిక్‌లు పెట్టిన విమర్శలను పరోక్షంగా అంగీకరించి అమల్లో పెట్టాడని కాదు.

బోల్షివిక్‌ల ముందున్న తక్షణ కర్తవ్యం అభ్యుదయకర బూర్జువా ప్రజాస్వామిక పాలనను (సార్వజనీన విద్య, వైద్యం, ఉండడానికి ఇల్లు, తినడానికి తిండి, చేసేందుకు పని) అందించడం అని లెనిన్ గ్రహింపులో ఉంది. అయితే ఈ మౌలిక అభివృద్ధి సాధన విప్లవకర కార్మికవర్గం నేతృత్వంలో జరుగుతుంది కాబట్టి మొత్తం పరిస్థితులలోనే మౌలిక మార్పులు ఉంటాయి. ప్రజల కనీస, ప్రాథమిక అవసరాలను నెరవేర్చే ఈ క్రమం ద్వారానే బూర్జువా సైద్ధాంతిక చట్రాన్ని కుప్పకూల్చుతుంది కార్మికవర్గం. ఉదాహరణకు విద్య సంగతే తీసుకుంటే బూర్జువా వర్గ ప్రయోజనాలను పెంచి పోషించేందుకు ఒక ముసుగులా ఉండే విద్యా విధానం స్థానే ప్రజల ప్రయోజనాలకు కట్టుబడి విద్యావ్యవస్థ నెలకొనడంతో బూర్జువా విద్యావ్యవస్థ బదాబదలయిపోతుంది. రష్యాలో విప్లవం జయప్రదం అయ్యేనాటికి ఉన్న పరిస్థితిని గమనిస్తే అత్యంత వెనుకబాటు తనంలో ఉన్న కార్మికవర్గం నాగరిక బూర్జువా వరిపాలనను కూలదోని కార్మికవర్గ శ్రేయోరాజ్యాన్ని స్థాపించాల్సిన విచిత్రమైన పరిస్థితి. ఒక నిస్సహాయ స్థితిని లెనిన్ అద్భుత అవకాశంగా మలిచాడు. కార్మికవర్గం, రైతాంగంలో ఒక 'వర్గం'గా నిబిడీకృతమైన శక్తిని, చైతన్యాన్ని పదిరెట్లు ఉద్దీపింపచెయ్యడం (స్టిమ్యులేట్) ద్వారా పాశ్చాత్య ఐరోపా దేశాలకన్నా భిన్నమైన నాగరికతను పాదుకొల్పేందుకు అవకాశం చిక్కింది అంటాడు లెనిన్.

ఈ మొత్తం పరిణామాలన్నీ గమనిస్తే విప్లవ సాధనకు రెండు రకాల నమూనాలు ఉన్నాయని అర్థం చేసుకోవచ్చు. చారిత్రక అనివార్యతలరీత్యా అంతిమ సంక్షోభ క్షణాలదాకా వేచి ఉండి విప్లవం దాని దోవన అది వచ్చేదాకా, ఆ మంచి ఘడియలు వాటంతట అవే వస్తాయని ఎదురు చూడడం ఒక పద్ధతి అయితే, అవకాశం అంది వచ్చినప్పుడు ఆ కీలకమైన సమయాన్ని అందిపుచ్చుకుని విప్లవ సాధనను వేగవంతం చెయ్యడం రెండోపద్ధతి. అసాధారణ పరిస్థితులు ఒక్కోసారి గతితార్కి సూత్రాలను అధిగమించే అవకాశం కల్పిస్తాయి అని లెనిన్ నొక్కి చెబుతాడు. రష్యాలో 1917 అక్టోబర్ విప్లవం జయప్రదం కావడానికి దేశంలో అలాంటి అసాధారణ పరిస్థితులు నెలకొన్నాయి అని గ్రహించి, ఆ పరిస్థితులను అవకాశంగా మలిచాడు లెనిన్.

ఇప్పుడు మనం నేటి పరిస్థితులకు వద్దాం. ఈనాడు ప్రపంచంలో ఎక్కడ చూసినా పరిస్థితులు ఎలా ఉన్నాయి? రాజ్యం, రాజ్యాంగ యంత్రం, దాని రాజకీయ ప్రతినిధులూ... ప్రజలెదుర్కొంటున్న కీలకమైన సమస్యలను పరిష్కరించలేనంత బలహీనాతి బలహీనంగా ఉన్నారు. 1917 నాటికి రష్యాలో నెలకొన్న సార్వత్రిక సాధారణ సంక్షోభాన్నీ, భూసంస్కరణలు, సామాజిక శాంతి వంటి సమస్యలనూ పార్లమెంటరీ విధానం ద్వారా పరిష్కరిస్తామని అనుకోవడం ఎలాంటి భ్రమో నేడు ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని మార్కెట్ తర్కం పరిష్కరిస్తుందనుకోవడమూ అంతే భ్రమగా మిగిలిపోతుంది.

ఈ మొత్తం వెలుగులో 'హెలెన్ కెర్రెరె డి ఎనాకస్సె' అనే ఆమె లెనిన్‌మీద కొత్తగా చేసిన అధ్యయనాన్ని మనం అర్థం చేసుకోవాలి. కమ్యూనిజం సరే, లెనినిజాన్ని వస్తుగతంగా ఎలా అధ్యయనం చెయ్యాలి అనే దృక్పథంతో ఈవిడ పుస్తకం రాసింది. లెనిన్ కృషికి సముచిత స్థానం కల్పించింది. స్టాలిన్ హయాంలో రాజ్యాంగ యంత్రం నూతన ఆర్థిక కార్యక్రమంతో రాజీపడిందని ఆమె విమర్శి స్తుంది. మార్కెట్, ప్రైవేటు ఆస్తులకు చోటు కల్పించదలచుకుంటే, వీటి వల్ల తలెత్తే నూతన వర్గాలు విప్లవం ద్వారా సముపార్జించిన మేళ్లను దెబ్బతియ్యకుండా చూసుకునేందుకు సమాజం మీద కఠినాతికఠినమైన నియంత్రణ ఉండాలనీ, పెట్టుబడిదారీ ఆర్థిక పునాదిని 'కౌంటర్ బ్యాలన్స్' చేసేవిధంగా సోషలిస్టు సైద్ధాంతిక రాజకీయ ఉపరితల నిర్మాణం బలంగా ఉండాలనీ వివరిస్తుంది.

జాతుల సమస్యకు సంబంధించి లెనిన్ బడా దేశాల జాతీయవాదాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తూ చిన్న దేశాల సార్వభౌమత్వ హక్కులను గుర్తించాలని రాసిన విషయం హెలెన్ మనకు గుర్తుచేస్తుంది. ఇప్పటికీ ఈ వైఖరికి ప్రాసంగికిత (రిలవెన్స్) ఉంది. ఐరోపా ఖండంలోని పెద్ద దేశాల్లో 'అమెరికన్ వ్యతిరేకత' ప్రబలిపోతుందంటే దానికి మనం ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ప్రపంచీకరణ వల్ల జాతి రాజ్యాల సార్వభౌమిక హక్కు ప్రమాదంలో పడుతుంది అనే ఆందోళన వర్ధమాన దేశాల్లో కన్నా అమెరికా తదనంతర అగ్రరాజ్యాలుగా ఉన్న ఇంగ్లండ్, జర్మనీ, ఫ్రాన్స్ తదాది దేశాల్లో ఎక్కువగా ఉంది. ఫైనాన్స్ పెట్టుబడి వల్ల నానాటికీ బలీయంగా విస్తరిస్తున్న గ్లోబల్ సామ్రాజ్యం ధాటికి తమ దేశాలు కూడా ఆస్ట్రియా, బెల్జియం, లగ్జెంబర్గ్ వంటి దేశాలస్థాయికి పడిపోతాయేమో అనేది అమెరికా తదనంతర అగ్రరాజ్యాల ఆందోళన. ఫ్రాన్స్‌నే తీసుకోండి. ఈ దేశంలో మితవాద

జాతీయవాద శక్తులతోపాటు వామపక్ష శక్తులు కూడా 'అమెరికనైజేషన్' పట్ల తీవ్ర వ్యతిరేకతను ప్రదర్శిస్తాయి. వామపక్ష శక్తుల వ్యతిరేకతను ఒకే గాటన కట్టలేం. యూరప్ ఖండంలో ఫ్రాన్స్ తన ఆధిపత్యం కోల్పోతుందేమో అనేది మితవాద జాతీయవాద శక్తుల ఆందోళన.

లెనిన్ వ్యక్తిత్వాన్ని హెలెన్ పునర్మూల్యాంకన చేసింది. లెనిన్ నిర్దాక్షిణ్యమైన క్రూరుడనీ, ప్రజల కష్టాలను పట్టించుకోలేదనీ, ప్రత్యర్థులను మట్టుపెట్టించేవాడనీ చలామణిలో ఉన్న పశ్చిమదేశాల ప్రచారంలో ఏమాత్రం పసలేనిదని ఆమె తేల్చేసింది. 1921లో కార్మికుల వ్యతిరేకతను లెనిన్ పరిష్కరించిన తీరును ఉదహరిస్తుంది. ఓటమి పాలయిన వారిని కూడా పరిపాలనా వ్యవహారాల్లో భాగస్వాములుగానే కొనసాగనివ్వడం ద్వారా ప్రత్యర్థులను వ్యక్తిగతంగా తప్పించేబదులు వారి భావజాలాన్ని కూకటివేళ్ళతో పెకలించే పద్ధతిని ఎంచుకోవడంలో లెనిన్ విశిష్టతను తెలియచెబుతుంది. బీథోవెన్ సంగీత ప్రదర్శన వీక్షిస్తూ లెనిన్ కళ్ళనీళ్ళు పెట్టుకుని, ఆనక విప్లవకారుడు ఇలాంటి భావోద్వేగాలను అధిగమించాలని చెప్పడం లెనిన్‌కు ఉన్న అసాధారణ స్వీయ నియంత్రణశక్తి అని చెబుతుంటారు కొందరు. కాని వాస్తవానికి ఈ ఉదంతం, లెనిన్ సున్నిత భావోద్వేగ మనస్తత్వాన్ని మనకు పట్టి ఇస్తుందని, అయితే రాజకీయ పోరాటకాలంలో విప్లవకారులు ఇలాంటి భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలని చెప్పడమే లెనిన్ ఉద్దేశ్యమని హెలెన్ వివరిస్తుంది.

1917 విప్లవానంతరం బోల్షివిక్‌ల (ప్రజల) రోజువారీ జీవితాలు ఎలా ఉన్నాయో పరిశీలించడం మీద లెనిన్ అత్యంత శ్రద్ధపెట్టాడు. స్మోల్నీ ఇన్‌స్టిట్యూట్‌లో ఉన్న తన నివాసాన్ని వదిలి లెనిన్ ఎక్కడికిబడితే అక్కడికి ఏ వాహనం దొరికితే ఆ వాహనంలో ప్రయాణించి ప్రజల స్థితిగతులను గమనించేవాడు. ట్రామ్‌బండిలో వెళతూ నగరంలో ఎక్కడైనా గొడవలు జరుగుతున్నాయా అని ఆరా తీసేవాడు. ఎక్కువగా కారులో తిరిగేవాడు. తనవెంట కారుడ్రైవర్, అంగరక్షకుడు 'గిల్' మాత్రమే ఉండేవాళ్లు. ఒకసారి పోలీసులు ఆపి ముగ్గుర్నీ అరెస్టు చేశారు కూడా (పోలీసులు లెనిన్‌ను గుర్తుపట్టలేదు). అల్లరిమూకలు వీళ్లకారుమీద కాల్పులు జరిపిన సందర్భాలూ ఉన్నాయి. ఒకసారి బందిపోట్లు పోలీసుల వేషంలో ఎదురయి వీళ్లు ప్రయాణిస్తున్న కారుని దొంగిలించుకుపోయారు. లెనిన్, గిల్– ఇద్దరూ కాలి నడకన పోయి దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వెళ్ళారు. 1918 ఆగస్టు 30న లెనిన్ ఒక ఫ్యాక్టరీని సందర్శించి ఆనక గేటు బయట ఫ్యాక్టరీ కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా దుండగీడు లెనిన్‌మీద కాల్పులు జరిపాడు. గిల్, లెనిన్‌ను క్రెమ్లిన్‌కు హుటాహుటిన తరలించారు. ఆ సమయానికి అక్కడ డాక్టర్ అందుబాటులో లేడు. నెజ్దా కృపస్కయా దగ్గర్లో ఉన్న పచారి కొట్టు దగ్గర్నించి నిమ్మకాయలు తెమ్మని పురమాయించడం వంటి కొత్త సంగతులు మనకీ పుస్తకంలో కనిపిస్తాయి.

లెనిన్ చారిత్రక లక్ష్యసాధకుడు అయ్యాడంటే... విప్లవాన్ని దాని నిర్వచనానికి మించి ఆలోచించగలిగిన లెనిన్ మేధస్సే దానికి కారణం అని రచయిత్రి నొక్కి చెబుతుంది. విప్లవమంటే తార్కిక భాషలో చెప్పుకోవాలంటే ఊహాజనిత శక్తి విస్ఫోటనం చెందడం. ఇదెలా ఉంటుందంటే ఇంతటి విస్ఫోటన శక్తీ తెల్లారేసరికి చప్పబడిపోయే ప్రమాదం ఉంది. కాని లెనిన్ ఈ శక్తిని లక్ష్యసాధన పూర్తయ్యే వరకూ నిలబెట్టగలిగాడు. ఇంకొంత మంది ఉన్నారు. విప్లవం ఎక్కడ విఫలం అయిపోతుందో అన్న అనుమానంతో మాటలు చెబుతూ, విప్లవాన్ని కీర్తిస్తూ, దాన్ని కావిలించుకుంటూ ఉండిపోతారు తప్ప పనిలోకి దిగరు. ఇందుకుభిన్నంగా లెనిన్‌కి ఉన్న విలక్షణత వల్లనే ఆయన ఇరవయ్యవ శతాబ్దపు రాజకీయవేత్త కాగలిగాడు. ప్రజల శతాబ్దపు ఆకాంక్షను వాస్తవరూపంలోకి తీసుకురాగలిగాడు.

19వ శతాబ్దం అంతా అనేకానేక ఊహాజనిత సోషలిజాలతోపాటు, శాస్త్రీయ సోషలిజం కూడా బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. భవిష్యత్తు సోషలిజానిదే అన్న ఆకాంక్ష ఎల్లెడలా విస్తరించింది. ఆ ఆకాంక్షను 20వ శతాబ్దపు తొలిపాదంలో సాకారం చేసినవాడు, ఒక కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించినవాడు లెనిన్.

1920, నవంబర్ 7న, అక్టోబర్ విప్లవం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా పెట్రోగ్రాడ్‌లో 'వింటర్‌ప్యాలస్' ముట్టడి ప్రదర్శన ఇచ్చారు. వేలాదిమంది కార్మికులు, సైనికులు, విద్యార్థులు కళాకారులు టీ, వేడిజావ, యాపిల్ పళ్ళు మాత్రమే ఆహారంగా తీసుకుని, రేయింబవళ్ళూ శ్రమించి 1917లో జరిగిన 'వింటర్ ప్యాలస్ ముట్టడి' రూపకం ప్రదర్శించారు. సైనిక అత్యున్నాధికారులు, రెడ్ గార్డులు, ప్రతిభా సంపన్నమైన కళాకారులు, సంగీతకారులు, దర్శకులు ఎందరో ఈ కృషిలో భాగం అయ్యారు. ప్రదర్శనకారులలో అత్యధికులు 1917 ముట్టడిలో స్వయంగా పాల్గొన్నవాళ్ళు కూడా. 1917 నాటి వాస్తవిక సంఘటనకు కళారూపం ఇచ్చేనాటికి – 1920 నాటికి – పెట్రోగాడ్ యుద్ధ దిగ్బంధనంలో ఉంది. ఆహార సరుకుల కొరతతో అలమటిస్తోంది. విక్టర్ షోకల్‌వ్‌స్కీ అయితే ఈ ప్రదర్శన చూసి 'జీవ రేణువులన్నీ కలిసి కళారూపంలో రూపాంతరం చెందే సంవిధానం ఇది' అని ఎంతో గొప్పగా మెచ్చుకున్నాడు. అక్టోబర్ విప్లవం మహత్తరమైనది ఎందుకయ్యిందంటే ఇదేదో కొంతమంది బోల్షివిక్‌లు చేసిన తిరుగుబాటు కాదు. బానిస సంకెళ్ళను తెంచుకునే మానవ సామూహిక శక్తి విశ్వరూప ప్రదర్శన ఇది. 'రాజ్యం–విప్లవం' అన్న రచనే కాదు ఆ కాలపు లెనిన్ ఇతర రచనలూ ఇప్పటికీ తమ ప్రాసంగికతను (రిలవెన్స్‌ను) కోల్పోలేదు. ఉదాహరణకు చెప్పుకోవాలంటే 'కమ్యూనిజం–అతివాద బాలారిష్టం' అన్న పుస్తకం, అలాగే ఆర్థికతత్వానికి వ్యతిరేకంగా చేసిన రచనలు. రాజకీయ ఉగ్రవాదం అనండీ, అతివాద కమ్యూనిజం అనండీ... అది సైద్ధాంతిక రాజకీయ నిరాశ్రయతకు (డిస్‌ప్లేస్‌మెంట్) కొండ గుర్తు అంటాడు లెనిన్. వాస్తవ సాధ్యాలకు ఉండే పరిమితులు గుర్తించక పోవడమే అతివాద

"లెనిన్ చారిత్రక లక్ష్యసాధకుడు అయ్యాడంటే... విప్లవాన్ని దాని నిర్వచనానికి మించి ఆలోచించగలిగిన లెనిన్ మేధస్సే దానికి కారణం అని రచయిత్రి నొక్కిచెబుతుంది. విప్లవమంటే తార్కిక భాషలో చెప్పుకోవాలంటే ఊహాజనిత శక్తి విస్ఫోటనం చెందడం. ఇదెలా ఉంటుందంటే ఇంతటి విస్ఫోటన శక్తీ తెల్లారేసరికి చప్పబడిపోయే ప్రమాదం ఉంది. కాని లెనిన్ ఈ శక్తిని లక్ష్యసాధన పూర్తయ్యే వరకూ నిలబెట్టగలిగాడు."

> **" చాలామంది ఆధునిక వామపక్షవాదుల్లో ఒక భావన ఉంది. మానవ సంబంధాలు, సంస్కృతుల మీద భౌతిక సంపద సృష్టి, సాంకేతిక పరిజ్ఞానం ఆధిపత్యం చలాయించడం రాజకీయ నియంతృత్వపు ఫలితమే అన్న సూత్రీకరణ చేస్తున్నారు. దీన్నే మనం తిరగేసి చూడాలంటాను నేను. "**

బాలారిష్టం అని చెబుతాడు. ఆనాడు జాకోబియన్‌లు చేపట్టిన ఉన్మాద ఉగ్రవాద చర్యలు ఆర్థికవ్యవస్థ పునాదులను (ప్రైవేటు ఆస్తిహక్కు తదితరాలను) సడలించలేని వారి అశక్తతకు సాక్ష్యం అని వివరిస్తాడు. రాజకీయ కచితత్వం 'అతి' కావడం వల్లనే ఈనాడు వర్ణవివక్ష, లింగవివక్ష వంటి సమస్యలను అధిగమించ లేకపోతున్నాం.

చాలామంది ఆధునిక వామపక్షవాదుల్లో ఒక భావన ఉంది. మానవ సంబంధాలు, సంస్కృతుల మీద భౌతిక సంపద సృష్టి, సాంకేతిక పరిజ్ఞానం ఆధిపత్యం చలాయించడం రాజకీయ నియంతృత్వపు ఫలితమే అన్న సూత్రీకరణ చేస్తున్నారు. దీన్నే మనం తిరగేసి చూడాలంటాను నేను. రాజకీయ ఉగ్రవాదం దేనికి సంకేతం? భౌతిక సంపద సృష్టి రాజకీయాలకు లోబడి ఉండడం మూలంగా కాదు. నాటి జాకోబియన్‌ల నుండి నేటి మావోయిస్టు సాంస్కృతిక విప్లవకారుల వరకూ అనుసరించిన, అనుసరిస్తున్న రాజకీయ ఉగ్రవాదం రాజకీయ కార్యక్షేత్రాన్ని వదిలి ఉత్పత్తి నిరాశ్రయతమీద అంటే ఆర్థికాంశాలమీద దృష్టిపెట్టి చేస్తున్నదే.

ఆర్థికతత్వానికి వ్యతిరేకంగా లెనిన్ తీసుకున్న వైఖరి ఇవాల్టికీ కీలకమైనదే. వామపక్షవాదులలో ఆర్థికవిధానాలమీద భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఒకవంక రాజకీయవేత్తలు ఆర్థిక వ్యవస్థను పోరాటాలకు వీలులేని, జోక్యం చేసుకోవడానికి వీలులేని క్షేత్రంగా మార్చేశారు. మరోవంక ఆర్థికవేత్తలేమో రాజకీయ జోక్యానికి తావుఇవ్వని నేటి ప్రపంచ పెట్టుబడి వనితీరును చూసి ముచ్చటపడిపోతున్నారు. అందుకే గతం కన్నా నేడు లెనిన్ అవసరం మనకు ఎక్కువగా ఉంది.

నిజం. ఆర్థికవ్యవస్థే కీలకమైన కార్యక్షేత్రం. యుద్ధం నిర్ణయించబడేది అక్కడే. ఆర్థిక వ్యవస్థమీద ఆధిపత్యం వహిస్తున్న గ్లోబల్ పెట్టుబడిపై చావుదెబ్బ కొట్టాలి. అయితే ఇందుకు ఆర్థిక సాధనాలు ఉండవు. ఉండేదల్లా రాజకీయ సాధనాలే. నేడు పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా మాట్లాడడం హాలీవుడ్‌లో కూడా ఫ్యాషనయిపోయింది. రాజ్యానికి శత్రువు, లోపలి మనిషి (ఎనిమీ ఆఫ్ ది స్టేట్, ఇన్‌సైడర్) వంటి కుట్ర సినిమాలు కూడా వచ్చాయి. లాభాలకోసం వెంపర్లాడే బహుళజాతి కార్పొరేట్ కంపెనీలే ఈ సినిమాల్లో మనకు కనిపించే విలన్లు. అక్కడితో పెట్టుబడిదారీ వ్యతిరేకత ఆగిపోతుంది. సినిమా సుఖాంతం కావాలి కాబట్టి స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం–ఇవి రెండూ కావాలి అనే గంభీరమైన పిలుపులతో శుభం కార్డు పడుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ దుర్మార్గాలన్నీ ఈ రెంటితో అంతమైపోతాయని చెప్పడంకన్నా హాస్యాస్పదం మరొకటి లేదు. దీన్నే ఉదారవాద ప్రజాస్వామ్యం అంటాం. ఒక దేశంలో దీన్ని లిబరల్ డెమొక్రసీ అంటారు, ఇంకోచోట సోషల్ డెమొక్రసీ అంటారు. ఏ ప్రజాస్వామ్యంలో అయినా పెట్టుబడి మాత్రం కులాసాగా తనపని తాను చేసుకుపోతుంటుంది. కాని ప్రజాస్వామ్యం కావాలన్నా, స్వేచ్ఛ కావాలన్నా పెట్టుబడిదారీ వ్యవస్థను సవాలు చెయ్యాల్సిందే, దానితో తలపడాల్సిందే.

అందుకే లెనిన్ దగ్గరనుంచి మనం నేర్చుకోవాల్సిన గుణపాఠం ఏమిటంటే లిబరల్ డెమొక్రసీ, సోషల్ డెమొక్రసీలను చాపచుట్టి అవతల పారెయ్యాలి. ప్రైవేటు ఆస్తిహక్కులేని ఈ రెండు ప్రజాస్వామ్యాలూ బతికి బట్టకట్టలేవు. నికార్సుగా మనం పెట్టుబడిదారీ వ్యతిరేకతను ప్రదర్శించాలంటే ఈ రెండు ప్రజాస్వామ్యాల మీద ఉన్న మోజును వదిలిపెట్టాల్సిందే.

1990వ దశకంలో సోవియట్, తూర్పు యూరప్ దేశాలలో కమ్యూనిజం కదలబారిపోయినాక ఏం జరిగింది. రాజకీయ ప్రజాస్వామ్యం పేరిట ఉత్పత్తి సాధనాల మీద ప్రైవేటు యాజమాన్యహక్కులు కల్పించబడ్డాయి. రాజకీయ ప్రజాస్వామ్యం విచ్చలవిడిగా ప్రైవేటీకరణకు దారితీసింది. కమ్యూనిస్టుల హయాంలో జాతీయం చేసిన ఆస్తులు, భూములు, ఫ్యాక్టరీలు, వనరులను ప్రైవేటు వ్యక్తులు హక్కుభుక్తం చేసుకున్నారు. అంటే ఆస్తిహక్కు, దోచుకనే హక్కు ప్రజాస్వామ్యానికి పునాదిగా మారాయి. కానీ విచిత్రం చూశారూ అగ్ర పెట్టుబడిదారీ దేశాలన్నింటా నేడు ప్రైవేటు యాజమాన్య హక్కు 'రెగ్యులేటరీ' పాత్రను కోల్పోతున్న దశలో మాజీ సోషలిస్టు దేశాలలో యాజమాన్య హక్కులకోసం పెట్టుబడిదారుల వెంపర్లాట మొదలయ్యింది. 'సెల్ఫ్ ట్రేడ్' (స్వంత వ్యాపారం) అనే ఇంటర్నెట్ బ్రోకర్ ఫ్రెంచి భాషలో ఇచ్చిన ఒక వాణిజ్య ప్రకటనమీద జాన్ బేరర్ ఇలా వ్యాఖ్యానించారు. బంగారంతో చేసి వజ్రాలు పొదిగిన సుత్తి–కొడవలి ఛాయాచిత్రం కింద 'స్టాక్ మార్కెట్ అందరికీ లాభాలు సంపాదించి పెడితేనో' అన్న క్యాప్షన్ రాసి ఉంటుంది. 'స్టాక్ మార్కెట్‌లో సకల జనులూ భాగస్వాములు కావచ్చు' అన్న సందేశాన్ని కమ్యూనిస్టు సమానత్వంతో చెప్పడానికి సుత్తి కొడవలి ఛాయాచిత్రాన్ని ఉపయోగపెట్టారు ఈ వాణిజ్య ప్రకటనలో. బెర్జర్ ఏమంటాడంటే– బంగారంతో చేసి వజ్రాలు పొదిగిన సుత్తి కొడవలి బదులు స్వస్తిక్ గుర్తును వాడి ఉంటేనో–ఎలా ఉండేది? ఏం జరిగేది? ఆ ప్రకటన తుస్సుమనేది. స్వస్తిక్ గుర్తు గెలవబోయే వాళ్ళ చిహ్నం తప్ప ఓడిపోయిన వాళ్ళది కాదు. అంతకుమించి స్వస్తిక్ చిహ్నం న్యాయానికి గాకుండా ఆధిపత్యానికి కొండగుర్తు. అందుకే వాణిజ్య ప్రకటనదారుడు సుత్తీ కొడవలి గుర్తు వాడాడు. 'సమానత్వం, న్యాయం' లభిస్తాయనే ఆశ రేకెత్తించడం కోసం. కాని 'ఆధిపత్య భావజాలం వాళ్ళేమో' అలాంటి ఆశలేం పెట్టుకోకండి అది ఎప్పుడో చచ్చిపోయింది అంటున్నారు. 'ఇజాలకు', కాలం చెల్లిపోయిందంటున్నారు. 'చరిత్ర పరిసమాప్తి' అంటున్నారు. ఎవరో తెలుసుగా. అగ్రరాజ్యాధిపతులూ, వారిబంట్లు.

**(అనువాదం : కె. సత్యరంజన్)**

# లెనినిజం అంటే ఏమిటి?



స్టాలిన్

రష్యాలో వున్న నిర్ధిష్ట పరిస్థితులకు మార్క్సిజాన్ని అన్వయించటం లెనినిజమని కొందరంటారు. ఈ నిర్వచనంలో కొంత సత్యం ఉంది. కాని అది మాత్రమే సంపూర్ణ సత్యం కాదు. లెనిన్ రష్యన్ పరిస్థితులకు మార్క్సిజాన్ని వర్తింపచేసింది నిజమే. దాన్ని మహా ప్రతిభావంతంగా కూడా వర్తింప జేశాడు. కాని రష్యాలోని నిర్ధిష్ట పరిస్థితులకు మార్క్సిజాన్ని వర్తింపజేయడం మాత్రమే లెనినిజం అయితే అది కేవలం జాతీయమైనదే అవుతుంది. కేవలం రష్యాకు సంబంధించినదే అవుతుంది. ఏమైనా మనకు తెలుసు అది కేవలం రష్యాకు సంబంధించిందే కాదు. అంతర్జాతీయ స్వభావం గలది. మొత్తం అంతర్జాతీయ పరిణామంలో లెనినిజం పాతుకుపోయి ఉందని మనకు తెలుసు. కాబట్టి ఈ నిర్వచనం పాక్షికమని నేను భావిస్తాను.

19వ శతాబ్దం 40వ దశకంలోని మార్క్సిజం విప్లవ పోకడలను పునరుద్ధరించేదే లెనినిజమని కొందరంటారు. అందువల్ల అది ఆ తర్వాత కాలంలో మితవాదంతో కూడినదీ, విప్లవ సారం లేనిదీ అయిందనీ, ఆ విధంగా అది మార్క్సిజం నుండి వేరుపడిందని మరికొందరంటారు. మార్క్స్ ఉపదేశాలను రెండు భాగాలుగా అంటే విప్లవాత్మకమైనదీ, మితవాదంతో కూడినదీ అనే విధంగా విభజించడమే బుద్ధి తక్కువ తనం, మొరటు దృక్పథం. మనం అత్యంత అసంపూర్ణమైన, అసంతృప్తికరమైన నిర్వచనాన్ని తిరస్కరిస్తూనే, అయితే ఇందులో కూడా కొద్దిపాటి సత్యమున్నదని అంగీకరించాలి. రెండవ ఇంటర్నేషనల్‌కు చెందిన అవకాశవాదులచే మరుగుపరచబడిన మార్క్సిజపు విప్లవ సారాన్ని లెనిన్ పునరుద్ధరించాడన్నదే ఈ కొద్దిపాటి సత్యం. మరి లెనినిజాన్ని గురించి సంపూర్ణ సత్యమేమిటి? లెనినిజం మార్క్సిజాన్ని పునరుద్ధరించడమే కాదు, దానిని మరో మెట్టు ముందుకు తీసుకుపోయింది. అది పెట్టుబడిదారీ విధానంలోని శ్రామికవర్గపు వర్గ పోరాటాల నూతన పరిస్థితులలో మార్క్సిజాన్ని మరింత అభివృద్ధి గావించింది.

**అయితే అంతిమంగా లెనినిజం అంటే ఏమిటి?**

లెనినిజం అనేది సామ్రాజ్యవాద శ్రామికవర్గ విప్లవ శకానికి చెందిన మార్క్సిజం. ఇంకా సరిగ్గా చెప్పాలంటే లెనినిజం అనేది శ్రామికవర్గ సాధారణ విప్లవ సిద్ధాంతమూ–ఎత్తుగడలు, ప్రత్యేకంగా శ్రామికవర్గ నియంతృత్వ సిద్ధాంతమూ–ఎత్తుగడలూను. మార్క్స్, ఎంగెల్సులు విప్లవ దశకు పూర్వపు దశలో (శ్రామిక వర్గ విప్లవానికి ముందు అనే అర్థంలో నేను వాడుతున్నాను.) తమ కార్యకలాపాలు సాగించారు. అప్పటికి అభివృద్ధి చెందిన సామ్రాజ్యవాదం ఇంకా ఏర్పడలేదు. విప్లవానికి శ్రామికులు తయారయ్యే దశలోనే వున్నారు. శ్రామికవర్గ విప్లవం తక్షణ వాస్తవికతగా ముందుకు రాలేదు. అయితే మార్క్స్, ఎంగెల్స్‌ల శిష్యుడైన లెనిన్ తన కార్యకలాపాలను అభివృద్ధి చెందిన సామ్రాజ్యవాద దశలో, శ్రామికవర్గ విప్లవం ప్రభవిస్తూ ఉన్న దశలో, శ్రామికవర్గ విప్లవం అప్పటికే ఒక దేశంలో జయించి బూర్జువా ప్రజాతంత్రాన్ని భగ్నం చేసి శ్రామికవర్గ ప్రజాతంత్ర శకాన్ని అంటే సోవియట్ల శకాన్ని ప్రవేశపెట్టిన కాలంలో సాగించాడు.

అందువల్ల లెనినిజం అనేది మార్క్సిజం అభివృద్ధిలో తదుపరి దశ.

లెనినిజం తీవ్రమైన మిలిటెంట్ స్వభావం, తీవ్రమైన విప్లవ స్వభావాన్ని కలిగి ఉన్నదన్న విషయాన్ని చూపించడం మామూలుగా జరిగేదే. అది పూర్తిగా సరైనదే. ఇది రెండు కారణాల వల్ల జరుగున్నది. శ్రామికవర్గ విప్లవం నుంచి లెనినిజం పుట్టింది కాబట్టి దాని ముద్ర శ్రామికవర్గ విప్లవంపై కనిపించక మానదు. ఇది ఒకటి. ఇక రెండవది, లెనినిజం రెండవ ఇంటర్నేషనల్ అవకాశవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పెరిగి బలపడింది. పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా జయప్రదమైన పోరాటాన్ని సాగించాలంటే ఇటువంటి పోరాటం అప్పుడూ, ఇప్పుడూ కూడా అతి ప్రధానమైన ప్రాథమిక అవసరం. ఒక విషయాన్ని మనం మరచిపోగూడదు. ఒకవైపున మార్క్స్, ఎంగెల్సులు, రెండో వైపున లెనిన్ వీరి మధ్యవున్న మొత్తం కాలంలో రెండవ ఇంటర్నేషనల్‌కు చెందిన అవకాశవాదం అవిచ్ఛిన్నంగా సాగింది. ఈ అవకాశవాదానికి వ్యతిరేకంగా నిర్ధాక్షిణ్యమైన పోరాటాన్ని సాగించటం లెనినిజపు అతి ప్రధానమైన కర్తవ్యాలలో ఒకటిగా వుండటం తప్పనిసరైంది.

**లెనినిజపు చారిత్రక మూలాలు**

సామ్రాజ్యవాద పరిస్థితులలో పెట్టుబడిదారీ విధానంలోని వైరుధ్యాలు అతి తీవ్రదశకు చేరుకున్న తరుణంలో, శ్రామికవర్గ విప్లవం తక్షణ వాస్తవిక సమస్యగా ముందుకొచ్చిన తరుణంలో, కార్మిక వర్గం విప్లవానికి సన్నాహాలు గావిస్తూ పెట్టుబడిదారీ విధానంపై సూటిగా దాడిచేసేందుకు సిద్ధమైన తరుణంలో లెనినిజం పెరిగి రూపుదిద్దుకున్నది.

సామ్రాజ్యవాదాన్ని లెనిన్ 'జీర్ణావస్థలో వున్న పెట్టుబడిదారీ విధానం' అన్నారు. ఎందువల్ల? ఎందుకంటే, పెట్టుబడిదారీ విధానంలోని వైరుధ్యాలను సామ్రాజ్యవాదం

"పెట్టుబడిదారీ విధానం, వలస విధానం, సైనిక నియంతృత్వం మొదలైన అన్ని రకాల పీడనలకు పుట్టినిల్లు జారిస్టు రష్యా. ఇవి అత్యంత అమానుషమైన, కర్కశమైన రూపంలో ఈ దేశంలో వున్నాయి కదా. రష్యాలో పెట్టుబడికి సంబంధించిన అక్షయ శక్తి జారిజం నిరంకుశత్వంతో పెనవేసుకు పోయింది. రష్యన్ జాతీయత యొక్క దురాక్రమణ స్వభావమూ, రష్యనేతర ప్రజలపై జారు ప్రభుత్వం సాగించే మానవ హననం రెండూ పెనవేసుకుపోయాయి."

చివరివరకూ అంటే, విప్లవం వరకు తీసకు పోతుంది గనక. ఈ వైరుధ్యాలలో మూడింటిని అత్యంత ప్రధానమైనవిగా భావించాలి.

శ్రమకూ, పెట్టుబడికీ మధ్యవున్న వైరుధ్యం ***మొదటి వైరుధ్యం:*** సామ్రాజ్యవాదమంటే పారిశ్రామిక దేశాలలో గుత్తాధికారం గల ట్రస్టుల, సిండికేట్ల, బ్యాంకుల, ఫైనాన్షియల్ కుటుంబాల అక్షయ శక్తి. ఈ అక్షయశక్తికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కార్మికవర్గానికి అది సాంప్రదాయకంగా ఉపయోగించే ట్రేడ్ యూనియన్లు, సహకార సంస్థలు, పార్లమెంటరీ పార్టీలు, పార్లమెంటరీ పోరాటం వగైరా పద్ధతులు ఏ మాత్రమూ చాలవు. పెట్టుబడి ముందు నీవు మోకరిల్లనైనా మోకరిల్లు, వెనుకటి వలె దరిద్రంతో కొట్టుమిట్టాడుతూనైనా వుండు. ఇంకా ఇంకా మునిగిపోతూ వుండు. లేదా ఒక నూతన ఆయుధాన్ని చేబట్టు.... ఇదీ విస్తారమైన శ్రామిక ప్రజా బాహుళ్యం ముందు సామ్రాజ్యవాదం పెట్టే ప్రత్యామ్నాయం. కార్మికవర్గాన్ని, సామ్రాజ్యవాదం విప్లవం వైపుకు నెడుతుంది.

వివిధ ఫైనాన్షియల్ ముఠాల మధ్య, సామ్రాజ్యవాద రాజ్యాల మధ్య ముడి పదార్థాల వనరుల కోసం, విదేశీ భూభాగాల కోసం సాగే పోరాటం **రెండవ వైరుధ్యం:** సామ్రాజ్యవాదం అంటే..ముడి వస్తువులు దొరికేచోట్లకు పెట్టుబడిని ఎగుమతి చేయటం, ఈ ప్రదేశాలను తమ గుత్తాధిపత్యంలో నిలబెట్టుకొనడానికి ఆవేశంతో జరిపే పోరాటం, ఇదివరకే విభజించబడివున్న ప్రపంచాన్ని తిరిగి విభజించుకోవడానికై జరిపే పోరాటం, ఇది వరకే తాము సంగ్రహించిన వాటికి గట్టిగా పట్టుకు వేళ్ళాడే పాతముఠాలకు, పాతరాజ్యాలకూ వ్యతిరేకంగా తాము 'వెలుగులోకి రావాలని' అంగలార్చే కొత్త ఫైనాన్షియల్ ముఠాలూ, రాజ్యాలూ అతి భయంకరంగా సాగించే పోరాటం. ఈరకమైన విభిన్న పెట్టుబడిదారీ ముఠాల మధ్య పిచ్చి ఆవేశంతో జరిగే ఈ పోరాటంలో గమనార్హమైనదేమిటంటే, సామ్రాజ్యవాద యుద్ధాలు, విదేశీ భూభాగాలను ఆక్రమించుకోవడానికి జరిగే యుద్ధాలుగా మారుతాయి. ఈ పరిస్థితి తిరిగి మరో గమనార్హమైన విషయానికి దారితీస్తుంది. సామ్రాజ్యవాదులు పరస్పరం బలహీనపరచుకోవడానికి దారితీస్తుంది. జనరల్‌గా పెట్టుబడిదారీ విధానం బలహీనపడటానికి దారితీస్తుంది. శ్రామికవర్గ విప్లవాన్ని త్వరితం చేస్తుంది. ఈ విప్లవం వాస్తవంలో తప్పనిసరి అయ్యేట్లు చేస్తుంది.

కొద్దిపాటి పాలక దేశాలకు అంటే 'నాగరిక' దేశాలుగా పిలవబడుతున్న దేశాలకూ, ప్రపంచంలోని కోటానుకోట్ల వలస పరాధీన ప్రజలకూ మధ్యగల వైరుధ్యం ***మూడవ వైరుధ్యం:*** విస్తారమైన వలస దేశాలలోనూ, పరాధీన దేశాలలోనూ నివసించే కోటానుకోట్ల మందిని ఎలాంటి సిగ్గు బిడియాలు లేకుండా దోపిడీ చేయడం, అత్యంత అమానుషంగా అణచివేయడమే సామ్రాజ్యవాదం. ఈ అణచివేత, దోపిడీల లక్ష్యం అత్యధిక లాభాలను పిండటమే. కానీ ఈ దేశాలను దోపిడీ చేయడంలో సామ్రాజ్యవాదం అక్కడ రైలు రోడ్లను, ఫ్యాక్టరీలను, మిల్లులనూ నిర్మించవలసి వస్తోంది. పారిశ్రామిక, వాణిజ్య కేంద్రాలను సృష్టించవలసివస్తోంది. ఈ 'విధానం' ఫలితంగా శ్రామిక ప్రజల వర్గం ఏర్పడటమూ, జాతీయ మేధావి బృందము ఆవిర్భవించడమూ, విముక్తి కోసం ఉద్యమాలు పెరగడమూ తప్పనిసరిగా జరిగి తీరతాయి. ఈ పరిస్థితి శ్రామిక వర్గానికి చాలా ప్రధానమైనది. ఎందువల్లంటే, వలస దేశాలు, పరాధీన దేశాలూ సామ్రాజ్యవాదపు రిజర్వులుగా వుండే స్థితి నుండి శ్రామికవర్గ విప్లవ రిజర్వులుగా మార్చడం ద్వారా పెట్టుబడిదారీ విధానం తన స్థానాన్ని తానే అతి తీవ్రంగా కొల్లగొట్టుకుంటుంది.

పాత "వికసించే" పెట్టుబడిదారీ విధానాన్ని జీర్ణావస్థలో పడిన పెట్టుబడిదారీ విధానంగా మార్చిన సామ్రాజ్యవాదపు ప్రధాన వైరుధ్యాలు సాధరణంగా ఇవీ.

పది సంవత్సరాల క్రిందట ప్రారంభమైన సామ్రాజ్యవాద యుద్ధం ప్రాముఖ్యత ఏమిటంటే, ఇతర అంశాలెలా ఉన్నా అది ఈ వైరుధ్యాలనన్నింటినీ ఒకటిగా చేర్చి వాటిని సుడిగుండంలో పడేసింది. ఆ విధంగా శ్రామికవర్గ విప్లవ పోరాటాలను అది మరింత తీవ్రతరం చేసి అనుకూల పరిస్థితులను ఏర్పరచింది.

మరోరకంగా చెప్పాలంటే, సామ్రాజ్యవాదం విప్లవాన్ని వాస్తవికంగా, తప్పనిసరి అయ్యేట్లు చేయడమేగాక పెట్టుబడిదారీ విధానపు బురుజులపై సూటిగా దాడి చేయడానికి అనుకూలమయ్యే పరిస్థితుల్ని కూడా సృష్టించి పెట్టింది.

లెనినిజం ఆవిర్భావానికి కారణమైన అంతర్జాతీయ పరిస్థితి ఇదీ.

కొంతమంది ఇలా అనవచ్చు: ఇదంతా బాగానే వుంది. కాని దీనికీ రష్యాకూ సంబంధమేమిటి అని. రష్యా పురాణ ప్రసిద్ధమైన సామ్రాజ్యవాదం కాదు, కాజాలదే? దీనికీ లెనిన్‌కీ సంబంధమేమిటి? ఆయన ప్రధానంగా రష్యా కోసమే కృషి చేశారే? అనేక దేశాలుండగా రష్యాయే లెనినిజం నివాస స్థలం ఎందుకు కావాలి? శ్రామిక వర్గ విప్లవ సిద్ధాంతము, ఎత్తుగడల పుట్టినిల్లు రష్యానే ఎందుకు కావాలి?

ఎందుకంటే, సామ్రాజ్యవాదంలో వున్న ఈ అన్ని వైరుధ్యాలూ కేంద్రీకృతమయ్యే విధంగా రష్యా వుండటం వల్లే. ఏ ఇతర దేశం కంటే కూడా రష్యాయే విప్లవపు గర్భధారణ గావించటంవల్లే. ఈ దేశం మాత్రమే ఈ వైరుధ్యాలను విప్లవ పద్ధతిలో పరిష్కరించగల స్థానంలో వుండటం వల్లే.

పెట్టుబడిదారీ విధానం, వలస విధానం, సైనిక నియంతృత్వం మొదలైన అన్ని రకాల పీడనలకు పుట్టినిల్లు జారిస్టు రష్యా. ఇవి అత్యంత అమానుషమైన, కర్కశమైన రూపంలో ఈ దేశంలో వున్నాయి కదా. రష్యాలో పెట్టుబడికి సంబంధించిన అక్షయ శక్తి జారిజం నిరంకుశత్వంతో పెనవేసుకుపోయింది. రష్యన్ జాతీయత యొక్క దురాక్రమణ స్వభావమూ, రష్యనేతర ప్రజలపై జారు ప్రభుత్వం సాగించే మానవ హననం రెండూ పెనవేసుకుపోయాయి. టర్కీ, ప్రష్యా, చైనా మొదలైన విస్తార ప్రాంతాలను జారు ప్రభుత్వం

ఆక్రమించుకొని ఆ ప్రజలపై తీవ్రమైన దోపిడీ సాగించింది. జారిజం అనేది ''సైనిక నియంతృత్వ ఫ్యూడల్ సామ్రాజ్యవాదం'' అని లెనిన్ సరిగ్గానే చెప్పాడు. సామ్రాజ్యవాదం లోని అతి క్రూరమైన స్వభావం రెట్టింపై కేంద్రీకరింపబడి వుండటమే జారిజం అంటే.

జారిస్టు రష్యా పాశ్చాత్య సామ్రాజ్య వాదానికి అపారమైన రిజర్వుగా ఉంది: రష్యా ఆర్థిక వ్యవస్థలోని ఇంధనం, లోహ పరిశ్రమలు వంటి కీలక రంగాల్లోకి విదేశీ పెట్టుబడికి స్వేచ్ఛా ప్రవేశం కల్గించడం మాత్రమే కాకుండా, పాశ్చాత్య సామ్రాజ్యవాదులకు లక్షోప లక్షల సైనికులను సమకూర్చగల్గటం ద్వారా కూడా రష్యా వారికి అపారమైన రిజర్వుగా ఉపయోగపడుతోంది. ఒక కోటి ఇరవై లక్షల రష్యన్ సైన్యం బ్రిటిష్, ఫ్రెంచి పెట్టుబడిదారుల అపారమైన లాభాలను సంరక్షించటానికై సామ్రాజ్యవాద యుద్ధ రంగాలలో రక్తాన్ని ధారపోసిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

మరోవిషయం ఏమంటే, జారిజం అనేది యూరపు తూర్పు ప్రాంతంలో సామ్రాజ్య వాదపు కావలి కుక్కగా వుండటమే కాదు, పారిస్, లండన్, బెర్లిన్, బ్రసెల్సులలో చేసిన అప్పులపై వడ్డీల పేరిట కోటాను కోట్ల రూబుల్సును ప్రజల నుండి పిండటానికి పాశ్చాత్య సామ్రాజ్యవాదపు ఏజెంటుగా కూడా అది వ్యవహరిస్తున్నది.

చివరి విషయం ఏమంటే, టర్కీ, ప్రష్యా, చైనా మొదలైన దేశాల విభజనలో జారిజం పాశ్చాత్య సామ్రాజ్యవాదానికి అతి నమ్మకమైన మిత్రుడిగా వున్నది. సామ్రాజ్యవాదులతో కలిసి జారిజం సామ్రాజ్యవాద యుద్ధాన్ని సాగించిం దనీ, ఆ యుద్ధంలో రష్యా ఒక ప్రధాన శక్తియనీ ఎవరికి తెలియదు?

అందువల్లే జారిజం ప్రయోజనాలు, పాశ్చాత్య సామ్రాజ్యవాదం ప్రయోజనాలు పెనవేసుకుపోయి, చివరకు ఒకే రకపు సామ్రాజ్యవాద ప్రయోగాలుగా మిళితమై పోయాయి. పాశ్చాత్య సామ్రాజ్యవాదం తూర్పున ఇటువంటి బలమైన అండను పోగొట్టుకోడానికి ఇష్ట పడుతుందా? పాత జార్జిస్టు బూర్జువా రష్యావంటి ఒక బలసంపన్నమైన శక్తి యొక్క మూల సంపదను పోగొట్టు కొనడానికి ఇష్టపడుతుందా? జారిజాన్ని సంరక్షించే, దాన్ని నిలబెట్టే లక్ష్యంతో రష్యన్ విప్లవానికి వ్యతిరేకంగా తన శక్తి కొద్దీ జీవన్మరణ పోరాటం సాగించకుండా పూరుకుంటుందా? ఎన్నటికీ పూరుకోదు.

> **"దీన్ని బట్టి ఒకటి తేలుతోంది. ఎవరు జారిజంపై చెయ్యెత్తాడో అతను తప్పనిసరిగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కూడా చెయ్యెత్తాడన్నమాట. ఎవడు జారిజానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాడో అతను సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినవాడవుతాడు. ఎందువల్లనంటే, జారిజాన్ని కేవలం ఓడించటమనే కాకుండా వాస్తవానికి పూర్తిగా తుడిచిపెట్టాలని కోరే ఎవరైనాసరే జారిజాన్ని కూలద్రోయాలంటే సామ్రాజ్యవాదాన్ని కూడా కొల్లగొట్టాలి."**



1919లో జోసఫ్ స్టాలిన్, మిఖాయిల్ కలినిన్‌తో లెనిన్

దీన్ని బట్టి ఒకటి తేలుతోంది. ఎవరు జారిజంపై చెయ్యెత్తాడో అతను తప్పనిసరిగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కూడా చెయ్యెత్తాడన్నమాట. ఎవడు జారిజానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాడో అతను సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినవాడవుతాడు. ఎందువల్లనంటే, జారిజాన్ని కేవలం ఓడించటమనే కాకుండా వాస్తవానికి పూర్తిగా తుడిచిపెట్టాలని కోరే ఎవరైనాసరే జారిజాన్ని కూలద్రోయాలంటే సామ్రాజ్యవాదాన్ని కూడా కొల్లగొట్టాలి. ఈ విధంగా జారిజానికి వ్యతిరేకంగా సాగే విప్లవం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగే విప్లవం అంచులకు శ్రామికవర్గాన్ని జేర్చుతుంది. తప్పనిసరిగా అది విప్లవంగా మారుతుంది.

ఈలోగా రష్యాలో ఒక బ్రహ్మాండమైన ప్రజావిప్లవం లేస్తూంది: దానికి ప్రపంచం లోకెల్ల విప్లవకరమైన శ్రామికవర్గం నాయ కత్వం వహిస్తున్నది. ఈ శ్రామిక వర్గానికి ముఖ్యమైన మిత్రుడిగా రష్యన్ విప్లవ రైతాంగం నిలిచి వున్నది. అటువంటి విప్లవం సగంలో ఆగలేదనీ, అది విజయం పొందే సందర్భంలో మరింత ముందుకు సాగితీరుతుందనీ, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తిరుగుబాటు ధ్వజాన్ని లేవనెత్తుతుందనీ వేరే చెప్పాలా?

అందువల్లే సామ్రాజ్యవాదంలోని వైరుధ్యాలన్నింటికీ కేంద్రస్థానంగా రష్యా వుండకతప్పలేదు. ఈ వైరుధ్యాలన్నింటి అతి హేయమైన, అతి అనూహ్యమైన స్వభావం రష్యాలో అత్యంత స్పష్టంగా బహిర్గత మయ్యింది. పాశ్చాత్య ఫైనాన్స్ పెట్టుబడిని ప్రాచ్యఖండంలోని వలస దేశాలతో కలుపుతూ, పాశ్చాత్య సామ్రాజ్యవాదానికి అతి ప్రధానమైన అండగా రష్యా వుంటూ వచ్చింది. అయితే ఈ కారణాలవల్ల మాత్రమే కాదు, సామ్రాజ్య వాదంలోని వైరుధ్యాలన్నిటినీ విప్లవ పద్ధతిలో పరిష్కారం చేయ సమర్థతగల ఒక వాస్తవిక శక్తి వున్న ఒకే ఒక దేశం రష్యాకావటం వల్ల కూడా వైరుధ్యాలన్నింటికీ అది కేంద్రంగా ఉండకతప్పలేదు.

దీన్ని బట్టి తేలేదేమిటంటే రష్యాలో విప్లవం శ్రామికవర్గ విప్లవం కాకుండా మరొకటిగా వుండజాలదు. ప్రారంభం నుండే అది అంతర్జాతీయ స్వభావాన్ని కలిగి ఉండకుండా వుండజాలదు. కాబట్టి అది ప్రపంచ సామ్రాజ్యవాదుల పునాదులనే ఊపివేయ కుండా వుండజాలదు.

ఇటువంటి పరిస్థితుల్లో రష్యన్ కమ్యూ నిజం, రష్యన్ విప్లవం, సంకుచిత జాతీయ


**"ఇరవయ్యవ శతాబ్దపు ప్రారంభంలో రష్యాలో సరిగ్గా ఇటువంటి పరిస్థితే మరింత తీవ్ర స్థాయిలో ఉందని చెప్పి తీరాలి. రష్యా అప్పుడు విప్లవ తొలి సంధ్యా కాలంలో వుంది. యూరపులో పరిస్థితులు, జర్మనీలో కంటే (ఇంగ్లాండ్ ప్రాంతం సంగతి సరేసరి) బాగా అభివృద్ధి పొందిన శ్రామికవర్గంతో ఈ విప్లవాన్ని రష్యా సాగించవలసి వచ్చింది. అంతేగాదు, మనకున్న భోగట్టా అంతా తెలిపేదేమిటంటే, ఈ విప్లవం శ్రామికవర్గ విప్లవాన్ని ప్రేరేపించే దానికి నాందీ ప్రస్తావనగా వుంటుంది."**

హద్దులకే పరిమితమై వుండగలవా? వుండలేవు. పైపెచ్చు దేశంలోని (గాఢమైన విప్లవ సంక్షోభం) విదేశాలలోని (యుద్ధం) మొత్తం పరిస్థితి ఈ హద్దులను దాటి వారు తమ తమ కృషిలో ముందుకు పోవునట్లుగా పురిగొల్పాయి. అంతర్జాతీయ రంగానికి పోరాటాన్ని విస్తృతం చేసేట్లుగా, సామ్రాజ్యవాదపు పుండ్లను బయట పెట్టేట్లుగా పెట్టుబడిదారీ విధానపు పతనం తప్పనిసరని రుజువు చేసేట్లుగా, చివరకు తమసొంత దేశంలోనే పెట్టుబడిదారీ విధానాన్ని కూలద్రోసేటట్లుగా శ్రామికవర్గానికి ఒక కొత్త పోరాట ఆయుధాన్ని అంటే శ్రామికవర్గ విప్లవ సిద్ధాంతం, ఎత్తుగడలను ఇవి అందించాయి. రష్యన్ కమ్యూనిస్టులు మరో విధంగా వ్యవహరించి వుండలేరు కూడా. ఎందువల్లనంటే ఈ పంథా మాత్రమే అంతర్జాతీయ పరిస్థితిలో కొన్ని మార్పులను తీసుకువచ్చి తద్వారా రష్యాలో బూర్జువా వ్యవస్థ పునరుద్ధరించబడకుండా చేయగలుగుతుంది.

అందువల్లే రష్యా లెనినిజానికి నిలయమైంది. అందువల్లే రష్యన్ కమ్యూనిస్టుల నాయకుడైన లెనిన్ దాని సృష్టికర్త అయ్యాడు.

గత 1840వ దశకంలో జర్మనీ విషయంలోనూ, మార్క్స్, ఏంగెల్సుల విషయంలోనూ ఏమి సంభవించిందో దాదాపు అదే రష్యా విషయంలోను, లెనిన్ విషయంలోను 'సంభవించింది'. ఇరవయ్యవ శతాబ్దపు ప్రారంభంలో రష్యావలే, అప్పుడు జర్మనీ బూర్జువా విప్లవపు గర్భధారణ గావించి వున్నది. అప్పుడు మార్క్స్ కమ్యూనిస్టు మానిఫెస్టోలో ఇలా రాశాడు:

కమ్యూనిస్టులు తమ దృష్టిని ప్రధానంగా జర్మనీ వైపు మళ్ళించుతారు. ఎందువల్లనంటే ఆ దేశం బూర్జువా విప్లవం ప్రారంభమయ్యే కాలంలో వున్నది. ఈ విప్లవం యూరోపియన్ నాగరికత బాగా అభివృద్ధి చెందిన పరిస్థితులలో సాగింపబడవలసి వుంటుంది. 17వ శతాబ్ధంలో బ్రిటన్‌లోనూ, 18వ శతాబ్ధంలో



రష్యా రాజధాని మాస్కో రైల్వే స్టేషన్ ఎదుట లెనిన్ విగ్రహం

ఫ్రాన్సులోనూ వున్న శ్రామికవర్గం కంటె అత్యంత ఎక్కువగా అభివృద్ధి అయిన శ్రామికవర్గంచే నడపబడవలసి వుంటుంది. అంతేకాదు, జర్మనీలో బూర్జువా విప్లవం, దాని వెనువెంటనే వచ్చే శ్రామికవర్గ విప్లవానికి నాందీ ప్రస్తావనగా వుండక తప్పదు కాబట్టి కూడా జర్మనీపై దృష్టి మళ్ళించుతారు.

మరో మాటలో చెప్పాలంటే విప్లవోద్యమ కేంద్రం జర్మనీ వైపుకు మళ్లుతోంది.

మార్క్స్ పైన ఉదహరించిన ఈ పరిస్థితే శాస్త్రీయ సోషలిజానికి జర్మనీ పుట్టినిల్లు గావడానికీ, జర్మన్ శ్రామికవర్గ నాయకులైన మార్క్స్, ఎంగెల్సులు దాని సృష్టికర్తలు కావటానికి కారణమై ఉంటుందనడంలో ఎలాంటి సందేహం ఉండదు.

ఇరవయ్యవ శతాబ్దపు ప్రారంభంలో రష్యాలో సరిగ్గా ఇటువంటి పరిస్థితే మరింత తీవ్ర స్థాయిలో ఉందని చెప్పి తీరాలి. రష్యా అప్పుడు విప్లవ తొలి సంధ్యా కాలంలో వుంది. యూరపులో పరిస్థితులు, జర్మనీలో కంటే (ఇంగ్లాండ్ ప్రాంతం సంగతి సరేసరి) బాగా అభివృద్ధి పొందిన శ్రామికవర్గంతో ఈ విప్లవాన్ని రష్యా సాగించవలసి వచ్చింది. అంతేగాదు, మనకున్న భోగట్టా అంతా తెలిపేదేమిటంటే, ఈ విప్లవం శ్రామికవర్గ విప్లవాన్ని ప్రేరేపించే దానికి నాందీ ప్రస్తావనగా వుంటుంది. రష్యన్ విప్లవం బీజ రూపంలో వున్నప్పుడే 1902లోనే 'ఏమి చేయాలి?' అన్న తన గ్రంథంలో లెనిన్ భవిష్యద్వాణి ఈ క్రింది విధంగా చెప్పటం యాదృచ్ఛికమేమీ కాదు.

"చరిత్ర మనకొక (అనగా రష్యన్ మార్క్సిస్టులకు – స్టాలిన్) ఒక అత్యవసర కర్తవ్యాన్ని తెచ్చిపెట్టింది. ఏ దేశపు శ్రామికవర్గం ముందున్న అత్యవసర కర్తవ్యాలన్నింటిలోకి ఇది అత్యంత విప్లవాత్మకమైన కర్తవ్యం. ఈ కర్తవ్యాన్ని పూర్తి చేయడం ద్వారా, యూరపు అభివృద్ధి నిరోధక శక్తులకేగాక ఆసియా ఖండపు అభివృద్ధి నిరోధక శక్తులకు కూడా అతి బలమైన పూతంగా ఉన్న ఆధారాన్ని నాశనం చేయడం ద్వారా రష్యన్ శ్రామికవర్గం అంతర్జాతీయ విప్లవ శ్రామికవర్గానికి అగ్రదళంగా తయారవుతుంది."

మరో మాటలో చెప్పాలంటే, విప్లవోద్యమ కేంద్రం రష్యా వైపుకు మళ్ళీ తిరుగుతుందని లెనిన్ చెప్పాడు.

రష్యాలో విప్లవం పురోగతి లెనిన్ చెప్పిన దానిని పూర్తిగా రుజువు చేసిందని మనకు తెలుసు.

ఇదంతా జరిగిన తర్వాత ఇటువంటి విప్లవాన్ని పరిపూర్తి చేసిన దేశం ఇటువంటి శ్రామిక వర్గాన్ని కలిగిన దేశం శ్రామికవర్గ విప్లవపు సిద్ధాంతానికీ, ఎత్తు గడలకు పుట్టినిల్లు గావటంలో ఆశ్చర్యమేమున్నది.


ఈ శ్రామికవర్గపు నాయకుడైన లెనిన్, ఈ సిద్ధాంతానికీ, ఎత్తుగడలకూ సృష్టికర్త అయ్యాడంటే, అంతర్జాతీయ శ్రామికవర్గానికి నాయకుడు అయ్యాడంటే ఆశ్చర్యమేముంది?

**(లెనినిజం పునాదులు గ్రంథం నుండి)**





# మహాపర్వతం ఎక్కుతున్నప్పుడు నిరాశలు కూడా ఎదురవుతాయి!



లెనిన్

**(1917 రష్యా విప్లవం జయప్రదం అయిన తరువాత శైశవ దశలో ఉన్న కార్మికవర్గ రాజ్యాన్ని పొత్తిళ్లలోనే మట్టుపెట్టడానికి 18 సామ్రాజ్యవాద దేశాలు ఏకమై దానితో యుద్ధానికి తలపడ్డాయి. వ్యూహాత్మక రాజీలతో యుద్ధం నుండి బయటపడ్డ తరువాత రష్యా ఆర్థిక వ్యవస్థలో కొన్ని మార్పులు చేయాల్సి వచ్చింది. సోషలిస్టు పంథానుండి ఒకడుగు వెనక్కు వేసి కొన్ని మార్కెట్ సంస్కరణలు ప్రవేశపెట్టాల్సి వచ్చింది. ఆ సందర్భంగా విప్లవ నేత లెనిన్ రాసిన వ్యాసంలోని కొంత భాగాన్ని దిగువ ఇస్తున్నాం. లెనిన్ ఈ వ్యాసాన్ని పూర్తి చేయలేదు. 1922 ఫిబ్రవరి చివరిలో ఆయన రాసుకున్న నోట్స్ నుండి దీన్ని సేకరించారు....సంపాదకుడు)**

## 1

ఒక ఉదాహరణ చెబుతాను:

ఒక మనిషి చాలా ఎత్తయిన, బాగా ఏటవాలుగా ఉన్న, ఇప్పటివరకు ఎవరూ ఎక్కని దుర్గమమైన పర్వతాన్ని ఎక్కుతున్న దృశ్యాన్ని ఊహించుకోండి. అతను ఎన్నడూ ఎరుగనన్ని కష్టాలూ, ప్రమాదాలూ అధిగమించాడు. అతనికి ముందువాళ్లు ఎవరూ ఎక్కనంత ఎత్తుకు ఎక్కగలిగాడు. అయినప్పటికీ ఇంకా ఆయన శిఖరాన్ని మాత్రం చేరుకోలేదనుకోండి. అతను ఆ దశవరకు వచ్చిన తరువాత ఇంక అదే త్రోవలో ముందుకు వెళ్లడం కష్టసాధ్యం, ప్రమాదకరం అనే పరిస్థితి ఎదురైంది. అంతే కాదు ఇంక ఆ త్రోవలో ముందుకు వెళ్లడం అసాధ్యమై పోయింది. దాంతో అతను వెనుదిరగాల్సి వచ్చింది. కిందికి కొంత దిగి, మరో మార్గం పట్టుకుని పైకి పోవాల్సి వచ్చింది. ఈ సారి ఎన్నుకున్న మార్గంలో కొంత ఎక్కువ దూరం ప్రయాణించాల్సి రావచ్చు. కాని ఆ మార్గం మాత్రం అతన్ని కచ్చితంగా శిఖరానికి తీసుకుపోతుంది. ఇప్పుడు మనం చెప్పుకున్న ప్రయాణీకునికి ఇతరులు చేరలేని ఎత్తుకు వెళ్లడం కన్నా కూడా ఆ ఎత్తు నుండి కిందకు దిగడం చాలా కష్టంగా, ప్రమాద కరంగా ఉంటుంది. ఎందుకంటే అలా దిగే టప్పుడు కాలుజారిపోయే అవకాశాలు ఎక్కువ. కాలు మోపడానికి దన్ను దొరకదు. పైకి ఎక్కుతు న్నప్పుడు, నేరుగా లక్ష్యాన్ని చేరుకుంటున్న ప్పుడున్న హుషారు ఇప్పుడతనిలో ఉండదు. దిగాల్సి వచ్చేటప్పుడు నడుంకి తాడు కట్టుకుని జాగ్రత్తగా నేలను పాదాలు తాకు కుంటూ దిగాల్సి వస్తుంది. సరైన పట్టు సంపాదించడం కోసం గంటలతరబడి వేచి చూడాల్సి వస్తుంది. నత్తనడకన చాలా నెమ్మదిగా, లక్ష్యానికి దూరం గా జరుగుకుంటూ కిందికి దిగాల్సి వస్తుంది. అంతే కాదు బాధాకరమైన, కష్టతరమైన ఆ అవరోహణం కూడా అతన్ని ఎక్కడకు చేరుస్తుందో తెలియదు. దిగిన తరువాత తాను మళ్లీ మరింత ధైర్యంగా, మరింత త్వరగా, మరింత నేరుగా శిఖరాన్ని చేరుకోడానికి తనకు సురక్షిత మైన మార్గం దొరుకుతుందో లేదో కూడా తెలీదు.

అంతటి ఎత్తువరకు చేరుకున్న వ్యక్తి అటు వంటి సంకట స్థితిలో పడ్డాడంటే అతను నిరాశకు గురికావడం సహజం. పైగా ఇటువంటి స్థితిలో ఉన్న వ్యక్తికి.... కింద, చాలా దూరంలో టెలిస్కోపులో తను దిగడాన్ని చూస్తున్న వ్యక్తులు చేస్తున్న అసహాస్యపు వ్యాఖ్యానాలు వినిపిస్తూ ఉంటే అప్పుడు అతను మరిన్ని ఎక్కువసార్లు నిరాశా నిస్పృహలకు గురవుతుంటాడు. అతను దిగే మార్గం స్మేనా వెఖ్ వ్యాసాల్లో మేధావులు చెప్పేటటువంటి మార్గం కాదు. "బ్రేకులను పట్టుకుని ఎక్కాలి" అని వాళ్లు చెప్పారు. చక్కగా డిజైన్ చేసిన, పరీక్షించిన వాహనానికి బ్రేకులు న్నట్లుండాలం టారు వారు. చక్కగా వేసిన రోడ్డుమీద, ముందుగానే పరీక్షించిన సాధనాలతో ప్రయాణించాలంటారు. కాని మనవాడు దిగుతున్న సందర్భంలో ముందుగా పరీక్షించిన వాహనం ఏదీ లేదు. ముందుగా సరిచూసుకున్న రోడ్డు ఏదీ లేదు. నిజానికి చెప్పాలంటే ముందుగా పరీక్షించింది ఏదీ అక్కడ లేదు.

అటువంటి పరిస్థితుల్లో కిందినుండి అతని చెవికి అపహాస్యపు మాటలు వినిపిస్తున్నాయి. వాళ్లు లోపలేమీ దాచుకోవడం లేదు. బహిరంగంగానే అపహాస్యం చేస్తున్నారు. నవ్వుతున్నారు. అరుస్తున్నారు. "చూడండి, చూడండి ఒక్క క్షణంలో వాడు పడిపోతాడు. ఆ పిచ్చిసన్నాసికి అది జరగాల్సిందే!" అంటుంటారు. కొంతమందేమో నవ్వు బయటకు రాకుండా ఆపుకుని అదోరకంగా ప్రవర్తిస్తారు. అయ్యో పాపం అంటారు. వల్ల మాలిన సానుభూతి చూపుతారు. వాళ్లేమంటా రంటే: "మేం భయపడ్డట్లే జరిగింది. ఎంత బాధాకరమైన విషయం. ఆ శిఖరాన్ని చేరుకోడానికి మా జీవితాలన్నిటినీ వెచ్చించి గొప్ప ప్రణాళికలు తయారుచేస్తూ ఉన్నాం. మా ప్రణాళిక పూర్తయ్యేవరకూ శిఖరారోహణాన్ని వాయిదా వేసుకోమని మేం అతనికి చెప్పాం. విన్నాడా! విన్లేదు. ఈ త్రోవలో వెళ్లద్దురా నాయనా అని చెప్పాం. అదీ విన్లేదు. చూడండి, ఇప్పుడు ఆ పిచ్చివాడు ఆ మార్గం నుండి వెనక్కు వచ్చేస్తున్నాడు. (చూడండి, చూడండి, అతను వెనక్కు తిరిగాడు. దిగిపోతున్నాడు. దిగడంలో కూడా ఒక్క అడుగు దిగడానికి ఎన్ని గంటలు పడుతోందో చూడండి!

“రష్యన్ కార్మికవర్గం విప్లవసాధనలో మహా ఎత్తుకు ఎదిగింది. 1789, 1793, విప్లవాలేకాదు 1871తో పోల్చితే కూడా మహా ఎత్తుకు వెళ్లింది. అయితే విప్లవం సాధించాక మనం ఏం చెయ్యగలిగాం, ఏం చెయ్యలేకపోయాం అన్న విషయాలను సాధ్యమైనంత స్పష్టంగా, నిర్దిష్టంగా సమీక్షించుకోవాలి. ఆ పనిచేస్తేనే మనకు ఒక స్పష్టత ఉంటుంది. మనం కళ్లుతిరగడానికో, భ్రమలకో లేక నిరాశానిస్పృ హలకో గురికాకూడదు.”

అయినప్పటికీ జాగ్రత్తరా నాయనా అంటే మన మాట చెవిన పెట్టకుండా మనల్నే విమర్శి స్తున్నాడు చూడండి!) ఇటువంటి పిచ్చివాడి చర్యలను మేము పదే పదే ఖండిస్తున్నామంటే, అతన్ని ఎవరూ అనుసరించొద్దు, అతనికి ఎవరూ సహాయం చేయవద్దు అని సలహా ఇస్తు న్నామూ అంటే దీనంతటికీ కారణం ఈ మహా పర్వతాన్ని ఎక్కడం కోసం మేం రూపొందించిన మహత్తర ప్రణాళిక పట్ల మాకున్న అంకిత భావమే. ఆ మహా ప్రణాళికను భ్రష్టుపట్టించ కుండా చూడ్డం కోసమే ఇదంతా చేస్తున్నాం.”

ఇటువంటి మాటలు చెప్పేవాళ్లంతా కూడా పర్వతాన్ని ఎక్కడం అనే “భావానికి” మాత్రమే నిజమైన మిత్రులు. సంతోషకరమైన విషయం ఏమిటంటే మనం చెప్పుకుంటున్న ప్రయాణీ కుడు తనున్న స్థితిలో ఇటువంటి వాళ్ల మాటలు వినలేకపోవడం. ఒకవేళ అతను ఈ మాటలు వింటే జరిగేదేమిటి? కళ్లుతిరుగుతాయి, కడుపు లో దేవేస్తుంది. వాంతి వచ్చినంతపనవుతుంది. ఆ స్థితికి వెళ్లినవాడు అంతటి ఎత్తులో సరిగ్గా ఆలోచించలేడు. నేలమీద స్థిరంగా అడుగు వేయలేడు.

**2**

ఇప్పుడిక పోలికలతో పనిలేకుండా నేరుగా విషయానికి వద్దాం:

పోలికలు సాక్ష్యాలు కావు. ప్రతి పోలికా లోపభూయిష్టమైనదే. ఇవన్నీ తిరుగులేని సాధారణ సత్యాలు. కాని విషయాన్ని అర్థం చేసుకోడానికి పోలికలను గుర్తుకు తెచ్చుకోవడం వల్ల నష్టమేమీ లేదు.

రష్యన్ కార్మికవర్గం విప్లవసాధనలో మహా ఎత్తుకు ఎదిగింది. 1789, 1793, విప్లవాలే కాదు 1871తో పోల్చితే కూడా మహా ఎత్తుకు వెళ్లింది. అయితే విప్లవం సాధించాక మనం ఏం చెయ్యగలిగాం, ఏం చెయ్యలేకపోయాం అన్న విషయాలను సాధ్యమైనంత స్పష్టంగా, నిర్దిష్టంగా సమీక్షించుకోవాలి. ఆ పనిచేస్తేనే మనకు ఒక స్పష్టత ఉంటుంది. మనం కళ్లుతిరగడానికో, భ్రమలకో లేక నిరాశానిస్పృ హలకో గురికాకూడదు.

మనం ప్రపంచంలో ఏనాడూ ఎక్కడా జరగనంత సమగ్రంగా బూర్జువాప్రజాతంత్ర విప్లవాన్ని పరిపూర్తి చేశాం. ఇది పెద్ద విజయం. భూమి మీద ఏశక్తీ మన నుండి దాన్ని తీసుకుపోలేదు.

అత్యంత అభివృద్ధి నిరోధక సామ్రాజ్యవాద యుద్ధం నుండి మనం అత్యంత విప్లవాత్మక మార్గంలో బయటపడ్డాం. ఇది కూడా మనకు పెద్ద విజయమే. ఈ విజయాన్ని కూడా మన ల్నుండి ఈ భూమ్మీద ఏ శక్తీ వేరుచేయలేదు. ఈ విజయం చాలా విలువైనది. ఎందుకంటే, పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడ కొనసాగించిం దంటే అనతి కాలంలోనే దాని అభివృద్ధి నిరో ధక సామ్రాజ్యవాద దాష్టీకాలు అధికమవు తాయి. 1912, 1914–18లో లాగా కమ్యూ నిస్టు ఇంటర్నేషనల్స్ ద్రోహులు లోపలనుండి ప్రజలను మోసం చేయలేరు గనుక అభివృద్ధి నిరోధక సామ్రాజ్యవాదం ప్రజలపై నేరుగా దాడులకు దిగుతుంది.


మనం సోవియట్ తరహా రాజ్యాన్ని స్థాపిం చాం. ఆ విధంగా ప్రపంచ చరిత్రలో ఒక కొత్త శకాన్ని, బూర్జువా పాలన స్థానంలో కార్మిక వర్గ రాజకీయాధికారం నెరిపే శకాన్ని సృష్టించాం. దీన్ని కూడా మనలనుండి ఎవరూ వేరుచేయలేరు. అయితే సోవియట్ తరహా రాజ్యానికి, ఇంకా వివిధ దేశాలకు చెందిన కార్మికవర్గ ప్రత్యక్ష అనుభవాలతో పరిపూర్ణత ఇవ్వాల్సి ఉంది.

కాని మనం ఇంకా సోషలిస్టు ఆర్థికవ్యవస్థ యొక్క పునాదులు కూడా నిర్మించలేదు. మరణ శయ్యమీద ఉన్న పెట్టుబడిదారీ ప్రత్యర్థి శక్తులు మనల్ని ఆ నిర్మాణం సాగించకుండా అడ్డుపడు తున్నాయి. ఈ విషయాన్ని మనం అర్థం చేసు కోవాలి, నిర్మొహమాటంగా అంగీకరించాలి. ఎందుకంటే భ్రమల్లో ఉండడం కన్నా ప్రమాద కరమైంది మరొటి ఉండదు. (అది కూడా మనం అత్యున్నత ఎత్తుకు వెళ్లిన స్థితిలో భ్రమలు మరింత ప్రమాదకరం). ఈ నగ్న సత్యాన్ని అంగీకరించడంలో దారుణమైన విషయం ఏమీ లేదు. నిరాశానిస్పృహలకు గురికావాల్సి న పనిలేదు. ఎందుకంటే అనేక అభివృద్ధి చెందిన దేశాల కార్మికుల ఉమ్మడి కృషి ద్వారా మాత్రమే సోషలిజం జయప్రదమవుతుందన్న మార్క్సిస్టు ప్రాథమిక సత్యాన్ని మనం ఎల్లప్పు డూ నొక్కి చెబుతుంటాం కనుక. మనం ఇప్పటికీ ఒక వెనుకబడిన దేశంలో ఒంటరిగా నే ఉన్నాం. మన దేశం ఇతర దేశాలకన్నా ఎక్కువగా యుద్ధనాశనాన్ని చవిచూసింది. కాని అదే సమయంలో మనం చాలా విజయాలూ సాధించాం. అన్నిటికీ మించి మనం విప్లవ కార్మికవర్గ శక్తులను నిలుపుకున్నాం. వ్యూహాత్మ కంగా వ్యవహరించగల దాని శక్తిని నిలుపు కున్నాం. మనం కళ్లు తిరిగే స్థితిలో కాకుండా స్పష్టమైన ఆలోచనావిధానంతో ఉన్నాం. ఎక్క డ, ఎప్పుడు, ఎలా వెనుదిరగాలో కచ్చితంగా అంచనావేయగలిగే స్థితిలో ఉన్నాం. (ఈ వెన క్కు రావడం అనేది మళ్లీ మరింత ముందుకు పోవడానికే అన్నవిషయం గుర్తుంచుకోవాలి.) ఇంకా మిగిలిపోయి ఉన్న పనిని పూర్తిచేయ డానికి ఎక్కడ, ఎప్పుడు, ఎలా పనిచేయాలన్న స్పష్టత కలిగిఉన్నాం. తప్పులు చేయకుండా, వెనకడుగులు లేకుండా, మిగిలిపోయిన పనులను, సక్రమంగా చేయని పనులనూ ఎప్పటికప్పుడు సరిచేసుకోకుండా సోషలిస్టు పునాదులను (ముఖ్యంగా ఒక చిన్న రైతాంగ దేశంలో) నిర్మించడం అనే మహత్తర కర్తవ్యాన్ని నిర్వర్తించడం సాధ్యం కాదు. అలా సాధ్యమవు తుందని కమ్యూనిస్టులెవరైనా భావిస్తే వారు నాశనమైనట్లే లెక్క. తీవ్రమైన కష్టాలు ఎదురైన నప్పుడు భ్రమలకు గురికాని కమ్యూ నిస్టులు, నిరాశానిస్పృహలను దరిచేరనివ్వని కమ్యూని స్టులు, మళ్లీ మొదటినుండి ప్రారంభించే శక్తినీ, వెసులుబాటునూ పోగొట్టుకోని కమ్యూనిస్టులు ఎన్నటికీ నాశనం కారు.

మన వరకు మనకు నిరాశానిస్పృహలకు గురయ్యే అవకాశాలు తక్కువున్నాయి. ఎందు కంటే మనం యుద్ధంలో దెబ్బతిని పోయినా, పేదరికం, వెనుకబాటుతనం, ఆకలి మన దేశంలో ఇంకా రాజ్యమేలుతున్నా సోషలిస్టు మార్గాన్ని సిద్ధం చేసే ఆర్థిక వ్యవహారాల్లో మనం పురోగతి సాధిస్తున్నాం. మనతో పాటు ఉన్న ప్రపంచంలో, బాగా అభివృద్ధి చెందిన అన్ని దేశాల్లోనూ, మన కన్నా ధనిక దేశాల్లోనూ, మన కన్నా సైనికంగా వెయ్యిరెట్లు శక్తివంతమైన దేశాల్లోనూ పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థలు కలిగిఉన్నవారి పరిస్థితి దిగజారిపోతోంది.

**(అనువాదం: వెంకట్రావు)**

# లెనినిజం - వర్గ చైతన్యం


రచయిత ప్రముఖ మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్త

ప్రభాత్ పట్నాయక్

'కార్మిక వర్గం దానంతట అదే విప్లవకర వర్గస్పృహ సంతరించుకోదు. కార్మిక వర్గానికి అలాంటి వర్గ చైతన్యం బయటనుండి కల్పించాలి' అంటాడు లెనిన్. లెనినిజం మూల సూత్రీకరణలలో ఇదొకటి. అయితే ఇది లెనిన్ స్వయంగా కనుగొని చెప్పింది కాదు: కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్-ఎంగెల్స్‌లు దీని గురించి ప్రాథమికంగా చర్చించారు."కార్మిక వర్గానికి తాను ఒక వర్గం అన్న స్పృహకల్పించి వర్గచైతన్యం పెంపొందించడానికి మూడు మార్గాలు ఉన్నాయి. ఫ్యూడల్ ప్రభువులతోనూ, ఇతర వర్గ శత్రువులతోనూ బూర్జువా వర్గం చేసే పోరాటంలో దానంతట అదే కార్మిక వర్గాన్ని రాజకీయ పోరాటంలోకి లాక్కువస్తుంది. బూర్జువా వర్గం స్వీయ అవసరాల కోసం కార్మికవర్గానికి తనదైన శైలిలో సాధారణ రాజకీయ విద్య అందిస్తుంది. ఇది మొదటి మార్గం. రెండవ మార్గం ఏమిటంటే - ఆధునిక పారిశ్రామిక రంగం విస్తరించేకొద్దీ పాలక వర్గాల్లోని కొన్ని శక్తులు పతనమై శ్రామిక వర్గంలోకి చేరుతాయి. అలాంటి శక్తులు కార్మిక వర్గానికి నూతన చైతన్యాన్ని అందిస్తాయి. ఇక మూడవ మార్గం విషయానికి వస్తే బూర్జువా సిద్ధాంత వేత్తలు ఎవరైతే సైద్ధాంతికంగా చారిత్రక పరిణామక్రమాన్ని మొత్తంగా అర్థం చేసుకోగలుగుతారో వాళ్ళు శ్రామిక వర్గం పక్షాన చేరిపోయి వర్గం చైతన్యం పెంపొందించే కృషి చేస్తారు" అని వివరించారు మార్క్స్-ఏంగెల్స్. అంటే కార్మిక వర్గానికి వర్గస్పృహ, వర్గ చైతన్యం వెలుపలి నుండి అందుతాయని మార్క్సిస్టు మహోపాధ్యాయులు చెప్పారు. అయితే లెనిన్ ఈ ఆలోచనలకు నిర్దిష్ట రూపం ఇచ్చి, ఈ సూత్రీకరణ కేంద్రంగా చేసుకుని కార్మిక వర్గానికి వెలుపలి నుండి చైతన్యం అందించి రష్యన్ విప్లవంలో వారిని అగ్ర భాగాన నిలిపాడు.

### వర్గ స్పృహ - వర్గ చైతన్యం

వామపక్ష అభిమానులు అని చెప్పుకునే కొందరితో సహా చాలామందిలో శ్రామిక వర్గానికి బయటినుండి చైతన్యం అందించాలనే సూత్రీకరణ పట్ల అపోహలున్నాయి. దీని వల్లనే శ్రామికవర్గ నియంతృత్వానికి బదులు శ్రామికవర్గం మీద నియంతృత్వం రుద్దబడుతుందనీ, ఈ సూత్రీకరణ అప్రజాస్వామికమైనదనీ అంచనాల్లో ఉన్నారు. ప్రజాస్వామ్యం అంటే వివిధ ప్రయోజనాలుగల ప్రజా సమూహాల మధ్య, అస్థిత్వాల మధ్య సర్దుబాటు కాదు. ఈ ప్రజాసమూహాలు అన్నీ కలిసి నూతన సామాజిక తరగతిగా రూపాంతరం చెందే ప్రక్రియ. అట్లాంటి ప్రక్రియలో ప్రజలు వాళ్ళంతట వాళ్ళుగా భాగస్వాములు కారు. వెలుపలి నుండి ప్రజలకు అలాంటి ప్రజాస్వామిక చైతన్యం అందించాలి. కార్మిక వర్గానికి ఎలాగైతే వెలుపలి నుండి సోషలిస్టు చైతన్యం అందించి వారిని విప్లవానికి సన్నద్ధం చేస్తామో అలాగే ప్రజారాశులకు కూడా వెలుపలి నుండి ప్రజాస్వామిక చైతన్యం అందించాలి. ప్రజాస్వామిక చైతన్యం అంటే అస్థిత్వస్పృహ కాదు. అంతకు మించిన సమానత్వ భావన.

ప్రజాస్వామ్యం అంటే వివిధ అస్థిత్వ సమూహాల మధ్య సర్దుబాటు అన్న సంకుచిత అర్థంలో తీసుకున్నా దానికదే ఒక ముందడుగుగా మనం భావించవచ్చు. దళితులు తమ హక్కుల కోసం ఉన్నత కులాలకు వ్యతిరేకంగా నిలబడి తగాదా పడ్డారనుకోండి అప్పుడు దళితులతో ఉన్నత కులాలు చర్చలకు సిద్ధపడినా లేక రాజ్యమే రెండు బృందాల మధ్యన రాజీకి ప్రయత్నించినా తప్పనిసరిగా అది విజయమే. పాత దోపిడి సాంఘిక వ్యవస్థకు భంగపాటే.

అయితే ఈ మాత్రంతో పాత సామాజిక వ్యవస్థ దెబ్బతినిపోదు. ఆ వ్యవస్థ వల్ల తలెత్తుకు వచ్చిన పెత్తందారీ కులవ్యవస్థ కూలిపోదు. నిజమైన ప్రజాస్వామ్యం అంటే పాత సాంఘిక-సామాజిక పెత్తందారీ వ్యవస్థ మొత్తంగా కూలిపోవాలి. సామాజిక అంతరాలు లేని సమత్వ భావనతో నూతన సామాజిక పొందిక ఆవిర్భవించాలి. ఇదంతా దానంతట అదే చోటుచేసుకోదు. ప్రయత్న పూర్వకంగా వెలుపలినుండి చైతన్యం అందించడం ద్వారా మాత్రమే అసలు సిసలైన ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించుకోవడం సాధ్యపడుతుంది.

కాబట్టి కొంతమంది విమర్శించినట్లు వెలుపలి నుండి చైతన్యం అందించాలనే లెనిన్ సూత్రీకరణ ఎంత మాత్రం అప్రజాస్వామికం కాదు. ఇక వారి రెండవ విమర్శ కార్మికవర్గ నియంతృత్వానికి సంబంధించినది. వాస్తవానికి ఈ విషయంలో వారు లెనిన్ సూత్రీకరణను పొరబాటు అవగాహనతో వ్యాఖ్యానిస్తున్నారు. కార్మిక వర్గం అంటే జడపదార్థం అనీ, వారి బుర్రల్లోకి బయట నుండి సిద్ధాంతాన్ని నూరిపోస్తేగానీ విప్లవానికి సన్నద్ధం చెయ్యలేమనో, కార్మికవర్గం బుర్రలు శుభ్రమైన పలకల్లాంటివి, సిద్ధాంతవేత్తలు ఆ పలకల మీద కంప్యూటర్‌లో 'లాంగ్వేజ్ రాసినట్లు' విప్లవకార్యక్రమాన్ని రాసేస్తే ఫిరంగుల్లా పేలతారనో భ్రమపడుతున్నారల్లే ఉంది. కాని లెనిన్ చెప్పింది ఇదేమి కాదు. విప్లవ క్రమంలో విప్లవ మేధావులు ముందుండి కార్మికవర్గం అనే జడ పదార్థాన్ని సైన్యంగా మార్చి విప్లవాన్ని తీసుకువస్తారని లెనిన్ ఎక్కడా చెప్పలేదు.

> **"విప్లవకర శ్రామికవర్గ చైతన్యాన్ని పెంపొందించడం అనేది సిద్ధాంతం-ఆచరణల గతితర్క మేళవింపు మీద ఆధారపడి ఉంటుంది. అలాంటి గతితార్కికత లోపిస్తే రకరకాల అనర్థాలు చోటు చేసేకుంటాయి. ద్వంద్వ వైఖరులు, ఒంటెద్దుపోకడలు, చతికిలపడడాలు వంటి వాటికి దారితీస్తాయి. 'లెనిన్ జ్ఞాపకాలు' పేరిట వెజ్డా కృపస్కయా రాసిన పుస్తకంలో అలాంటి ఉదాహరణలు ఎన్నో వివరించింది."**

విప్లవానికి నాయకత్వం వహించేది కార్మిక వర్గమే అని లెనిన్ స్పష్టం చేసాడు. 'కార్మిక వర్గానికి వర్గ స్పృహ ఉంటుంది. అది సహజాతమైనది. అందుకే వారిలో బయట నుండి అందించే విప్లవ సిద్ధాంతాన్ని ఆకళింపు చేసుకుని, ఆచరించే శక్తి ఉంటుంది అని లెనిన్ చెప్పాడు. అంటే ఇక్కడ బయట నుండి అందించే సిద్ధాంతం కార్మిక వర్గంలోని వర్గస్పృహను వర్గ చైతన్యంగా మలిచేదిగా ఉండాలి. అది జరిగినప్పుడే శ్రామికవర్గ విప్లవ మహాప్రస్థానం మొదలవుతుంది.

### సిద్ధాంతం - ఆచరణల గతితర్కం

అయితే ఈ విప్లవకర ప్రస్థానం కూడా 'కేవలం' సిద్ధాంత జ్ఞానంతో సాధ్యపడుతుందనే నిర్ధారణకు రాకూడదు మనం. కార్మిక వర్గం జీతాల పెంపుదల కోసం, మెరుగైన పని పరిస్థితుల కోసం చేసే పోరాటాలతో రకరాల పొందికలుగా (కాంబినేషన్స్) ఏర్పడతారు. కార్మిక సంఘచైతన్యాన్ని పెంపొందించుకుంటారు. ఈ పోరాటాల కాలంలోనే బూర్జువా రాజ్యం యాజమాన్యాల పక్షాన నిలబడి, వారి తరఫున కార్మికులను ఇబ్బంది పెట్టడం, అణిచివెయ్యడానికి ప్రయత్నించడం అనుభవపూర్వకంగా తెలుసుకుని కార్మికవర్గం కేవలం యజమానులే కాదు, వారి దోపిడికి వత్తాసు పలుకుతున్న రాజ్యమూ వర్గశత్రువే అన్న రాజకీయ అవగాహనకు వస్తుంది. ఇలా పోరాటాల ద్వారా కార్మిక వర్గం తన రాజకీయ అవగాహనను పెంచుకుంటుందనే విషయాన్ని కార్ల్‌మార్క్స్ 'తత్వశాస్త్ర దారిద్ర్యం' అన్న పుస్తకంలో వివరించాడు. కార్మిక వర్గం స్వయంగా సంతరించుకునే ఈ చైతన్యం దానంతట అదే 'విప్లవకర చైతన్యం' గా మారదు. అందుకు బయటనుండి ప్రయత్నపూర్వకమైన కృషి అవసరం.

ఈ కీలకాంశాన్ని విస్మరిస్తే 'అను భవం నుండే సిద్ధాంతం నేర్చుకుంటారు' అనే పేలవమైన వాదనకు జైకొట్టినట్లవుతుంది. సిద్ధాంతం తానంతట అదే స్వయం ప్రతిపత్తితో అభివృద్ధి అయ్యేది కాదు. గతంలోని సైద్ధాంతిక కార్యాచరణనుండి అనుభవాలు, గుణపాఠాలు తీసుకుని నూతన సైద్ధాంతిక కార్యాచరణకు పూనుకోవడం, ఎప్పటికప్పుడు తాజా పరుచుకోవడం నిరంతరాయంగా జరగాల్సిన మార్క్సిస్టు-లెనినిస్టు కృషి. కార్మికులు తమకు వెలుపలి నుండి అందించే సైద్ధాంతిక విషయాలతో తమలోని వర్గస్పృహను వర్గ చైతన్యంగా పెంపొందించుకుంటారు. అయితే ఇదంతా తమ పోరాటాల కార్యచరణలోనే నేర్చుకుంటారు.

విప్లవకర శ్రామికవర్గ చైతన్యాన్ని పెంపొందించడం అనేది సిద్ధాంతం-ఆచరణల గతితర్క మేళవింపు మీద ఆధారపడి ఉంటుంది. అలాంటి గతితార్కికత లోపిస్తే రకరకాల అనర్థాలు చోటు చేసేకుంటాయి. ద్వంద్వ వైఖరులు, ఒంటెద్దుపోకడలు, చతికిలపడడాలు వంటి వాటికి దారితీస్తాయి. 'లెనిన్ జ్ఞాపకాలు' పేరిట వెజ్డా కృపస్కయా రాసిన పుస్తకంలో అలాంటి ఉదాహరణలు ఎన్నో వివరించింది. ఇప్పుడు సాగుతున్న సోషల్ డెమాక్రెట్ ఉద్యమం (సోహల్ డెమోక్రెట్‌ను అప్పటి అర్థంలోనే చదువుకోవాలి) లో అలాంటి ద్వంద వైఖరులు చోటు చేసుకోరాదని లెనిన్ ఎంతగానో జాగ్రత్తలు తీసుకునేవాడని కృపస్కయా ఉదహరించింది. 'కార్మికులను కమిటీలలోకి తీసుకురావాలనీ, పార్టీ పని-కార్మికరంగంలో పని జమిలిగా సాగేలా జాగ్రత్తలు తీసుకొని వారిని విప్లవోద్యమ నాయకులుగా తీర్చిదిద్దే కృషి గురించి లెనిన్ తరచూ నొక్కి చెబుతుండేవాడనీ పేర్కొంది. కార్మికులలో వర్గస్పృహ జడ పదార్థ లక్షణంతో ఉండదు. అది కార్మికుడిని అభివృద్ధి చేసి పదును తేలుస్తుంది. హఠాత్తుగా వారిలో విప్లవ చైతన్యాన్ని వెలికి తెస్తుంది. కాబట్టి లెనిన్ చెపినట్లు కార్మికవర్గానికి బయటి నుండి చైతన్యం అందించడం అంటే బయటి నుండి ఆదేశాలు ఇవ్వడం, సైద్ధాంతికంగా సామాజిక చెడుగులన్నింటికీ మూలమైన ఈ వ్యవస్థను ఏదో ఒకటి చెయ్యమని చెప్పడం కాదు. అలాంటి ఆదేశాలకు కార్మిక వర్గం స్పందిస్తుందనే గ్యారంటీ కూడా లేదు. పోరాటాల క్రమంలో కార్మిక శ్రేణుల్లో వర్గస్పృహ పదును తేలి బయటి నుండి అందించిన సిద్ధాంత జ్ఞానం సరైనదన్న విశ్వాసం కలిగితేనే వారు వర్గ చైతన్యంతో సామాజిక మార్పుకోసం జరిగే పోరాటాల్లోకి వస్తారు.

### మాజీ సోషలిస్టు దేశాల్లో రాజకీయ నిర్వ్యాపకత (డీ-పొలిటిసైజేషన్)

రష్యాలో బోల్షివిక్ విప్లవం ద్వారా సాధించుకున్న సోషలిస్ట్ వ్యవస్థ కుప్పకూలిపోతుంటేనో, రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఐరోపా ఖండంలో వెల్లివిరిసిన సోషలిస్ట్ దేశాల్లో ఆ వ్యవస్థలు కూలిపోతుంటేనో కార్మిక వర్గం ఏం చేస్తున్నట్లు? ఎందుకు ప్రతిఘటించనట్లు అని కొంత మంది ప్రశ్నిస్తుంటారు. దీని గురించి నిర్దిష్టంగా విశ్లేషించాల్సిందే. అయితే ఈ

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

రాజకీయ నిర్వ్యాపకతను– లెనిన్ సూత్రీకరణను ఒకే గాటనగట్టి బయటి నుండి చైతన్యం అందిస్తే ఇలానే ఉంటుంది అని వాదించబూనడం కువ్యాఖ్యలే. ఇవన్నీ పునాది లేని వాదనలే. సరిగ్గా చెప్పుకోవాలంటే ఈ ప్రశ్న ఇంకో విధంగా వేసుకోవాలి. కార్మిక వర్గ సిద్ధాంతం – ఆచరణల మేళవింపు కార్యాచరణలో ఎక్కడ లోపం జరిగిందీ అని పరిశీలించాలి. అది వదిలేసి సోషలిస్టు సిద్ధాంతమే పసలేనిదనే వాదనలు కమ్యూనిస్టు వ్యతిరేకులు చేసేవే తప్ప సమాజ చారిత్రక పరిణామ క్రమం మీద అవగాహన కలవాళ్ళు మాట్లాడే మాటలు కాదు.

పోరాటాల ద్వారా శ్రామిక వర్గంలో వర్గస్పృహ పెరుగుతుంది. ఆ వర్గస్పృహ వల్లనే వర్గ పోరాట సిద్ధాంతాన్ని ఆకళింపు చేసుకుంటుంది. ఈ క్రమానికీ, సోషలిస్టు ప్రజాస్వామ్యానికీ చాలాదగ్గరి లింకుఉంది. (బూర్జువా) ప్రజాస్వామ్య వ్యవస్థలో సాధారణ ప్రజానీకం చాలా అంశాల పట్ల పట్టనట్లు వ్యవహరిస్తారు. ఇదంతా 'పైనోళ్ళో' 'పెద్దోళ్ళో' చూసుకునే యవ్వారంలే అని మొహం తిప్పేస్తూ ఉంటారు. ఇదే పాలక శక్తులకు కలసి వచ్చే అంశం. కాని సోషలిస్టు ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రశ్నించడం నేర్చుకుంటారు. కాని దీన్లో ఇంకో సమస్య ఉందంటుంటారు. విప్లవ భవిష్యత్‌ను దెబ్బతీసే ఎలాంటి చర్యకూ అవకాశం ఇవ్వకూడదు కాబట్టి నిర్ణయాధికారం శ్రామిక వర్గ ప్రజారాశుల చేతుల్లో పెట్టాలని ఏ సోషలిస్టూ అనుకోడు. ఫణంగా పెట్టేది ఎంతటి అమూల్యమైనదో తెలుసు కాబట్టి విప్లవ సమాజంలో శ్రామిక వర్గ సార్వభౌమాధికారాన్ని పక్కన పెట్టి పార్టీ అగ్రభాగాన ఉన్న సిద్ధాంత వేత్తలూ, అనుభవజ్ఞులూ నిర్ణయాధికారాన్ని తీసేసుకుంటారు. అంటే సోషలిస్టు సమాజంలో కూడా విప్లవాన్ని కాపాడుకునే పేరిట ప్రజాస్వా మ్యానికి అంటకత్తెర వేస్తారు అనేది ఇంకో వాదన. దీనితో ఎవరైనా ఏకీభవిస్తే అది పొరపాటే.

నిజానికి శ్రామిక వర్గంలో సహజాతంగా ఉండే వర్గస్పృహ విప్లవ భవిష్యత్తును ఏమాత్రం దెబ్బ తీసేందుకు పురికొల్పదు. పై పెచ్చు వాళ్ళ విప్లవక్రమాన్ని ముందుకు కొనిపోయేందుకే తోడ్పడతారు. కాబట్టి నిర్ణయాధికారాన్ని శ్రామికవర్గ ప్రజానీకానికి వదలడం ఏమాత్రం ప్రమాదం కాదు, పైగా వాళ్ళను నిర్ణయాధికారంలో భాగస్వాములుగా చెయ్యకపోవడమే విప్లవక్రమానికి ఆటంకాలు

**"నిజానికి శ్రామిక వర్గంలో సహజాతంగా ఉండే వర్గ స్పృహ విప్లవ భవిష్యత్తును ఏమాత్రం దెబ్బ తీసేందుకు పురికొల్పదు. పై పెచ్చు వాళ్ళు విప్లవక్రమాన్ని ముందుకు కొనిపోయేందుకే తోడ్పడతారు. కాబట్టి నిర్ణయాధికారాన్ని శ్రామిక వర్గ ప్రజానీకానికి వదలడం ఏమాత్రం ప్రమాదం కాదు, పైగా వాళ్ళను నిర్ణయాధికారంలో భాగస్వాములుగా చెయ్యక పోవడమే విప్లవక్రమానికి ఆటంకాలు కలిగిస్తుంది."**



విజయవాడ లెనిన్ సెంటర్‌లో లెనిన్ విగ్రహం వద్ద ఆయన వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న వామపక్షాల నేతలు

కలిగిస్తుంది. హాని చేస్తుంది. కాబట్టి విప్లవ ప్రయోజనాలు కాపాడుకునేందుకు శ్రామిక వర్గ సార్వభౌమాధికారన్ని ఏ సోషలిస్టు సమాజమయినా మన్నించి తీరాల్సిందే.

విప్లవకర అగ్రపార్టీలో ఉన్న మేధావులూ, అనుభవజ్ఞులంత సైద్ధాంతిక అవగాహన శ్రామిక వర్గానికి లేనప్పటికీ అది తనలో ఉండే వర్గస్పృహ వల్ల తప్పుడు సిద్ధాంతాల నుండీ, పొరబాటు సూత్రీకరణల నుండీ విప్లవాన్ని కాపు కాసుకునేందుకు సిద్ధంగా ఉంటుంది. వారిలో ఉండే ఈ వర్గ స్పృహయే సోషలిస్టు ప్రజాస్వామ్యానికి పునాది. చరిత్ర నిర్మాణక్రమం అంతిమంగా వీరి చేతుల్లోనే ఉంటుంది. అందుకే మార్క్సిస్టు మహోపాధ్యాయులు చరిత్ర నిర్మాతలు ప్రజలే అని నొక్కి చెప్పారు.

సోషలిస్టు సమాజం ఏర్పడ్డాక ప్రజలను ముఖ్యంగా శ్రామికవర్గ ప్రజలను నిర్ణయాధికారం నుండి మినహాయించాలని ఏ సోషలిస్టు సిద్ధాంతంలోనూ లేదు. కాబట్టి లెనినిస్టు సిద్ధాంతంలో కార్మిక వర్గానికి బయట నుండి చైతన్యం అందించాలనే సూత్రీకరణ నహా, ఏ సూత్రీకరణా సోషలిస్టు ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం అనేందుకు భూమికే లేదు. అలాగే సోషలిస్టు వ్యవస్థలో విప్లవ క్రమాన్ని పరిరక్షించేందుకుగాను కార్మికవర్గాన్ని నిర్ణయాధికారానికి దూరంగా ఉంచాలనే సూత్రీకరణ కూడా తప్పుడు సిద్ధాంతమే. సోషలిస్టు వ్యవస్థలో ఉత్పత్తి సాధనాల మీద సామాజిక యాజమాన్యం ఉంటుంది గనుక పెట్టుబడిదారీ విధానంలో మాదిరి ప్రజలను కేవలం ప్రేక్షక పాత్రకో, మార్కెట్లో సరుకులు కొనే కొనుగోలుదారుడిగా మాత్రమే చూసే, చేసే దురవస్థ ఉండదు. అసలు సిసలు ప్రజాస్వామ్య సాధన ఒక్క సోషలిస్టు సమాజంలో మాత్రమే సాధ్యం. ❋

# కార్మికులు శిరమెత్తడం ఖాయం! పెట్టుబడిదారులూ, వారి ప్రభుత్వం భయంతో వణికిపోవడం ఖాయం!!

వి.ఐ లెనిన్



**కార్మిక సోదరులారా!**

మనం మన జీవితాలను ఒక్కసారి పరిశీలిద్దాం. మనం రోజులు ఎలా గడుపుతున్నామో తెలుసుకుందాం. లోతుగా చూస్తే మనకు కనిపించేదేమిటి? మనం కష్టపడి పనిచేస్తాం. తరగని సంపద సృష్టిస్తాం. బంగారం తీస్తాం. చినీచీనాంబరాలు తయారు చేస్తాం. భూ గర్భంలో నుండి ఇనుము, బొగ్గు బయటకు తెస్తాం. మనం యంత్రాలు తయారు చేస్తాం. నౌకలు, రైల్వేలు నిర్మిస్తాం. మహా సౌధాలు కడతాం. ఈ ప్రపంచంలోని సంపద అంతా మన చేతులతో తయారు చేసిందే. మన చెమట, రక్తంతో తయారైందే. ఇంత కష్టపడినందుకు మనకు దక్కే ప్రతిఫలం ఏమిటి? న్యాయంగా అయితే ఇంత చేసినందుకు మనం మంచి ఇళ్లల్లో నివసిస్తుండాలి, మంచి బట్టలు ధరిస్తుండాలి, మనం ఎటువంటి పరిస్థితుల్లోనూ పొట్టకూటికోసం దేబిరించాల్సిన అవసరం ఉండకూడదు.

కాని మనకు వస్తున్న వేతనాలు మన జీవితం గడవడానికి ఏమాత్రం సరిపోవడం లేదని మనకు తెలుసు. మన యజమానులు మన వేతనాల రేట్లను తగ్గించేస్తున్నారు. బలవంతంగా ఓవర్‌టైమ్ పనిచేయించుకుంటున్నారు. మనలను అనేక విధాలా వేధిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే వాళ్లు మనల్ని అన్ని విధాలుగా అణచేస్తున్నారు. దీనిపై మనం కాస్తా అసంతృప్తి వ్యక్తం చేస్తే చాలు పనిలో నుండి తొలగించేస్తారు. మనం రక్షణకోసం ఎవరి దగ్గరకు వెళతామో వాళ్లు మన యజమానుల స్నేహితులు, తొత్తులు అని మనం పదేపదే గ్రహిస్తున్నాం. మనం కార్మికులం, ఎల్లప్పుడూ అజ్ఞానంలో ఉంచబడుతున్నాం. మనకు విద్యను దూరం చేశారు. ఎందుకంటే విద్య దూరమైతే మనం మన జీవితాలను ఉద్ధరించుకునేందుకు పోరాటాలు ఎలా చేయాలో నేర్చుకోలేకుండా పోతాం. వాళ్లు మనల్ని బందీలను చేశారు. కొద్దిగా నిరసన తెలిపితే చాలు అరెస్టులు చేస్తారు, ప్రవాసం పంపుతారు. అజ్ఞానం, నిర్బంధం... ఈ రెంటి ద్వారా పెట్టుబడిదారులూ, ప్రభుత్వమూ మనల్ని ఎల్లప్పుడూ సేవకులుగా, బానిసలుగా మార్చుకుంటాయి.

మన జీవన స్థితి మెరుగుపరుచుకోడానికీ, మన వేతనాలు పెంచుకోడానికీ, మన పని గంటలు తగ్గించుకోడానికీ, దాడుల నుండి మనల్ని మనం రక్షించుకోడానికీ, మంచి, ఉపయోగకరమైన పుస్తకాలు చదువుకోడానికీ మనకున్న సాధనాలు ఏమిటి? ప్రతి ఒక్కరూ మనకు వ్యతిరేకమే. యజమానులు, వారి తైనాతీలు, పెట్టుబడిదారుల మోచేతి నీళ్లు తాగేవాళ్లు వీళ్లంతా వ్యతిరేకమే. వీరంతా మనల్ని అజ్ఞానంలోనూ, నిర్బంధంలోనూ ఉంచడానికి ప్రయత్నిస్తారు. అందువల్ల మనం వీళ్లెవరి వంకా సహాయం కోసం చూడకూడదు. మనం మనమీద మాత్రమే ఆధారపడాలి. మన బలం యూనియన్‌లలో దాగిఉంది. మన పీడకులకు మనం ఇచ్చే సమైక్య, సుదృఢ, శక్తివంతమైన ప్రతిఘటనలోనే మన విముక్తి దాగి ఉంది. మన బలం ఎక్కడ ఉందో వాళ్లకు చాలా కాలం క్రితం నుండీ తెలుసు. అందుకే వాళ్లుమనల్ని అనైక్యంగా ఉంచడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తున్నారు. మన కార్మికులకు ఉమ్మడి ప్రయోజనాలుంటాయన్న విషయం మనకు అర్థం కాకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. వాళ్లు జీతాలకు కోతపెడతారు. అయితే అందరికీ ఒకే సారి కాదు. మన మీద వాళ్లు ఫోర్‌మెన్‌లను పెడతారు. పీస్ వర్క్‌ను ప్రవేశ పెడతారు. మన వేతనాలను కొద్దికొద్దిగా తగ్గిస్తారు. కానీ ఇదంతా వెనక్కు రాలేని సుదీర్ఘ మార్గం. మన సహనానికి కూడా ఒక హద్దు ఉంటుంది. గత ఏడాది కాలంలో రష్యన్ కార్మికులు తమను ఎంతగా అణచి పెడితే అంతగా పైకి లేస్తామని వాళ్ల యజమానులకు తెలియ జెప్పారు. కార్మికులను విపరీతంగా దోచుకుతినాలనే పెట్టుబడిదారుల దురాశకు తలగ్గొబోమని చాటిచెప్పారు. రష్యాలోని అనేక పట్టణాల్లో సమ్మెలు జరిగాయి...ఫ్రాన్స్, గ్రేట్ బ్రిటన్, జర్మనీ, ఇతర దేశాల్లో కార్మికులు యూనియన్లుగా ఏర్పడి అనేక హక్కులు సాధించుకున్నారు.

కామ్రేడ్స్! మనం గనుక శక్తివంతంగా, హృదయపూర్వకంగా ఐక్యతకోసం కృషి చేస్తే జాతి మతాలతో నిమిత్తం లేకుండా ప్రపంచ కార్మికులందరితో కలిసి ప్రపంచంలోని అన్ని దేశాల పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం నడపగలం. మన చేతులకు కట్టిన సంకెళ్ళను మనం తెంచిపారేయగలం. రష్యన్ కార్మికులు శిరమెత్తడం ఖాయం. పెట్టుబడిదారులూ, వారికి ఊడిగం చేసే ప్రభుత్వం భయంతో వణికిపోవడం ఖాయం.

**(1896 ఏప్రిల్‌లో లెనిన్ రాసిన మేడే కరపత్రం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి.)**





# లెనిన్ - అక్టోబర్ విప్లవం



రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటర్

ఎస్ వెంకట్రావు

మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్దిష్టంగా అమలుచేయడం ఎలాగో కార్మికవర్గానికి బోధించాడు లెనిన్. అందుకే మార్క్స్-ఏంగెల్స్ తరువాత మార్క్సిస్టు మహోమహోపాధ్యాయునిగా చరిత్రలో చిరస్థానం సంపాదించుకున్నాడాయన. మార్క్సిజం అనే శాస్త్రీయ సిద్ధాంతాన్ని మరో మెట్టు పైకి తీసుకుపోయి దాన్ని ఒక కళగా మార్చాడు లెనిన్. అందుకే లెనిన్ తరువాత మార్క్స్-ఏంగెల్స్ సిద్ధాంతం మార్క్సిజంగా కాక మార్క్సిజం-లెనినిజంగా మారింది. "మా సిద్ధాంతం పిడివాదం కాదు, అది ఆచరణకు కరదీపిక" అన్నారు మార్క్స్-ఎంగెల్స్. సిద్ధాంతానికీ, ఆచరణకూ మధ్య ఉన్న గతితార్కిక సంబంధాన్ని ఆచరణలో చూపించడం ద్వారా అక్టోబర్ విప్లవం సాధించాడు లెనిన్. మార్క్సిజం సిద్ధాంతంగా ఉంటే అది ఒక శాస్త్రంగా (సైన్సుగా) మిగిలిపోతుంది. కానీ అది ఆచరణకు మార్గదర్శిగా మారినప్పుడు ఒక కళగా మారుతుంది. సైన్సు ఉనికిలో ఉన్నదాన్ని గురించి చెబుతుంది. కళ ఎలా పనిచేయాలో చెబుతుంది. మార్క్సిజాన్ని గొప్ప కళగా మార్చడమే లెనిన్ మానవాళికి చేసిన మహోపకారం.

"మార్క్స్ మొదటి ఇంటర్నేషనల్‌ను స్థాపించకపోయినా ఆయన మార్క్స్ గానే ఉండేవాడు. కానీ లెనిన్ బోల్షివిక్ పార్టీని నిర్మించకుండా, 1905 విప్లవానికీ, తరువాత 1917 విప్లవాలనికీ నాయకత్వం వహించకుండా, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ (కొమింటర్న్) స్థాపించకుండా చనిపోయి ఉంటే ఆయన లెనిన్ కాకుండా ఉండేవాడు" అని అంటాడు లెనిన్ జీవిత చరిత్ర రాసిన రచయిత టోనీ క్లిఫ్. ఏంగెల్స్‌తో కలిసి మార్క్స్ శాస్త్రీయ సిద్ధాంతాన్ని కార్మిక వర్గానికి అందించాడు. అది ఆయనకు చరిత్రలో విశిష్టత కల్పించింది. ఆయన మొదటి ఇంటర్నేషనల్ (అంతర్జాతీయ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్) స్థాపించకపోయినా ఆయన స్థానానికి, ఆయన కంట్రిబ్యూషన్‌కు ధోకా ఉండేది కాదు. కానీ లెనిన్ మార్క్సిజాన్ని ఆచరణలో పెట్టడం ద్వారా అంటే రష్యన్ విప్లవాన్ని నడపడం ద్వారా మార్క్సిజాన్ని ఆచరణాత్మకంగా నిరూపించాడు. అంటే శాస్త్రీయ సిద్ధాంతాన్ని అందించడం ద్వారా మార్క్స్, దాన్ని ఆచరణలో నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్టంగా అన్వయించడం ద్వారా లెనిన్ మార్క్సిస్టు-లెనినిస్టు మహోపాధ్యాయులైనారు. "మార్క్సిజాన్ని సిద్ధాంతం నుండి ఆచరణకు, సైన్సు నుండి కళకు అభివృద్ధి చేయడం ద్వారా లెనిన్ ఈ రెంటి మధ్య ఉన్న గతితార్కిక సంబంధాన్ని అంటే రెంటి మధ్య ఉమ్మడిగా ఉన్నదేమిటి, రెంటి మధ్య తేడా ఏమిటి అన్నదాన్ని చూపించాడు" అని టోనీ క్లిఫ్ పేర్కొన్నాడు. రష్యాలో అక్టోబర్ విప్లవం జయప్రదం చేయడంలో లెనిన్ అనుసరించిన వ్యూహాలు, ఎత్తుగడలను పరిశీలిస్తే ఈ విషయం మనకు తేటతెల్లమవుతుంది.

### లెనిన్‌కు ముందు రష్యాలో విప్లవోద్యమం

1855లో రష్యాకు చక్రవర్తిగా పగ్గాలు చేపట్టిన అలెగ్జాండర్-2 అనేక రాజకీయ, సామాజిక సంస్కరణలు తెచ్చాడు. బానిసత్వాన్ని నిషేధించాడు. నరోద్నయా వోల్యా అనే సంస్థ జారు చక్రవర్తి అలెగ్జాండర్-2ను 1881లో హత్య చేసింది. అతని వారసునిగా వచ్చిన అలెగ్జాండర్ -3 ప్రజలపై తీవ్రమైన నిర్బంధం ప్రయోగించాడు. ఈ కాలంలోనే రష్యాలో పరిశ్రమలు బాగా పెరిగాయి. కార్మిక పోరాటాలూ పెరిగాయి. కార్మికోద్యం వెల్లువలా అభివృద్ధి చెందింది. అయితే మార్క్సిస్టు గ్రూపులతో పాటు ఆ కాలంలో కార్మికవర్గంపై నరోద్నిక్కుల (ప్రజామిత్రులు) ప్రభావం ఎక్కువగా ఉండేది. వీరితోపాటు అనార్కిస్టులు, ఆధునీకరణను వ్యతిరేకించే స్లావోఫిల్స్ కూడా కార్మికవర్గంపై ప్రభావం కలిగించేవారు. 1894లో అలెగ్జాండర్-3 మరణం తరువాత నికొలాస్-2 రష్యన్ చక్రవర్తి అయినాడు. రష్యన్ సామ్రాజ్య విస్తరణకోసం జారు ప్రభుత్వం నిరంతర యుద్ధాల్లో మునిగి ఉండేది. ఒకవైపు రష్యన్ గ్రామీణ ప్రాంతంలో భూస్వాముల పీడన, మరోవైపు పట్టణాల్లో పెట్టుబడిదారీ దోపిడీ వీటికి తోడు నిరంతర యుద్ధాలతో రష్యన్ ప్రజానీకం దుర్భర పరిస్థితులనెదుర్కొంటున్న రోజులవి.

### మార్క్సిస్టు పార్టీ నిర్మాణం

మార్క్సిజం రష్యాలో వేళ్లూనుకుంటున్న దశలో లెనిన్ రంగ ప్రవేశం చేశాడు. ఆయనకు ముందు రష్యాలో ప్లెఖనోవ్ మార్క్సిజాన్ని ప్రచారం చేసేవాడు. 1883లో ప్లెఖనోవ్ 'కార్మిక విముక్తి సమితి' పేరుతో రష్యాలో మొదటి మార్క్సిస్టు సంస్థను ఏర్పాటు చేసి నరోద్నిక్కులు అనబడేవారి తప్పుడు సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పోరాడేవాడు. 1888 చివరిలో లెనిన్ కజాన్‌లోని ఒక మార్క్సిస్టు కేంద్రంలో సభ్యుడుగా చేరాడు. మరుసటి ఏడాది సమారా వెళ్లి అక్కడ తానుగా ఒక మార్క్సిస్టు కేంద్రాన్ని నెలకొల్పాడు. తరువాత పీటర్స్‌బర్గ్‌లోని మార్క్సిస్టులతో సంబంధాలు నెలకొల్పుకున్నాడు. అప్పటివరకు రష్యాలో మార్క్సిజం ఒక సిద్ధాంతంగా మాత్రమే ఉండేది. కార్మిక వర్గ ఉద్యమంతో దానికి సంబంధాలు ఉండేవి కావు. లెనిన్ విప్లవ కార్యాచరణకు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని మార్గదర్శకంగా మార్చాడు. ఆయనలోని విశేషమేమంటే ఆయన రచనలన్నీ కూడా రష్యన్ కార్మికవర్గ విప్లవంలో వచ్చే ఎడాపెడా ధోరణులను ఖండించేవిధంగా ఉంటాయి. పెడధోరణులను పూర్వపక్షం చేయడం ద్వారా ఆయన మార్క్సిస్టు కార్యాచరణ పద్ధతి సరైందని నిరూపించేవాడు. దీనికి అధ్యయనం, సమగ్ర పరిశీలనాపద్ధతిని ఆయన అనుసరించాడు.

> "1898లో లెనిన్ ప్రవాసంలో ఉండగా రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ ప్రథమ మహాసభ జరిగింది. ఈ మహాసభ అనంతరం పార్టీలో అంతులేని సిద్ధాంత గందరగోళం ఏర్పడింది. లెనిన్ ప్రవాసం నుండి వచ్చిన తరువాత ఈ సిద్ధాంత గందరగోళానికి వ్యతిరేకంగా మార్క్సిజం ఆధారంగా తీవ్రమైన సైద్ధాంతిక పోరాటం జరిపాడు. పార్టీ పత్రిక ఇస్క్రా ఇందులో కీలక పాత్ర వహించింది."

నరోద్నిజాన్ని ఓడించడం కోసం ఆయన రష్యన్ రైతాంగ పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసి 1893లో "రష్యన్ రైతాంగ జీవితంలో నూతన ఆర్థిక పరిణామాలు" అన్న వ్యాసం రాశాడు. ఇదే లెనన్ మొదటి రచన. రష్యాలో కార్మికవర్గం అభివృద్ధి కాదనీ, రైతాంగమే విప్లవం తెస్తుందని నరోద్నిక్కుల వాదనను పూర్వపక్షం చేయడం కోసం ఆయన ఈ అధ్యయనం చేసి రష్యన్ రైతాంగంలోని వైరుధ్యాలను వివరించాడు. అలాగే ప్రపంచ పరిణామాల పట్ల నరోద్నిక్కుల తప్పుడు భావాలను విమర్శిస్తూ "ప్రజామిత్రుల నిజస్వరూపం" అన్న పుస్తకాన్ని రాశాడు. అది 1894లో రహస్యంగా అచ్చయింది. తరువాత రష్యాలోని చట్టబద్ధ మార్క్సిస్టులుగా చెలామణి అవుతున్న మేధావుల బూర్జువా ఆలోచనా ధోరణిని ఎండగట్టాడు. రష్యాలోని వివిధ మార్క్సిస్టు గ్రూపులను ఏకం చేయడం, కార్మిక వర్గంలో రాజకీయ ప్రచారం చేయడం, వారికి శిక్షణనివ్వడం, నిర్మాణం చేయడం లెనిన్ కర్తవ్యంగా ఎంచుకున్నాడు. దానికోసం ఆయన 1895లో 'కార్మిక విమోచనా పోరాట సమితి' పేరుతో సోషల్ డెమోక్రటిక్ సంస్థను ఏర్పరిచాడు. ఇది మూడు లెనినిస్టు సూత్రాలపై నిర్మించబడింది. 1. కేంద్రీకృత నిర్వహణ 2. ఖచ్చితమైన క్రమశిక్షణ 3. ప్రజలతో సన్నిహిత సంబంధాలు. ఈ సంస్థ తరఫున వెలువడిన పత్రికలకు లెనిన్ సంపాదకుడుగా వ్యవహరించాడు. కార్మిక విమోచనా పోరాట సమితి కార్యకలాపాలకు కంగారు పడిన జారు ప్రభుత్వం లెనిన్‌తో సహా సమితి నాయకులనూ, 40 మంది కార్యకర్తలనూ 1895లో అరెస్టు చేసింది. రెండేళ్ల తరువాత ఆయనను సైబీరియాకు ప్రవాసం పంపింది. లెనిన్ జైలులోనూ, ప్రవాసంలోనూ ఉండగా సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో కార్మిక విమోచనా పోరాట సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్మిక పోరాటాలు ప్రజ్వరిల్లాయి. ఇవి దేశమంతా వ్యాపించాయి. ఈ సమ్మెలు, పోరాటాలు తొలిసారిగా సోషల్ డెమోక్రాటిక్ పార్టీ నాయకత్వంలో జరగడం విశేషం.

ఈ సందర్భంగా లెనిన్ రెండు ముఖ్యమైన రచనలు చేశాడు. ఒకటి, రష్యాలో పెట్టుబడి దారీ అభివృద్ధిపై వాస్తవ సమాచారాన్ని సేకరించి 1899లో రాసిన "రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి" అన్న రచన. ఈ రచనలో ఆయన రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధిని గురించి వివరిస్తూ అంతకుముందున్న అర్థబానిస అవశేషాలకూ, ముందుకు వస్తున్న పెట్టుబడిదారీ విధానానికీ మధ్య తలెత్తిన వైరుధ్యాన్ని వివరించాడు. దేశంలో విప్లవ శక్తులు రూపొందుతున్నాయనీ, ప్రస్తుత వ్యవస్థ నిర్మూలనకు పరిస్థితులు పరిపక్వమవుతున్నాయని చెప్పాడు. కార్మిక వర్గం నిర్ణయాత్మకంగా మారుదోందని వివరించాడు. లెనిన్ పరిశీలన నరోద్నిక్కుల అభిప్రాయాల లోని డొల్లతనాన్ని ఎండగట్టింది. లెనిన్ నిర్ధారణల ఆధారంగా రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ తన కార్యక్రమాలనూ, ఎత్తుగడలనూ రూపొందించింది. ఆ విధంగా రష్యాలో మార్క్సిస్టు ఆలోచనలకు లెనినిస్టు ఆచరణ తోడైంది.

రెండవది, దేశంలో పెరిగిపోయిన ఆర్థిక వాదాన్ని విమర్శిస్తూ 1902లో లెనిన్ రాసిన "ఏమి చేయాలి" గ్రంథం. రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీలో ఈ కాలంలో ఆర్థిక వాదం బలంగా ముందుకు వచ్చింది. సోషల్ డెమోక్రాట్లు ఆర్థిక సమస్యలపై పోరాటాలకే పరిమితం కావాలనీ, రాజకీయ పోరాటాన్ని ఇతర లిబరల్ పార్టీలకు వదిలిపెట్టాలని వాదించారు. రాజకీయ సంస్థ లేకుండా సంకుచితమైన ట్రేడ్ యూనియన్ల నిర్మాణంతో సరిపెట్టాలనీ, ఆర్థిక సమస్యలపై పోరాడితే సరిపోతుందనేది వీరి వైఖరి. ఈ వైఖరి అవకాశవాదం, సంస్కరణ వాదమని లెనిన్ విమర్శించాడు. కార్మిక వర్గానికి స్వతంత్రమైన స్వంత పార్టీ ఉండాలన్న మార్క్స్ నిర్ధారణను అంతర్జాతీయ కార్మికోద్యమం పూర్తిగా అనుసరించాలని లెనిన్ చెప్పాడు. కార్మికవర్గ అగ్రగామి దళంతో పార్టీ ఏర్పడాలన్నాడు. అది కార్మికోద్యమానికి సోషలిస్టు చైతన్యాన్ని అందించే పనిని చేయాలన్నాడు. ఈ పార్టీ రైతు ఉద్యమాలకు సహాయం అందించాలనీ, గ్రామీణ ప్రాంతాలతో కార్మికోద్యమం సంబంధాలు కలిగి ఉండాలనీ చెప్పాడు. ఇస్క్రా పత్రికలో నిత్యం రాసే వ్యాసాల ద్వారా లెనిన్ కార్మిక వర్గ పార్టీ నిర్మాణానికి కృషి చేశాడు. 1903 లో రాసిన 'గ్రామీణ పేదలకు' అన్న గ్రంథంలో ఆయన ఉద్యమంలో కార్మికులు, రైతుల మధ్య సంబంధాన్ని గురించి వివరించాడు. ఉద్యమంలో కార్మికులు, రైతులు మిత్రులుగా పాల్గొనాలని చెప్పాడు.

1898లో లెనిన్ ప్రవాసంలో ఉండగా రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ ప్రథమ మహాసభ జరిగింది. ఈ మహాసభ అనంతరం పార్టీలో అంతులేని సిద్ధాంత గందరగోళం ఏర్పడింది. లెనిన్ ప్రవాసం నుండి వచ్చిన తరువాత ఈ సిద్ధాంత గందరగోళానికి వ్యతిరేకంగా మార్క్సిజం ఆధారంగా తీవ్రమైన సైద్ధాంతిక పోరాటం జరిపాడు. పార్టీ పత్రిక ఇస్క్రా ఇందులో కీలక పాత్ర వహించింది. 1903లో జరిగిన ద్వితీయ మహాసభలో అవకాశవాద మెన్షివిక్కులకూ, విప్లవకర బోల్షివిక్కులకూ మధ్య తీవ్రమైన ఆంతరంగిక పోరాటం జరిగింది. విప్లవ పార్టీలో ఉండాల్సిన కేంద్రీకృత ప్రజాస్వామ్య నిర్మాణ సూత్రాలపై చర్చ పతాక స్థాయికి అందుకుంది. నరోద్నిక్కులపై పోరాటంలో లెనిన్‌తో పాటు కృషి చేసిన ప్లెఖనోవ్ లాంటివారు కూడా ఊగిసలాటకు గురయ్యారు. అలాంటి పరిస్థితుల్లో మెన్షివిజపు దివాళాకోరుతనాన్ని ఎండగట్టడం కోసం లెనిన్ 1904లో "ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు" అన్న గ్రంథాన్ని రచించాడు. అధికారం కోసం జరిపే పోరాటంలో శ్రామికవర్గానికి పార్టీ నిర్మాణానికి మించిన ఆయుధం లేదని లెనిన్ ఈ గ్రంథంలో వివరిస్తాడు.

### 1905 విప్లవం: గుణపాఠాలు

1905 నాటికి రష్యాలో లెనిన్ నాయకత్వంలోని బోల్షివిక్కులకూ, మెన్షివిక్కులకూ మధ్య చీలిక తీవ్ర రూపం దాల్చింది. రెండు గ్రూపులుగా విడిపోయి రెండు కేంద్రకమిటీలు ఏర్పడ్డాయి. ఎవరి పత్రిక వారు పెట్టుకున్నారు. రెండు గ్రూపుల మధ్య సయోధ్య కుదర్చడానికి రెండవ ఇంటర్నేషనల్ చేసిన ప్రయత్నాలు

ఫలించలేదు. ఇంతలో రష్యాలో 1905 విప్లవం ప్రారంభమైంది.

19వ శతాబ్దం చివరిలో జారిస్టు రష్యా అనేక దురాక్రమణ యుద్ధాలు చేసింది. అదే సమయంలో దేశంలో కార్మికోద్యమం ఉధృతమైంది. దీన్ని అదుపులో పెట్టాలంటే యుద్ధమే శరణ్యమని జారు భావించాడు. దానికోసం అతను జపాన్‌పై దాడి చేశాడు. ఈ యుద్ధంలో గెలిస్తే ప్రజల్లో తన స్థానం మరింత పటిష్టమవుతుందని భావించాడు. కానీ జారు సైన్యాలకు సరైన శిక్షణ, ఆయుధాలు లేకపోవడంతో రష్యా బాగా దెబ్బతిన్నది. ఓటమి మీద ఓటమి చవి చూసింది. లక్షల మంది సైన్యం చనిపోయారు. మరిన్ని లక్షల మంది గాయపడ్డారు. జారు యుద్ధం ద్వారా రష్యాలో పెరుగుతున్న విప్లవోద్యమాన్ని దెబ్బతీయవచ్చున నుకున్నాడు కానీ యుద్ధమే విప్లవాన్ని ముందుకు తెచ్చింది. 1904 చివరిలో ప్రారంభమై 1905 జనవరి నాటికి రష్యాలో కార్మిక సమ్మెలు ఉధృతమైనాయి. జనవరి 3న సెంట్ పీటర్స్‌బర్గ్‌లో పెద్ద సమ్మె జరిగింది. సమ్మెలో పాల్గొన్న కార్మికుల ముందు గేసన్ అనే మతాధిపతి ఒక కార్యమం ప్రతిపాదించాడు. ఆయన ఇచ్చిన కార్యక్రమాన్ని అనుసరించి పీటర్స్‌బర్గ్‌లోని వివిధ ఫ్యాక్టరీలకు చెందిన కార్మికులు 1 లక్షా 40 వేల మంది జనవరి 9 ఆదివారం నాడు కుటుంబాలతో సహా జారు చక్రవర్తి నివసించే వింటర్ ప్యాలెస్‌కు జారు చిత్రపటాలు పట్టుకుని, వినతి పత్రాలతో హాజరైనారు. ఆ విధంగా చేస్తే జారు వారి విన్నపాలను మన్నిస్తాడని గేసన్ వారిలో భ్రమలు కల్పించాడు. వినతుల ద్వారా విముక్తి రాదని బోల్షివిక్కులు కార్మికులకు చెబుతూనే ఆ ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రదర్శన వింటర్ ప్యాలెస్‌కు చేరుకున్నంతనే వారిపై జారు కాల్పులు జరిపించాడు. వెయ్యి మంది కార్మికులు చనిపోగా అనేక వేల మంది గాయపడ్డారు. చనిపోయినవారిలో బోల్షివిక్కులు కూడా ఉన్నారు. ఆ రోజున పీటర్స్‌బర్గ్ వీధుల్లో కార్మిక రక్తం ప్రవహించింది. అందుకే ఆ రోజును “బ్లాక్ సండే” అంటున్నారు.

ఈ దారుణ హత్యాకాండతో రష్యాలో కార్మిక సమ్మెలు దేశమంతటా వ్యాపించాయి. ఇప్పుడు కార్మికులు “జారు చక్రవర్తి నశించాలి” అన్న రాజకీయ నినాదాన్ని ఎత్తుకున్నారు. దేశవ్యాపితంగా జనవరి నెలలోనే 4 లక్షల 40 వేల మంది సమ్మెలో పాల్గొన్నారు. కార్మికోద్యమం ఆర్థిక డిమాండ్లనుండి రాజకీయ డిమాండ్లకు మారడం ద్వారా విప్లవ స్థాయి

> **“1905 అక్టోబర్ నాటికి రష్యాలో జనరల్ రాజకీయ సమ్మె ఉధృతమైంది. జనజీవనం స్థంభించి పోయింది. దాంతో లెనిన్ విదేశాలనుండి పీటర్స్ బర్గ్ చేరుకుని విప్లవానికి నేరుగా నాయకత్వం వహించాడు. అక్టోబర్-డిసెంబర్ మధ్య దేశంలోని పెద్ద పట్టణాల్లో కార్మిక సోవియట్లు, సైనిక సోవియట్లు, రైతాంగ సోవియట్లు ఏర్పడి అధికారాన్ని చేతుల్లోకి తీసుకున్నాయి. డిసెంబర్‌లో మాస్కో కార్మికులు తొమ్మిది రోజుల పాటు సాయుధ తిరుగుబాటు చేయడంతో విప్లవం తారా స్థాయికి చేరుకుంది.”**



అక్టోబర్ 24వ తేదీ (నవంబర్ 6) రాత్రి పెట్రోగ్రాడ్‌లోని స్మోల్నీ భవనాన్ని ఆక్రమించుకుంటున్న విప్లవ సైన్యం

నందుకుంది. రాజకీయ సమ్మెలు అక్కడక్కడా జారు సైన్యంతో సాయుధ ఘర్షణలకు కూడా దారితీయడం, క్రమంగా విస్తరించడం ప్రారంభించాయి. పట్టణాలనుండి ఉద్యమం పల్లెలకు వ్యాపించింది. రైతులు పోరాటంలోకి దిగారు. భూస్వాముల ఎస్టేట్లు స్వాధీనం చేసుకోవడం ప్రారంభించారు. భూస్వాములు పట్టణాలకు పారిపోయారు. ఈ లోగా 1905 జూన్‌లో జారు సైన్యంలోని పొటమ్కిన్ యుద్ధ నౌకలోని నావికులు తిరుగుబాటు చేసి విప్లవకారుల పక్షం చేరారు. ఇది జారు పక్షం స్థయిర్యాన్ని బాగా దెబ్బతీసింది. ఒకవైపు కార్మికుల రాజకీయ సమ్మెలు ఉధృతం కావడం, ఉద్యమంలో రైతాంగం చేరడం, మరోవైపు సైన్యంలో తిరుగుబాటు... ఇవన్నీ దేశంలో సాయుధ తిరుగుబాటుకు పరిస్థితులు పక్వమైనాయన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నట్లు లెనిన్ పేర్కొన్నాడు. ఈ పరిస్థితుల్లో బోల్షివిక్కుల ఎత్తుగడలను వివరిస్తూ లెనిన్ “ప్రజాస్వామ్య విప్లవంలో సోషల్ డెమోక్రాట్ల రెండు ఎత్తుగడలు'' అన్న పుస్తకాన్ని రాశాడు. ఇందులో ఆయన ఎత్తుగడలకు సంబంధించి మూడు సూత్రీకరణలు చేశాడు. 1. కార్మిక వర్గం బూర్జువా విప్లవానికి నాయకత్వం వహిస్తుంది, వహించాలి. 2. జారు ప్రభుత్వాన్ని కూలద్రోసి ప్రజాస్వామిక రిపబ్లిక్కు స్థాపించాలంటే సాయుధ పోరాటమే మార్గం. 3. ప్రజాస్వామిక దశతో విప్లవం ఆగిపోదు. ఈ దశలో నిర్వహించాల్సిన కర్తవ్యాలు నిర్వహించిన అనంతరం కార్మిక వర్గ నాయకత్వంలో సోషలిస్టు విప్లవం కోసం పోరాడుతుంది. లెనిన్ ఎత్తుగడలను మెన్షివిక్కులు తిరస్కరించారు. రైతాంగపు విప్లవ పోరాట శక్తిని వారు తక్కువ అంచనా వేశారు. దేశం పూర్తిగా పారిశ్రామిక వంతమై కార్మిక వర్గం జనాభాలో అధికశాతం అయినప్పుడు మాత్రమే సోషలిస్టు విప్లవం వస్తుందని వారు వాదించారు. వారి వాదనలను లెనిన్ తిరస్కరించాడు. దీనిపై “రెండు ఎత్తుగడలు” అనే గ్రంథం రాస్తూ సోషలిస్టు విప్లవాన్ని గురించిన మార్క్సిస్టు అవగాహనను మరింత పెంచాడు.

1905 అక్టోబర్ నాటికి రష్యాలో జనరల్ రాజకీయ సమ్మె ఉధృతమైంది. జనజీవనం స్థంభించి పోయింది. దాంతో లెనిన్ విదేశాలనుండి పీటర్స్ బర్గ్ చేరుకుని విప్లవానికి నేరుగా నాయకత్వం వహించాడు. అక్టోబర్–డిసెంబర్ మధ్య దేశంలోని పెద్ద

> **"మొదటి ప్రపంచ యుద్ధాన్ని లెనిన్, బోల్షివిక్కులు సామ్రాజ్య వాద యుద్ధంగా నిర్వచించారు. కానీ అనేక ఐరోపా సోషల్ డెమోక్ర టిక్ పార్టీలు ఈ సూత్రీకరణను అంగీకరించలేదు. ఈ యుద్ధాన్ని అవి జాతీయవాద యుద్ధాలుగా అభివర్ణించి తమ దేశాల బూర్జువా పాలకవర్గాలను వెనకేసు కొచ్చాయి. యుద్ధంలో కార్మిక వర్గం ఇతర దేశాలకు చెందిన తన తోటి కార్మిక వర్గం మీదకు తుపా కులు ఎక్కుపెట్టేందుకు సహకరించాయి. కార్ల్ కాట్స్కీ వంటివారు తమ దివాళాకోరు విధానాలకు సైద్ధాంతిక సమర్ధనలకు దిగారు."**

పట్టణాల్లో కార్మిక సోవియట్లు, సైనిక సోవియట్లు, రైతాంగ సోవియట్లు ఏర్పడి అధికారాన్ని చేతుల్లోకి తీసుకున్నాయి. డిసెంబర్‌లో మాస్కో కార్మికులు తొమ్మిది రోజుల పాటు సాయుధ తిరుగుబాటు చేయడంతో విప్లవం తారా స్థాయికి చేరుకుంది. మాస్కోలో జరిగిన తిరుగుబాటు ఇతర నగరాలకు కూడా వ్యాపించింది. అయితే విడివిడిగా జరిగిన ఈ తిరుగుబాట్లను జార్ ప్రభుత్వం ఎక్కడికక్కడ అణచివేసింది. 1907 నాటికి విప్లవ వెల్లువ పూర్తిగా అణచివేయబడింది. అయితే 1905 విప్లవం ఓడిపోలేదనీ, రానున్న విప్లవానికి రిహార్సల్‌గా ఉపయోగపడిందనీ లెనిన్ గుణపాఠాలు తీశాడు. తిరుగుబాటులోని విప్లవ లక్షణాన్ని ప్రశంసిస్తూనే నిర్మాణ లోపాలను ఆయన నిర్మొహమాటంగా వెల్లడించాడు. సాయుధపోరాటాన్ని మరింత కృతనిశ్చయంతో చేయాల్సి ఉండిందనీ, దెబ్బ కాచుకోవడం కాకుండా ఎదురు దాడి చేసి ఉండాల్సిందనీ, సైన్యాన్ని తమవైపు తిప్పుకోవాల్సిందనీ, ఈ పోరాటంలో రైతాంగం పాల్గొనేట్లు ముందుగానే చర్యలు తీసుకోవాల్సిందనీ ఆయన చెప్పాడు. ఈ గుణపాఠాలతో కొత్త పోరాటానికి సిద్ధం కావాలని ఆయన కార్మికవర్గానికి పిలుపునిచ్చాడు.

### 1914 మొదటి ప్రపంచ యుద్ధం

1905 విప్లవ ఓటమి తరువాత మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యేవరకు లెనిన్ రెండవ ఇంటర్నేషనల్ పార్టీల్లోని మితవాద, రివిజనిస్టు పోకడలకు వ్యతిరేకంగా ఉధృతమైన పోరాటం నడపాల్సి వచ్చింది. యూరప్‌లోని అనేక సోషల్ డెమొక్రటిక్ పార్టీలు బూర్జువా ప్రభావానికి లోనై జాతీయవాదం బాట పట్టాయి. "ఫాదర్ లాండ్ రక్షణ" పేరుతో యుద్ధాలకు సహకరించే వైఖరి చేపట్టాయి. మితవాద ధోరణులకు వ్యతిరేకంగా పోరాడే ఈ దశలోనే 1909లో లెనిన్ "మెటీరియలిజం అండ్ ఎంపీరియో క్రిటిసిజమ్" అనే గ్రంధాన్ని రాశాడు. జెనీవా, లండన్‌లలో ప్రవాసంలో ఉన్నప్పుడు ఆయన ఈ పుస్తకాన్ని రాశాడు. మానవుల ఆలోచనలు బాహ్య ప్రపంచంలోని వాస్తవికతను ప్రతిబింబిస్తాయని ఆయన ఇందులో పేర్కొన్నాడు.

మొదటి ప్రపంచ యుద్ధాన్ని లెనిన్, బోల్షివిక్కులు సామ్రాజ్యవాద యుద్ధంగా నిర్వచించారు. కానీ అనేక ఐరోపా సోషల్ డెమొక్రటిక్ పార్టీలు ఈ సూత్రీకరణను అంగీకరించలేదు. ఈ యుద్ధాన్ని అవి జాతీయవాద యుద్ధాలుగా అభివర్ణించి తమ దేశాల బూర్జువా పాలకవర్గాలను వెనకేసు కొచ్చాయి. యుద్ధంలో కార్మికవర్గం ఇతర దేశాలకు చెందిన తన తోటి కార్మిక వర్గం మీదకు తుపాకులు ఎక్కుపెట్టేందుకు సహకరించాయి. జర్మన్ నాయకుడు కార్ల్ కాట్స్కీ వంటివారు తమ దివాళాకోరు విధానాలకు సైద్ధాంతిక సమర్ధనలకు దిగారు. రివిజనిస్టుల యుద్ధ సమర్ధనలను ఖండిస్తూ ఇది సామ్రాజ్యవాద యుద్ధం అని నిరూపించేందుకు లెనిన్ విస్తృతంగా రచనలు చేశారు. ఆ రచనల్లో అతి ముఖ్యమైనది, లెనిన్ నిర్దిష్ట పరిశీలనకు మచ్చుతునక అయినదీ "సామ్రాజ్యవాదం – పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ" అన్న ఆయన గ్రంథం. లెనిన్ రాసిన ఈ గ్రంథం నేటికీ పెట్టుబడిదారీ వ్యవస్థను అర్థం చేసుకోడానికి కమ్యూనిస్టులకు కరదీపికగా ఉపయోగపడుతుంది. పెట్టుబడి దారీ వ్యవస్థ అంతకుముందున్న స్వేచ్ఛా అభివృద్ధి దశనుండి గుత్త దశకూ, పరాన్నభుక్కు దశకూ, పతన దశకూ, చివరికి మరణావస్థకూ చేరుతుందని లెనిన్ ఈ గ్రంథంలో వివరించాడు. మొదటి ప్రపంచ యుద్ధం ఉచ్ఛ దశలో ఉండగా 1916లో లెనిన్ ఎంతో సమాచారాన్ని సేకరించి ఈ పుస్తకాన్ని రాశాడు.

సామ్రాజ్యవాద యుద్ధం ప్రపంచంలో తీవ్రమైన వినాశనాన్ని సృష్టించింది. కోటిమంది ప్రజలు మరణించారు. అనేక కోట్లమంది క్షతగాత్రులైనారు. విపరీతమైన విధ్వంసం జరిగింది. ఆయా దేశాల కార్మిక వర్గం తమ తోటి కార్మికులపైకి ఎత్తుపెట్టిన తుపాకులను తమ దేశాల్లోని అభివృద్ధి నిరోధక పాలకవర్గాలపై ఎక్కుపెట్టినప్పుడే యుద్ధం అంతమౌతుందని లెనిన్ చెప్పాడు. కానీ రెండవ ఇంటర్నేషనల్ దీనికి విరుద్ధంగా విద్రోహవైఖరి తీసుకున్నది. అయితే లెనిన్ పిలుపును రష్యాలో బోల్షివిక్కులు ఆచరణలో పెట్టారు.

### 1917 ఫిబ్రవరి విప్లవం

లెనిన్ నాయకత్వాన రివిజనిజంపై జరిపిన పోరాటంలో బోల్షివిక్ పార్టీ కొత్త విప్లవ జవసత్వాలు సమకూర్చుకున్నది. "సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చండి" అన్న లెనిన్ నినాదాన్ని రష్యాలో బోల్షివిక్ పార్టీ అమలు చేసింది. ఇదే సమయంలో సైనిక రంగంలో రష్యన్ కార్మికుల స్థితి మరింత హీనంగా మారింది. వారికి సరైన తిండిలేదు. దుస్తులు లేవు. బూట్లు లేవు. తుపాకులు లేవు. దానికి తోడు రష్యాలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. ఆహార కొరత వచ్చింది. ఇలాంటి స్థితిలో బోల్షివిక్కులు లెనిన్ ఇచ్చిన పిలుపును అమలు చేశారు. మొదటిది, రష్యన్ పార్లమెంటు (డ్యూమా)లో బోల్షివిక్ ప్రతినిధులు యుద్ధ ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఓటు చేశారు. రెండు, వారు ప్రజల్లో యుద్ధానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. మూడోది, సైన్యంలో కూడా ప్రవేశించి వారిలో యుద్ధానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. సైన్యంలో పార్టీ శాఖలు నిర్మించారు.

ఈ పరిస్థితుల్లో రష్యన్ బూర్జువా వర్గంలో కూడా అసంతృప్తి బయలు దేరింది. వారూ ప్రభుత్వానికి వ్యతిరేక పక్షంలో చేరారు. అయితే అధికారాన్ని తమ హస్తగతం చేసుకుని నడపాలన్న కోర్కెతో వారు వ్యవహరించేవారు. 1917 జనవరి 9న రష్యాలోని అనేక నగరాల్లో సమ్మెలు ప్రారంభమై రోజురోజుకూ ఉధృతమైనాయి. ఫిబ్రవరి 23వ తేదీ (రష్యా పాత క్యాలండరు ప్రకారం ఫిబ్రవరి 23వ తేదీ నేటి క్యాలెండరు ప్రకారం మార్చి 8వ తేదీ) అంతర్జాతీయ మహిళా దినోత్సవం. ఆ రోజున రష్యాలో కార్మికవర్గ నాయకత్వంలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవం ప్రారంభమైంది. ఆరోజు పెట్రోగ్రాడ్‌లోని ఫ్యాక్టరీలలో పనిచేసే 10 వేల మంది కార్మిక మహిళలు (వీరిలో

అనేకమంది సైనికుల భార్యలు) యుద్ధం వద్దు, తిండి కావాలి అనే నినాదంతో సమ్మె చేసి ప్రదర్శన జరిపారు. 1 లక్ష 30 వేల మంది కార్మికులు వీరితో చేరిపోయి సమ్మెలో పాల్గొన్నారు. మరునాటికి సమ్మె చేసే కార్మికుల సంఖ్య 2 లక్షలకు చేరింది. పెట్రోగ్రాడ్‌లోని కార్మికుల్లో దాదాపు సగం మంది సమ్మెలోకి వచ్చేశారు. వీరు జారు గద్దెదిగాలి అన్న రాజకీయ నినాదాన్ని అందుకున్నారు.

26న పెట్రోగ్రాడ్ పార్టీ కార్యాలయం ప్రజా తిరుగుబాటుకు పిలుపునిచ్చింది. 27వ తేదీనాటికి సైనికులు కూడా ప్రజల తిరుగుబాటులో చేరారు. ఆ రోజు ఉదయం 10 వేల మంది సైనికులు ప్రజలతో చేరితే సాయంత్రానికి వారి సంఖ్య 60 వేలు దాటిపోయింది. వెనువెంటనే విప్లవకారులు జారు మంత్రుల్నీ, సైనికాధికారుల్నీ అరెస్టు చేశారు. జైళ్లలోని విప్లవకారుల్ని విడుదల చేశారు. ఇతర నగరాల్లో కూడా తిరుగుబాటుదార్లు జారిస్టు అధికారులను తొలగించి అధికారం చేపట్టారు. ఈ విధంగా ఫిబ్రవరి విప్లవం జయప్రదమైంది. ఈ విప్లవానికి కార్మికవర్గం నాయకత్వం వహించినప్పటికీ స్టేట్ డ్యూమాలోని బూర్జువా వర్గం నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వంలో మెన్షివిక్కులు, సోషలిస్టులు చేరారు. మరోవైపు దేశంలోని కార్మికుల సోవియట్లు, సైనికుల సోవియట్లతో కూడిన మరో అధికార సంస్థ ఏర్పడింది. అంటే విప్లవానంతరం దేశంలో రెండు అధికార కేంద్రాలు, రెండు అధికార నియంతృత్వాలు ఏర్పడ్డాయి. ఒకటి బూర్జువా అధికా కేంద్రం, బూర్జువా నియంతృత్వం. రెండోది కార్మిక, సైనిక (సైనికులంటే యూనిఫారమ్‌లో ఉన్న రైతులే) అధికార కేంద్రం, కార్మిక కర్షక నియంతృత్వం.

బలాబలాల్లో వచ్చిన ఈ మార్పును ప్రవాసంలో ఉన్న లెనిన్ గ్రహించాడు. విప్లవాన్ని ఇంకా ముందుకు తీసుకుపోకుండా విప్లవ లక్ష్యాలు నెరవేరబోవని గ్రహించాడు. తాత్కాలిక ప్రభుత్వం యుద్ధాన్ని విడనాడకపోగా క్రమశిక్షణను పునరుద్ధరించే పేరుతో ప్రజల ప్రజాస్వామిక హక్కులపై దాడి ప్రారంభించింది. ఈ పరిస్థితుల్లో బోల్షివిక్ పార్టీ ప్రజల్లో చేరి సైనికులు, కర్షకులు కార్మికవర్గంతో కలిసి పనిచేయాలన్న విషయాన్ని ప్రచారం చేయాలని నిర్దేశిస్తూ లెనిన్ అనేక లేఖలు రాశాడు. పరిస్థితి కీలక దశకు వచ్చిందని తెలుసుకుని 1917 ఏప్రిల్ 3వ తేదీన ఆయన రష్యా తిరిగి వచ్చేసి విప్లవానికి ప్రత్యక్షంగా నాయకత్వం వహించాడు. ఏప్రిల్ 4వ తేదీన జరిగిన బోల్షివిక్ పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో లెనిన్ ఒక సిద్ధాంత పత్రం ప్రవేశపెట్టాడు. దాన్ని ఏప్రిల్ థీసిస్ అంటున్నారు. అందులో ఆయన కొన్ని ముఖ్యమైన సూత్రీకరణలు చేశాడు. వాటిలో ఒకటి రష్యాలో రెండు అధికార కేంద్రాలు, రెండు నియంతృత్వాలు ఎక్కువ కాలం ఉండలేవు. "విప్లవం తొలిదశ నుండి రెండో దశకు పరివర్తన చెందాల్సి ఉంది. శ్రామిక వర్గంలో తగినంత వర్గచైతన్యం, నిర్మాణ పటిమ లేనందున విప్లవ తొలిదశ బూర్జువావర్గం చేతిలో అధికారాన్ని పెట్టింది. రెండవ దశలో అధికారం శ్రామిక వర్గం, పేద రైతాంగం చేతుల్లోకి వెళ్లాలి" అని లెనిన్ నిర్ధారించాడు. బూర్జువా విప్లవం సోషలిస్టు విప్లవంగా పరివర్తన చెందాలన్నాడు. ఈ నిర్ధారణలను మెన్షివిక్కులు, బూర్జువా వర్గంతోచేరిన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. చివరికి ప్లెఖనోవ్ కూడా దీన్ని పిచ్చివాగుడుగా జమకట్టాడు. కానీ బోల్షివిక్ పార్టీ కమిటీలన్నీ దీన్ని ఆమోదించాయి. ఏప్రిల్ 24 నుండి 29 వరకు జరిగిన అఖిల రష్యా బోల్షివిక్ మహాసభ దీన్ని ఆమోదించింది. దానికి అనుగుణంగా పార్టీ కార్యక్రమం సవరించబడింది. పార్టీ ప్రజల్లో ఈ కొత్త కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారంలో పెట్టింది. శాంతి, భూమి, భుక్తి, సోవియట్లకే సర్వాధికారాలు అన్న నినాదాలతో బోల్షివిక్కులు ప్రజలను ఉత్తేజ పరిచారు. ఒకవైపు పారిశ్రామిక ప్రాంతాల్లో సమ్మె పోరాటాలు ఉధృతం కాగా మరోవైపు వ్యవసాయ రంగంలో అశాంతి పెరిగింది. కౌలు రైతులు భూస్వాములకిచ్చే కౌలు తామే నిర్ణయించడం ప్రారంభించారు. ఈ లోగా జూన్ నెలలో పార్టీ ఏర్పాటు చేసిన అఖిల రష్యన్ బోల్షివిక్ సైనిక సంస్థల సమావేశం సైన్యంలో బోల్షివిక్ పార్టీ కృషిని పటిష్టం చేసే కార్యక్రమాన్ని తీసుకుంది. అప్పటికి రష్యన్ సైన్యంలో 26 వేల మంది పార్టీ కార్యకర్తలున్నారు.

> **"అధికారంలోని బూర్జువా వర్గం బోల్షివిక్ లను బలహీనపరచడానికి అనేక కుయుక్తులకు పాల్పడినా ఫలించలేదు. యుద్ధంలో ఎదురు దాడి చేసి గెలవడం ద్వారా ప్రజల మన్ననలు పొందాలనుకున్న బూర్జువా ప్రభుత్వ పన్నాగం కూడా పారలేదు. యుద్ధంలో రష్యా సైన్యాలు ఓడిపోయాయి. దాంతో జులైలో దేశంలో సంక్షోభం మరింత ముదిరింది. యుద్ధరంగం నుండి ప్రభుత్వం సైన్యాలను పెట్రోగ్రాడ్‌కు రప్పించి నిర్బంధానికి దిగింది. ప్రభుత్వ సైన్యం కార్మిక వాడల్లోకి ప్రవేశించి బోల్షివిక్‌లను నిరాయుధులను చేసింది."**

అధికారంలోని బూర్జువా వర్గం బోల్షివిక్‌లను బలహీనపరచడానికి అనేక కుయుక్తులకు పాల్పడినా ఫలించలేదు. యుద్ధంలో ఎదురు దాడి చేసి గెలవడం ద్వారా ప్రజల మన్ననలు పొందాలనుకున్న బూర్జువా ప్రభుత్వ పన్నాగం కూడా పారలేదు. యుద్ధంలో రష్యా సైన్యాలు ఓడిపోయాయి. దాంతో జులై నెలలో దేశంలో సంక్షోభం మరింత ముదిరింది. యుద్ధరంగం నుండి ప్రభుత్వం సైన్యాలను పెట్రోగ్రాడ్‌కు రప్పించి నిర్బంధానికి దిగింది. ప్రభుత్వ సైన్యం కార్మిక వాడల్లోకి ప్రవేశించి బోల్షివిక్‌లను నిరాయుధులను చేసింది. బోల్షివిక్ పార్టీని నిషేధించింది. ప్రచురణాలయాన్ని ధ్వంసం చేసింది. లెనిన్‌ని కనిపిస్తే కాల్చేయమని ఆదేశించింది. జులై ఘటనలు దేశ రాజకీయ పరిస్థితుల్లో ముఖ్యమైన మార్పు తెచ్చాయి. మొదటిది, ఇప్పటివరకు బూర్జువా ప్రభుత్వానికి సహాయకంగా ఉన్న మెన్షివిక్‌లూ, సోషలిస్టు రివల్యూషనరీలు ప్రభుత్వంలో భాగంగా మారి నిర్బంధంలో పాల్గొన్నారు. రెండవది దేశంలో రెండు అధికార కేంద్రాలు పోయి ఒకే కేంద్రం – బూర్జువా నియంతృత్వం ఏర్పడింది.

వెంటనే లెనిన్ పరిస్థితిలో మార్పు గమనించాడు. సర్వాధికారాలు విప్లవ ప్రతీఘాత శక్తుల చేతుల్లోకి వెళ్లాయి కనుక కార్మిక వర్గం సాయుధ తిరుగుబాటు ద్వారా మాత్రమే అధికారం హస్తగతం చేసుకోవాల్సి ఉంటుందని పిలుపునిచ్చాడు. అయితే తక్షణమే ప్రత్యక్ష చర్యలకు పూనుకోవలసిన సమయం రాలేదని చెప్పాడు. జులై 26 నుండి ఆగష్టు 3 వరకు పెట్రోగ్రాడ్‌లో పార్టీ 6వ మహాసభ జరిగింది. ఇందులో సాయుధ పోరాటం పిలుపుతోబాటు, "కార్మిక–కర్షక మైత్రి"తోనే విప్లవం విజయం సాధిస్తుందని పిలుపునివ్వడం జరిగింది. ఈ లోగా అమెరికా, బ్రిటన్, ఫ్రెంచి ప్రభుత్వాల


> **ఇలాంటి స్థితిలో లెనిన్ విప్లవానికి నేరుగా నాయకత్వం వహించడానికి అక్టోబరు 7న పెట్రోగ్రాడ్ చేరుకున్నాడు, 10న కేంద్ర కమిటీ సమావేశంలో పాల్గొన్నాడు. తిరుగుబాటును నేరుగా ఆయనే పర్యవేక్షించాడు. అక్టోబర్ 25వ తేదీన జరిగే ద్వితీయ సోవియట్ల మహాసభనుండి తిరుగుబాటు ప్రారంభించాలనుకున్నారు. కానీ కేంద్ర కమిటీలో కామికోవ్, జెనోవీవ్ గ్రూపు సమాచారాన్ని శత్రువులకు చేరవేయడంతో 24 రాత్రికే తిరుగుబాటు పూర్తి కావాలని లెనిన్ నొక్కి చెప్పాడు.**

మద్దతుతో రష్యా సర్వసైన్యాధికారి కార్నిలోవ్ అధికారం చేపట్టడానికి సైన్యాన్ని పంపాడు. కార్నిలోవ్ తిరుగుబాటును బోల్షివిక్ పార్టీ నాయకత్వంలోని కార్మిక-కర్షక జనం అణచివేశారు.

### 1917 అక్టోబర్ విప్లవం

కార్నిలోవ్ తిరుగుబాటు అణచివేయడంతో రష్యా పరిస్థితుల్లో పెద్ద మార్పు వచ్చింది. కార్మిక, సైనిక సోవియట్లను త్వరితగతిన బోల్షివిక్కులు వశం చేసుకున్నారు. సోవియట్లకే సర్వాధి కారాలు అన్న నినాదం మళ్లీ మారుమోగింది. ఈ సారి బూర్జువా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం కోసం ఈ నినాదం ఇవ్వబడింది. రైతాంగ పోరాటంలో కూడా మార్పు వచ్చింది. వారు భూస్వాములను తరిమేసి భూములను స్వాధీనం చేసుకోవడం ప్రారంభించారు. సైన్యంలో కూడా మార్పు వచ్చింది. తిరుగుబాటుకు అనుకూలమైన సైన్యం అభివృద్ధి నిరోధక అధికారులను తొలగించి ఆ స్థానాలను బోల్షివిక్కు అనుకూల అధికారులతో నింపడం ప్రారంభించారు.

ఈలోగా రష్యన్ విప్లవ ప్రతీఘాతకులు బ్రిటిష్, ఫ్రెంచ్, జర్మన్ సామ్రాజ్యవాదులతో చేతులు కలిపి విప్లవాన్ని అణచివేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. రహస్య జీవితం గడుపుతున్న లెనిన్ ఈ పరిస్థితి గమనించాడు. విప్లవం ద్వారా ప్రభుత్వాన్ని కూలదోసి బోల్షివిక్కులు అధికారం చేపట్టడమొక్కటే మార్గమని గ్రహించాడు. సోషలిస్టు విప్లవానికి రష్యా సిద్ధంగా ఉందని చెప్పాడు. ఈ సమయంలో లెనిన్ "రాజ్యాంగ యంత్రం-విప్లవం'' అనే గ్రంధాన్ని పూర్తిచేశాడు. రాజ్యాంగ యంత్రపు స్వభావాన్ని ఆయన అందులో స్పష్టం చేశాడు. సోషలిజం నిర్మించాలంటే బూర్జువా రాజ్యాంగ యంత్రం స్థానే శ్రామికవర్గ రాజ్యాంగ యంత్రాన్ని నెలకొల్పాలని చెప్పాడు. చారిత్రక మార్పు



సంభవిస్తున్న వేళ లెనిన్ రాసిన ఈ పుస్తకం సిద్ధాంతానికీ, ఆచరణకూ మధ్య గల సంబంధాన్ని తెలియజేస్తుంది. 1917 సెప్టెంబర్ 12-14 తేదీల్లో లెనిన్ రాసిన రెండు లేఖలు - "బోల్షివిక్కులు అధికారం చేపట్టాలి'', ''మార్క్సిజం - సాయుధ తిరుగుబాటు" అన్నవి సాయుధ తిరుగుబాటుకు దిశానిర్దేశం చేశాయి. ఈ లేఖల సారాంశాన్ని కేంద్ర కమిటీ ఆమోదించింది. సాయుధ విప్లవానికి సన్నాహాలు జరిగాయి. తిరుగుబాటు దళాల కేంద్ర కార్యాలయం ఏర్పాటయింది. కీలక స్థావరాలను తిరుగుబాటుదారులు ఆక్రమించుకోవడం ప్రారంభించారు. మరోవైపు విప్లవాన్ని అణచివేయడానికీ, పక్కదోవ పట్టించడానికి ప్రతీఘాకులు అన్ని రకాలుగా ప్రయత్నాలు ప్రారంభించారు.

ఇలాంటి స్థితిలో లెనిన్ విప్లవానికి నేరుగా నాయకత్వం వహించడానికి అక్టోబరు 7న పెట్రోగ్రాడ్ చేరుకున్నాడు, 10న కేంద్ర కమిటీ సమావేశంలో పాల్గొన్నాడు. విప్లవానికి పరిస్థితి పరిపక్వమైందనీ, అధికారం స్వాధీనానికి తిరుగుబాటు చేయడమొక్కటే మిగిలి ఉందని చెప్పాడు. తిరుగుబాటును నేరుగా ఆయనే పర్యవేక్షించాడు. అక్టోబర్ 25వ తేదీన జరిగే ద్వితీయ సోవియట్ల మహాసభనుండి తిరుగుబాటు ప్రారంభించాలనుకున్నారు. కానీ కేంద్ర కమిటీలో లెనిన్ పథకాన్ని వ్యతిరేకించిన కామికోవ్, జెనోవీవ్ గ్రూపు ఈ సమాచారాన్ని శత్రువులకు చేరవేయడంతో 24 రాత్రికే తిరుగుబాటు పూర్తి కావాలని లెనిన్ నొక్కి చెప్పాడు. తిరుగుబాటు ఒక్కరోజు ఆలస్యమైనా సర్వస్వం కోల్పోయే ప్రమాదముందని హెచ్చరించాడు. లెనిన్ ప్రణాళిక ప్రకారమే 24 రాత్రి తిరుగుబాటు ప్రారంభమైంది. తిరుగుబాటు కేంద్రమైన స్మోల్నీ ఇన్‌స్టిట్యూట్ భవనానికి లెనిన్ 24 సాయంకాలం చేరుకుని తిరుగుబాటును నడిపాడు. రాత్రికి రాత్రి రెడ్‌గార్డులు కీలకమైన ప్రభుత్వ స్థావరాలన్నిటినీ స్వాధీనం చేసుకున్నారు. 25 ఉదయానికి కెరెన్‌స్కీ బూర్జువా ప్రభుత్వం పతనమైంది. రాజ్యాధికారం విప్లవ సైనిక కమిటీ చేతుల్లోకి వచ్చిందని లెనిన్ ప్రకటించాడు. కార్మిక, సైనిక, రైతాంగ సోవియట్లకు అధికారం బదిలీ అయిందని లెనిన్ చేసిన ప్రకటనను ఆ రోజు సాయంత్రం జరిగిన అఖిల సోవియట్ల ద్వితీయ మహాసభ ఆమోదించింది. ఆ విధంగా 1917 అక్టోబర్ 25వ తేదీ (నేటి క్యాలెండర్ ప్రకారం నవంబర్ 7) చరిత్రలో తొలి సోషలిస్టు విప్లవం జయప్రదమైన రోజుగా చిరస్థాయిగా నిలిచిపోతుంది.

మరునాడు అక్టోబర్ 26న మహా సభ రెండు డిక్రీలు (చట్టాలు) చేసింది. మొదటిది శాంతి డిక్రీ యుద్ధానికి వ్యతిరేకంగా, రెండవది భూమి డిక్రీ - భూస్వాముల భూమిపై రైతులకు హక్కులు కల్పిస్తూ జారీ చేసింది. ఈ డిక్రీతో 36 కోట్ల ఎకరాల భూమి రైతుల పరమైంది. తదుపరి డిక్రీలో జాతులు బందిఖానాగా ఉన్న రష్యన్ సామ్రాజ్యంలో జాతులకు విడిపోయే స్వేచ్ఛతో సహా అన్ని రకాల స్వేచ్ఛ ఇవ్వబడింది. అయితే విప్లవాన్ని శైశవ ప్రాయంలోనే అణచివేయడానికి 18 సామ్రాజ్యవాద దేశాలు, రష్యాలోని విప్లవ విద్రోహులు అంతర్యుద్ధం ప్రారంభించారు. లెనిన్ మార్గదర్శకత్వంలో అందులో కూడా బోల్షివిక్కులు విజయం సాధించారు.

ఆ విధంగా మార్క్సిజాన్ని నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించడంలో లెనిన్ చూపించిన ప్రతిభ అక్టోబర్ విప్లవం అంతటా మనకు కనిపిస్తుంది. విప్లవంలోని ప్రతి మలుపునూ ఆయన నిర్దిష్టంగా విశ్లేషించి దానికి తగ్గ వ్యూహాన్నీ, ఎత్తుగడలనూ అనుసరించాడు. నిజానికి లెనిన్ లేనిదే అక్టోబర్ విప్లవం లేదు. అక్టోబర్ విప్లవం లేనిదే లెనిన్ లేడు. లెనిన్ శతవర్థంతి సందర్భంగా ఆ మార్క్సిస్టు-లెనినిస్టు మహోపాధ్యాయుని జీవితం, కృషిని గురించి అధ్యయనం చేయడం అవసరం. ❈

# గొప్ప మానవతా వాది లెనిన్

పాతూరి వెంకటేశ్వరరావు

సమగ్ర విప్లవకారుడెప్పుడూ మానవతావాది కాకుండా ఉండలేదన్న వాస్తవం లెనిన్‌ను చూస్తే అర్థం అవుతుంది. మార్క్సిస్టు సిద్ధాంతాన్నీ, ఆచరణతో అద్భుత రీతిలో మేళవించి, వెనుకబడిన రష్యాలో తొలి కార్మికవర్గ విప్లవాన్ని సాధించిన మహామేధావి లెనిన్ రాజకీయ జీవనమే కాదు నిజజీవితం కూడా ఎంతో ఆదర్శప్రాయమైనది. 1917 అక్టోబర్‌లో రష్యాలో కార్మికవర్గ రాజ్యం ఏర్పడింది. లెనిన్ దానికి అధినేత అయ్యాడు. ఈ విజయంపై మాట్లాడుతూ... "ఇది నా గొప్పకాదు, నే గుర్తించిన సత్యం యొక్క గొప్పతనం. దాన్ని విశ్వసించి, కదిలిన కార్యకర్తల, ప్రజల గొప్పతనం" అనటం లెనిన్ వినమ్రతకు నిదర్శనం.



మాస్కోలో జరిగిన అక్టోబర్ విప్లవ రెండవ వార్షికోత్సవం సందర్భంగా లెనిన్, ఇతర విప్లవ నేతలు

### అద్భుతమైన రాత్రి

1917 అక్టోబర్ 25 రాత్రి.... దశాబ్ద కాలంగా శిక్షలకు గురౌతూ, నిఘా వర్గాల కంటబడకుండా, అజ్ఞాత వాసంలో ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపిన లెనిన్ దంపతులు, తమ మిత్రుని ఇంట స్వేచ్ఛగా, ఆనందంగా సోషలిస్టు రిపబ్లిక్‌లో గడిపిన తొలిరాత్రి అది. తన గదిలో సుదీర్ఘంగా ఆలోచించి, పారిస్ కమ్యూన్ స్ఫూర్తితో తొలి డిక్రీ రాశాడు. అందులో రష్యాను ప్రజాతంత్ర దేశంగా ప్రకటించటంతో పాటు జమీందారీ విధానాన్ని రద్దు చేయటం, ఉత్పత్తి సాధనాలపై సోవియట్‌లకు అధికారం దత్తత చేయటం ముఖ్యాంశాలుగా ఉన్నాయి. అటువంటి "తొలి సోషలిస్టు రిపబ్లిక్ డిక్రీ"ని రూపొందించి లెనిన్ సరికొత్త చరిత్రను సృష్టించిన రాత్రి అది! లెనిన్ ఆ డిక్రీని మళ్ళీ మళ్ళీ చదువుకున్నాడు. తనలో భావోద్వేగంతో పెల్లుబుకుతున్న ఆనందాన్ని భార్య కృపస్కయాతో పంచుకోవాలని ఆమెగది కెళ్ళాడు! అక్కడ ఆమె ఆనంద పరవశంతో కిటికీ గుండా సోషలిస్టు రష్యాను తేరిపార జూస్తూ కుర్చుంది! లెనిన్ ఇచ్చిన కాగితంలోని డిక్రీని చదువుతూనే ఒక్క ఉదుటున లేచి అబ్బా ఇన్నాళ్ళ మన కల ఫలించినందుకు ఈ ఆనందాన్ని భరించటం నావల్ల కావటం లేదు లెనిన్... అంటూ ఆయన్ను గాఢంగా కౌగిలించి ఊపేసింది కృపస్కయా! ఆనందంతో కునుకు పట్టని వాళ్ళ మిత్రుడు గూడా పచార్లు చేస్తూ లెనిన్ దంపతుల్ని చూడగానే ఆనంద పరవశంతో ఎగిరిగంతే శాడు. "సమస్త మానవాళికి సుఖజీవన మార్గాన్ని చూపగల్గినందుకు, ఉవ్వెత్తున ఎగసి పడే ఆనంద కెరటాలకు లెనిన్ దంపతులు ఉక్కిరిబిక్కిరి అయిన ఆ రాత్రి నిజంగా మహాద్భుతమైన రాత్రే!

### మానవతకు మరో రూపం

ప్రఖ్యాత రష్యన్ రచయిత మగ్జిమ్ గోర్కీ తన స్మృతుల్లో ఇలా రాసుకున్నాడు... "లెనిన్ మనసు, మాట, చేతలకు ఎన్నడూ తేడా కనిపించలేదు. ఉదాహరణకు కమ్యూనిస్టులీగ్ మూడవ సభలో కమ్యూనిస్టు నైతికతను నిర్వచించిన లెనిన్, జీవితాంతం అలాగే జీవించాడు. సమసమాజపు వెలుతురు కోసం తనను కొవ్వొత్తిలా కరిగించుకున్నాడు. ఆయన ఆరోగ్యం కోసం మెరుగైన ఆహారం, వసతులు అవసరమంటూ డాక్టర్లు, ఆత్మీయులు మొరపెడుతున్నా ప్రజలు హీనంగా జీవిస్తున్నప్పుడు, వాళ్ళకన్నా బెటర్‌గా జీవించే నైతిక హక్కు నాకు లేదని తిరస్కరించిన ఆదర్శనేత లెనిన్. మానవత పట్ల ఆయనకు మించిన అవగాహన కలవారులేరు. అదే లెనిన్ విప్లవ సాహసానికి, విజయానికి ఆయువుపట్టు"

### నిరాడంబరుడు

లెనిన్ కార్యాలయ సిబ్బందిలో ఒకరైన కిరోవో తన స్మృతుల్లో ఇలా పేర్కొన్నాడు. "పార్టీ నేతగా వలస జీవితపు రోజుల్లో ఇరుకు గదుల్లో చిన్న మంచం, పుస్తకాలతో టేబులు, రెండు కుర్చీలు, స్టూలుతో గడిపారు లెనిన్ దంపతులు! కానీ ప్రపంచ భూభాగంలో ఆరవవంతున్న సువిశాల రష్యా అధినేత అయ్యాక గూడ లెనిన్ నిరాడంబరత, వినమ్రత, నైతికత, మానవీయ తలతో నిండిన ఆయన జీవన విధానం, ప్రపంచ నేతలందరికీ నిన్న, నేడు, రేపు, సదా ఆదర్శనీయమే! ఉదాహరణకు లెనిన్ అధ్యక్ష కార్యాలయంలో గూడా సాదా, సీదా టేబులు, ప్యాడ్, పెన్‌స్టాండ్, పుస్తకాల బీరువాలు

**"ప్రాచీన కాలంలో మహిళల స్థితి గతులు మెరుగుగా ఉండేవని, మహిళల స్థాయి ఆనాటి పురుషుల స్థాయికి మించి ఉండేదని చెప్పేందుకు చేసే ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. అవన్నీ మహిళా ఉద్యమాలను అవమాన పరిచేవే. ఈ క్రమం, శతాబ్దాలుగా తమ గొంతుకలు వినిపించేందుకు మహిళలు చేస్తున్న అనేక పోరాటాలను విస్మరిస్తున్నది. ఈనాడు సాధించిన పురోగతి అనాదిగా ఉందనడం అంటే మహిళలు తమ అభివృద్ధి కోసం చేస్తున్న పోరాటాలను ఉపేక్షించడమే."**

మాత్రమే ఉండేవి. ఆయన నివసించే క్రెమ్లిన్ భవనంలోనూ పరిమిత ఫర్నిచర్ ఉండేది. భోజన శాలలో టేబులు, 4 కుర్చీలు స్టడీ రూం లో పుస్తకాలబీరువా, టేబులు, దానిపై సూటిగా పడే లైటు, ప్యాడ్, పెన్‌స్టాండు అంతే."

సెక్యూరిటీగార్డు 'కొలో బ్యాకోవ్' తన స్మృతుల్లో ఇలా రాశాడు. "భోగాలు, ఆడంబరాల పట్ల బొత్తిగా ఆసక్తి లేని మహనీయుడు లెనిన్! గతంలో సరే, దేశాధినేత అయ్యాక గూడా సాదాసీద దుస్తులు, అవసరాలమేరకే గృహోపకరణాలు ఉండేవి ఆయన ఇంట్లో! ఉదాహరణకు ఒక పేపర్లో బ్రెడ్డు, గిన్నెలో పులుసు తెచ్చి లెనిన్ టేబులు మీద పెట్టేది కృపస్కయా! సిబ్బందిని పనివాళ్ళంటే ఊరుకోరాయన. నాతోసహా, గృహనిర్వాహక, కార్యాలయ సిబ్బందిని చిరు ఉద్యోగులను కూడ మీరు అంటూ సగౌరవంగా సంబోధించేవారు. వయసులో పెద్దవాళ్ళను మాత్రం, అవ్వ, తాత, పెద్దాయన అని పిలుస్తుండేవారు లెనిన్!

"లెనిన్ గృహనిర్వాహకురాలు ఒకసారి ఆయన చిరిగిన సూటును క్యారిడార్లో కుడుతోంది. పక్కనే ఉన్న నాతో 'చూడు బాబు ఇదేమైనా బాగుందా? రైతులకవీ– కార్మికులకివీ – అందరికీ అన్నీ కావాలంటాడు. దేశాన్ని బ్రహ్మాండంగా చేయాలంటాడు. కానీ తనకొక సూటు కావాలన్న సంగతే పట్టించుకోడు! ఇదిగో చూడు ఈయనగారి దుస్తులు. రోజూ వీటిని కుట్టడం, అతుకులేయటంతోనే సరిపోతుంది నాకు' అంది. అప్పుడే వెనగ్గా వస్తున్న లెనిన్ ఆమె మాటలకు నవ్వుతూ 'చూడండి అవ్వా మనింట్లో వాళ్ళంతా పాతవి, చిరుగులదుస్తుల్తో సర్దుకుపోతుంటే మనం మాత్రం కొత్త దుస్తులేసుకు తిరగటం భావ్యమా చెప్పండి? త్వరలో మన దేశం సంపన్న మౌతుంది! అప్పుడు కొత్త సూటు కొనుక్కొని నీకీకష్టాన్ని తప్పిస్తాను, దయచేసి ఇప్పటికిలా పోనివ్వండవ్వా!' అంటూ ఆప్యాయంగా ఆమెరెండు భుజాలనూ తట్టాడు లెనిన్!"

### విశాల హృదయుడు

నర్స్ 'నేచ్కినా' స్మృతుల నుండి.... "లెనిన్ పై హత్యా ప్రయత్నం జరిగినప్పుడు ఆ బుల్లెట్‌ను తొలగించాక నేను పనిచేసే (సామాన్యులుండే) జనరల్ వార్డుకే ఆదేశాధి నేతను తెచ్చినందుకు బాధగా వున్నా, ఆ మహనీయునికి సేవలందించే సదవకాశానికి పొంగిపోయాను. మావార్డులో అందరికి లాగే ఆయనకూ మంచం, టేబులు, కుర్చీ ఉంది. అదనంగా ఆయన కోసం అమర్చిందల్లా టేబుల్ ల్యాంపు మాత్రమే. ఒకే దిండుతో ఆయన ఇబ్బందిని చూడలేక మరో బెడ్‌మీది దిండు తెచ్చి ఆయనకమర్చాను. కళ్ళ తెరిచిన ఆయన నో, నాకోసం మరో పేషెంటు నిబ్బంది పెట్టొద్దు, దయచేసి దీన్నాయన కిచ్చేయండి అంటూ దాన్ని పక్కకు నెట్టాడు. ప్రొఫెసర్ చూసి సార్ అది అదనపు దిండు మాత్రమే నని చెప్పాక స్వీకరించాడు. లెనిన్ మంచి తనాన్ని విన్నాను కానీ, మా దేశం కన్నా సువిశాలమైన ఆయన హృదయాన్ని కళ్ళారా చూశాను. ఆయనా మా లెనిన్!" అని రాసుకున్నారామె.

### ఆర్ద్రహృదయుడు

కమాండర్ పి.టి. బతూరిన్ స్మృతులు.... "1918 అంతర్యుద్ధం నుండి సోవియట్ రిపబ్లిక్‌ను కాపాడుకుంటున్న రోజులవి. మాస్కో రక్షణ కోసం నియమించబడ్డ మా ఎర్రసైనిక దళ శిక్షణా శిబిరానికి వచ్చి వెళ్తున్న లెనిన్ ఆర్ద్రహృదయాన్ని సంపూర్ణంగా దర్శించగలి గాను. ఉదాహరణకు ఒకరోజు శిబిరానికొచ్చి ఆయన మా కష్ట సుఖాలను ఆరాతీస్తున్నాడు. హటాత్తుగా ఓ విద్యార్థిలేచి, "సార్ 1914 నుండి నేనింటి ముఖం చూడ లేదు, మా అమ్మానాన్న బతికున్నారో లేదో తెలియదు. కానీ నాకనుమతి లభించలేదు" అన్నాడు. అతని పేరు, ఊరి పేరు అడిగి వెళ్ళిపోయాడు లెనిన్. రెండు వారాల తర్వాత వస్తూనే 'కామ్రేడ్ సీతిన్' వచ్చాడా అంటున్న లెనిన్ వద్దకు పరుగెత్తుకుంటూ వచ్చి వినమ్రంగా తల్లిదండ్రు ల తరపున కృతజ్ఞతలు తెల్పుతున్న సీతిన్‌తో ఆనందంగా కరచాలనం చేసి మొత్తానికి అంతాక్షేమంగానే ఉన్నారు అంటూ ఆనం దించాడు లెనిన్.

"డ్యూటీ లేనిరోజు గార్డు రూంలో అంతర్యుద్ధ అనుభవాలను పంచుకుంటూ ఆనందంగా చుట్ట పీలుస్తున్నాం! ప్లీజ్ ఒక్క దమ్ము లాగనివ్వ మంటూ ఒకరు ఇంకొకరి చుట్టకోసం ఎగబడటం చూశాడు లెనిన్! చుట్ట కోసం తపిస్తున్నారే, ఈదురలవాటును ఒప్పుకోను, కానీ ప్రస్తుతం చుట్ట మీకు తప్పని సరనుకుంటా అంటూ వెళ్ళాడు. కొద్ది నిమిషాల తర్వాత పట్టెడు పొగాకు తెచ్చిస్తూ ఉక్రెయిన్ కార్మికులనడిగి తెచ్చానన్నాడు. నెల రోజులుగా పొగాకు కోటా లభించని మేము ఆ పట్టెడు పొగాకుతో ఆనంద పరవశుల మయ్యాం!

"ఒక అర్థరాత్రి మరతుపాకీ విద్యార్థుల శిక్షణా శిబిరానికొచ్చాడు లెనిన్. డ్యూటీలో ఉన్న ఇద్దరం తప్ప, అందరూ గాఢంగా నిద్రిస్తున్నారు. మంచాల మధ్య నడుస్తున్న లెనిన్, నిద్రలో ఒక విద్యార్థి కింద పడేసుకున్న రగ్గును చూసి వంగి తీసి, శబ్దం కాకుండా ఆ ప్యాయంగా అతనికి కప్పి వెళ్ళాడు. ఆయన మా దేశాధినేత!"

### ప్రజాస్వామ్యానికి నిర్వచనం

కృపస్కయా స్మృతుల నుండి.... "పరిపాలనా సంస్థలన్నీ ప్రజల అవసరాల పట్ల నిరంతరం శ్రద్ధ వహించాలి" అన్నది లెనిన్ డిమాండ్. దేశం నలుమూలల నుండి వచ్చిన దరఖాస్తులు పరిశీలించి వారి వారి అవసరాలు తీర్చేందుకు సంబంధిత అధికారులకు తంతి, లేఖ, ఫోన్ల ద్వారా ఆదేశాలు పంపి, అది అమలయ్యే దాకా వెంటాడే వాడు. ఏ ఒక్కరి అవసరాలనూ మర్చిపోయే వాడు కాదు, దేన్నీ ముగించకుండా వదిలేవాడు కాదు! కార్మికులు, కర్షకులు, సిబ్బంది, ప్రజల పట్ల లెనిన్‌కు గల ప్రేమాభిమానాలు, శ్రద్ధ, ఆర్ద్రతలు తెచ్చి పెట్టుకున్నవి కావు. అవి ఆయన వ్యక్తిత్వంలో భాగాలే!"

**"తనెంత గొప్పవాడో తానే తెల్సుకో లేనంతటి ప్రపంచ ప్రముఖ వ్యక్తి లెనిన్! ఇరవయ్యో శతాబ్దపు నేత వి.ఐ.లెనిన్"** అన్నాడు బ్రెట్రండ్ రస్సెల్.

❋

# లెనిన్ గురించి భారతీయుల ప్రత్యక్ష అనుభవాలు

ఎల్.వి. మిత్రోఖిన్

**(లెనిన్‌తో తొలితరం భారతీయ స్వాతంత్ర్య పోరాట యోధులకు ఉన్న ప్రత్యక్ష అనుభవాలు, లెనిన్ గురించి భారత దేశంలో సాగిన రచనలను సంకలనం చేస్తూ ఎల్.వి. మిత్రోఖిన్ రాసిన పుస్తకం "లెనిన్ ఇన్ ఇండియా" అనే పేరుతో ప్రచురించబడింది. దాన్ని తెలుగులోకి అనువదించి "భారత దేశంలో లెనిన్" అనే శీర్షికతో ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురిస్తోంది. ఆ పుస్తకంలోని ఒక చిన్న భాగాన్ని లెనిన్ శతవర్ధంతి సందర్భంగా మార్క్సిస్టు పాఠకులకు అందజేస్తున్నాం.... సంపాదకుడు)**

అక్టోబరు విప్లవం జరిగిన కొద్దికాలానికే సోవియట్ రష్యాలో పర్యటించిన భారతీయులు అక్కడ సంభవిస్తున్న వాస్తవ ఘటనల గురించి భారత ప్రజానీకానికి తెలియచేయడంలో మహత్తర పాత్రను నిర్వహించారు. వారిలో ఒకరైన గురుభక్ష సింగ్ అనుభవాన్ని తెలుసుకుందాము, ఈయన 1919లో తాష్కెంట్‌లో వున్నాడు, అదే ఏడాది కేంద్ర గూఢచారి విభాగం ఆయనను ప్రశ్నించినపుడు ఇచ్చిన సమాచారాన్ని తెలుసుకుందాం. ఇదీ ఆయన చెప్పింది: "కారల్ మార్క్స అంటే వారికి చాలా గౌరవం వున్నది, ప్రత్యేకించి లెనిన్‌పట్ల బ్రహ్మాండమైన గౌరవం వున్నది... వీరి చిత్రాలు, విగ్రహాలు ప్రతి ఇంట్లోను, కార్యా లయంలోనూ వున్నాయి". లెనిన్ నిగర్వియని, ప్రతి సోవియట్ పౌరునికి అందుబాటులో వుంటాడని, సాధారణమైన దుస్తులనే ధరిస్తాడని, విలాస జీవితాన్ని చీదరించుకుంటాడని కూడా తాష్కెంటులోనే గురుభక్ష సింగ్ తెలుసుకున్నాడు.

అదృష్టవశాత్తు పలువురు భారతీయులు లెనిన్‌ను వ్యక్తిగతంగా కలుసుకోగలిగారు. ఆయన వూపిరాడని పనుల్లో వున్నప్పటికీ, అంతర్యుద్ధ పరిస్థితీ, ఆర్థిక స్థితిగతులూ అత్యంత దారుణంగా వున్నప్పటికీ భారతీయ సందర్శకులను కలుసుకోవటానికి ఆయన తీరిక చేసుకునేవాడు. భారతీయ శ్రామికుల స్థితిగతుల గురించీ, బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా వారి పోరాటం గురించీ ఆయన అడిగేవాడు. ఆయన కలుసుకున్న భారతీయుల పేర్లు ఆయన సంకలిత రచనల్లో వున్నాయి.

నూతన సోవియట్ రాజ్యం రాజధానిని సందర్శించిన తొలి భారతీయులలో మహమ్మద్ హాదీ, అహమ్మద్ హారిస్‌లు వున్నారు. 1918 నవంబరులో వారు మాస్కోలో అడుగుపెట్టారు, నవంబరు 23న క్రెమ్లిన్‌లో వారిని లెనిన్ కలుసుకున్నాడు.

బ్రిటిష్ గూఢచారి వర్గాలను తప్పుదోవ పట్టించేటందుకై భారతీయులు మారుపేర్లను వుపయోగించారు. అయితే మాస్కోకు చేరిన భారతీయ ప్రతినిధుల నిజమైన గుర్తింపును వారు పసికట్టారు. కష్గర్‌లోని బ్రిటిష్ రాయబారి 1918 డిసెంబరు 31వ తేదీన ఢిల్లీకి ఒక నివేదికను పంపుతూ, 1918 నవంబరు 30వ తేదీన తాష్కెంట్ నుంచి వెలువడే వార్తా పత్రిక నషా గజెటాలో వచ్చిన వార్త ప్రకారం మాస్కోలో జరిగిన అఖిల రష్యా కేంద్ర కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో అధికార ప్రతినిధి చెప్పినదాని ప్రకారం ఏడు కోట్లమంది భారతీయులకు ప్రాతినిధ్యం వహించేవారు పాల్గొన్నారు. వీరు భారతీయుల (ముస్లింలు) నుంచి రష్యన్ కార్మికులకు అభినందనలను తీసుకువచ్చారు.

భారత జాతీయ పురావస్తు భాండాగారంలో విదేశీ రాజకీయ విభాగాలకు చెందిన పత్రాలను వెదుకుతున్నప్పుడు, "సత్తార్, జబ్బార్ అనే ఇరువురు భారతీయులతో బోల్షెవిక్ నాయకుడు లెనిన్ జరిపిన సమావేశం గురించి" అన్న శీర్షిక వున్న కొన్ని కాగితా లను చూశాను. వీరు 1918, 1919కి ముందే కలుసుకున్నారు. బహుశ వీరు పైన పేర్కొన్న "మహమ్మద్ హాదీ, అహమ్మద్ హారిస్"లు కాదు గదా? ఆ తరువాత కాలంలో నేను నార్త్–వెస్టరన్ ఫ్రాంటియర్ ప్రావిన్స్‌కు చెందిన గూఢచారి విభాగం నిర్బంధాన్ని చవిచూసిన పెషావర్ జిల్లాకు చెందిన ఒకానొక ఖాజీ అబ్దుల్ హమీద్ అనే అతను చెప్పినదాని ప్రకారం "ఢిల్లీ నుంచి వచ్చిన డాక్టర్ అబ్దుల్ జబ్బార్, అబ్దుల్ సత్తార్‌లు బెర్లిన్‌లో వున్నారు. వారు ఢిల్లీని విడచిన తరువాత యుద్ధ కాలంలో కాన్‌స్టాంటినోపిల్ నుంచి ఉర్దూ భాషలో ఒక వార్తా పత్రికను ప్రచురించారు".

నేను వెంటనే భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ యోధుడైన రాజా మహేంద్ర ప్రతాప్‌కు ఒక లేఖరాస్తూ, అబ్దుల్ సత్తార్, అబ్దుల్ జబ్బార్‌ల గురించి మీకేమైనా తెలుసునా అని అడిగాను. వారిలో ఒకరు మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు ఆలీఘర్ విశ్వ విద్యాలయంలో ఆయనకు సహ విద్యార్థి అని తెలియవచ్చింది. తరువాత కాలంలో ఆయన వారిని కలుసుకోలేదు. అయితే బెర్లిన్‌లో వున్నపుడు, "సోదరులైన సత్తార్, జబ్బార్‌లు మాస్కో చేరినట్లు తెలిసింది" అని అన్నారు. కరాచీలో వున్న శ్రీ వారిస్‌కు అన్ని విషయాలు తెలుసుననీ, ఆయనైతే వారి చిరునామాను కూడా ఇవ్వగలడని రాజా మహేంద్ర ప్రతాప్ నాకు సలహా ఇచ్చాడు. ఏదియేమైనప్పటికీ, లెనిన్‌ను కలుసుకున్న ఈ ఇరువురు భారతీయుల గురించి పాకిస్థాన్‌లో నేను చేసిన కృషి అంతా నిరుపయోగమైంది.

ఇది జరిగిన కొన్నినాళ్ళకే భారతీయ ప్రచురణకర్తయైన ఎస్.ఎం. మెహ్దీ, 1917లో కాన్‌స్టాంటి నోపిల్‌లో వున్న భారతీయుల బృందం ఉర్దూ భాషలో వెలువడే వార్తా పత్రిక అఖువత్‌లో వచ్చిన సమాచారాన్ని ఆధారం చేసుకుని "మాస్కో–తాష్కెంట్ కుట్ర కేసు" వెనుకవున్న గాథ అన్న పేరుతో వున్న లఘు పుస్తకాన్ని చదివాను.

1919 ఏప్రియల్ 24, జూన్ 17 నాటి సంచికలలో ఈ వార్తా పత్రిక భారతీయులకు పిలుపును ఇస్తూ, 'భారతదేశంలో వున్న... అణచివేసే తరహా ప్రభుత్వం', 'ఎవరైతే రాజరికాన్ని కూల్చివేశారో', ఆ రష్యన్ల వుదాహరణను అనుసరించండి', అని భారతీ యులకు పిలుపు ఇస్తూ 'రష్యన్ విప్లవ వుదాహరణను' అనుసరించండి అని చెప్పింది. సత్తార్, జబ్బార్ సోదరులే ఈ వార్తా పత్రికను నడిపేవారని ఈ లఘు పుస్తకం రచయిత ద్వారా తెలుసుకున్నాను. ఆ

> **❝ సోషలిస్టు విప్లవం యొక్క యాభయ్యవ వార్షికోత్సవానికి రాజా మహేంద్ర ప్రతాప్ అభినందనలు తెలుపుతూ, తాను సోషలిస్టు రష్యాకు సహకరించానని, 1919లో క్రెమ్లిన్‌లో లెనిన్‌ను కలుసుకునే అదృష్టం తనకు లభించిందని ఆయన చెప్పారు. ఈయన సోవియట్ రాయబారి సొరిజ్‌ను, ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన అమీర్ అమానుల్లాకు పరిచయం చేశానని, రష్యా- ఆఫ్ఘనిస్థాన్‌ల మధ్య స్నేహ ఒప్పందంపై సంత కాలు చేసే కార్యక్రమంలో తాను కూడా పాలల్గొన్నట్లు కూడా ఆయన చెప్పారు. ❞**

విధంగా చిట్టచివరకు 1918 నవంబరులో లెనిన్‌ను కలుసుకున్న మొట్టమొదటి భారతీయులను నేను నిజంగా గుర్తించగలిగాను.

ఆ తరువాత కొంతకాలానికే, సుదీర్ఘ కాలానికి చెందిన ఈ అంశం పురావస్తు భాండాగారంలో బయటకు వచ్చింది. ఒకానొక పత్రం ప్రకారం, 1919 జూలై 9వ తేదీన ఓమ్స్‌లోని బ్రిటిష్ రాయబార కార్యాలయం లండన్‌లోని లార్డ్ కర్జన్‌కు ఒక లేఖను రాసినట్లు చెప్పటం జరుగుతున్నది. దీనిలో "సత్తార్, జబ్బార్ అనే పేర్లున్న ఇరువురు భారతీయ ఆందోళనాకారులు మాస్కోకు వెళ్ళటం, అక్కడ వారికి ఆహ్వానం లభించటం", గురించి "టర్కిస్థాన్‌లోని విదేశీ వ్యవహారాల ప్రజా కమిస్సార్‌ను వుద్దేశించి ప్రజా కమిస్సార్ మండలి పంపిన సమాచారపు అనువాదాన్ని" పంపుతున్నట్లు వున్నది. ఈ ఇరువురు భారతీయులను సరిగ్గా గుర్తించటం కోసం ఈ సమాచార ప్రతినీ, దాని అనువాదాన్నీ వెనువెంటనే ఢిల్లీలోని వలస అధికారులకు పంపించారు.

ఈ పత్రం ప్రకారం, "1918 నవంబరు మధ్యలో ఢిల్లీలో నివసిస్తున్న సత్తార్, జబ్బార్ అనే ఇరువురు భారతీయ ముసల్మాన్ ప్రతినిధులు మంచి వృత్తులలో వున్నవారు ఇక్కడకు వచ్చారు, వారిని మన నాయకుడైన లెనిన్ వద్దకు తీసుకువెళ్ళాము, వారు భారతదేశానికీ, ప్రాచ్యానికీ సంబంధించిన అనేక అంశాలను వివరించారు. నవంబరు 25వ తేదీన జరిగిన సోవియట్ల కేంద్ర కార్యనిర్వాహక కమిటీ ముందు హాజరై ఆంగ్లేయుల బానిసత్వం నుంచి భారతదేశ విమోచనకు తోడ్పడే దృష్టితోనూ, అలానే సోవియట్ల గురించీ, దాని సూత్రాల గురించీ వున్న సమాచారాన్ని భారతదేశమంతటా పంపిణీ చేసే దృష్టితోనూ సహాయపడాలని కోరారు".

ప్రపంచంలోనే మొట్టమొదటి కార్మిక-కర్షక రాజ్యంలో చోటుచేసుకుంటున్న బ్రహ్మాండమైన మార్పుల గురించి ప్రాచ్య ప్రజలు తెలుసుకునే సాధనంగా వుండటం వలన ఎవరైతే సోవియట్ రష్యాను సందర్శించి, లెనిన్ ను కలుసుకున్నారో వారి గురించిన సాక్ష్యాధారాలు అంతకంతకూ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. సోవియట్ రష్యా గురించిన ఆసక్తి నిరంతరం పెరుగుతున్నది, సోషలిస్టు విప్లవాన్ని జయప్రదం చేసిన రాజ్యపు వునికీ, ప్రపంచ సామ్రాజ్యవాద శక్తులను, అంతర్గత విప్లవ ప్రతీఘాతకులను ఎదిరించి, ఆ తీవ్ర పోరాటంలో తన స్వేచ్ఛనూ, స్వాతంత్ర్యాన్నీ నిలుపుకున్న దేశం వలస రాజ్యంగా వున్న ప్రాచ్యంలోని అణగారిన ప్రజలపై ప్రగాఢమైన ముద్ర వేసింది. లెనిన్ ఈ విధంగా పేర్కొన్నాడు: "రష్యన్ సోషలిస్టు రిపబ్లిక్ మాత్రమే నిజమైన విమోచనకు యుద్ధ పతాకను ఎగుర వేసింది. అది ప్రపంచమంతటా సానుభూతిని సంపాయిస్తున్నది... ప్రపంచం లోని ప్రతి దేశంలోనూ, చివరకు 30 కోట్లమంది అణగారిపోతూ, బ్రిటిష్ వారికింద గొడ్డుచాకిరీ చేస్తున్న భారత దేశంలో సైతం రాజకీయ చైతన్య వికాసమూ, విప్లవోద్యమమూ రోజురోజుకూ పెరుగుతున్నాయి. వారందరూ ఒకే నక్షత్రంపై, అంటే సోవియట్ రిపబ్లిక్ నక్షత్రంపై తమ చూపును నిలిపారు. ఎందు కంటే సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో అది మహత్తర త్యాగాలు చేసిందని, కఠోరమైన అగ్ని పరీక్షలను అది తట్టుకుందన్న సంగతి వారికి తెలుసు".

జాతీయ విమోచన వుద్యమ సభ్యులు దీనిని చక్కగా అర్థం చేసుకున్నారు. వారిలో ఒకరైన సత్యనారాయణ శాస్త్రి ఇలా పేర్కొన్నాడు : "జాతీయవాదులైన ఆసియన్లం దరి దృష్టులన్నీ రష్యావైపుకు చూస్తున్నాయి. స్వాతంత్ర్యం కోసం సాగే పోరాటంలో రష్యా సహాయం వుంటుందని వారు నమ్మారు."

### లెనిన్‌తో తాను చేసిన ఇంటర్వ్యూపై రాజా మహేంద్ర ప్రతాప్ జ్ఞాపకాలు

ఒక రోజున నేను 1967కు ముందుదైన భారతీయ వార్తా పత్రిక వరల్డ్ ఫెడరేషన్‌ను చూడటం జరిగింది. దానిలో వున్న 'యాభై అరుణ వత్సరాలు' అన్న శీర్షికపై నా చూపు పడింది.

సోషలిస్టు విప్లవం యొక్క యాభయ్యవ వార్షికోత్సవానికి దీని రచయిత అభినందనలు తెలుపుతూ, తాను సోషలిస్టు రష్యాకు సహకరించానని, 1919లో క్రెమ్లిన్‌లో లెనిన్‌ను కలుసుకునే అదృష్టం తనకు లభించిందని ఆయన చెప్పారు. ఈయన సోవియట్ రాయబారి సొరిజ్‌ను, ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన అమీర్ అమానుల్లాకు పరిచయం చేశానని, రష్యా-ఆఫ్ఘనిస్థాన్‌ల మధ్య స్నేహ ఒప్పందంపై సంతకాలు చేసే కార్యక్రమంలో తాను కూడా పాలల్గొన్నట్లు కూడా ఆయన చెప్పారు. గత యాభై సంవత్సరాలుగా సోవియట్ రష్యా నిరంతరం శాంతి కోసం ప్రయత్నిస్తుంటే, అదే సమయంలో అమెరికాకు చెందిన బూటకపు క్రైస్తవ పాలకులు అతి చిన్నదైన వియత్నాంకు వ్యతిరేకంగా కిరాతక యుద్ధం చేస్తున్నారు. కాగా అమెరికాలోని చిత్తశుద్ధిగల మానవతావాదులు తమ స్వీయ ప్రభుత్వాన్ని ఖండిస్తున్నారు. ఈ వ్యాసాన్ని రాజా మహేంద్ర ప్రతాప్ రాశాడు.

ఆయన సుదీర్ఘ జీవితం (ఆయన 1973 లో తన 93వ ఏట మరణించాడు) అసాధారణమైన కార్యకలాపాలతో కూడుకున్నది, బహు ప్రమాదకరమైనది, పలు దేశాలకు చెందిన వివిధ నాయకులతో అనేక సమావేశాలు జరిపారు. నేను రాజా మహేంద్ర ప్రతాప్‌ను అనేకసార్లు కలుసుకున్నాను, అయితే, హిమాలయ పాదాల చెంతవున్న డెహ్రాడూన్ పట్టణంలోని ఆయన స్వగృహంలో జరిపిన మా మొదటి సమావేశం ప్రత్యేకించి గుర్తు వున్నది. సరిగ్గా ఆయన ఇంటి వెనుకగల లోయలోకి నీటిధార ప్రవహిస్తూ వుంటుంది. కుడివైపున కొండ ప్రాంతమైన ముసోరీకి వెళ్ళే వంకరటింకర దారి వుంది. ఎడమవైపుకు చూస్తే హిమాలయ శిఖరాలు, మసకమసకగా కనిపించే వాటి ఆకృతి, పొగమంచులో దోబూచులాడే ఎండపొడ కనిపిస్తుంటుంది. అవ్యాజమైన ప్రేమ, ఆతిథ్యము, మంచి జ్ఞాపకశక్తి, విస్మయం గొలిపే వుల్లాసము, లెనిన్ గురించీ, తరుణ సోవియట్ గురించీ ఆయన మాతో తన జ్ఞాపకాలను పంచుకున్నాడు.

1906లో ఆయన భారత జాతీయ కాంగ్రెసులో చేరాడు. 1914 డిసెంబరులో ఆయన భారత్‌ను వదిలాడు, 1946 ఆగస్టు 9వ తేదీన ఇంటికి చేరటానికి ముందు తాను అనేక సంవత్సరాలపాటు ఐరోపా, ఆసియా, అమెరికాలలో

తిరుగుతానని ఆయన ఎప్పుడూ అనుకోలేదు.

ఇరవైలలో మహేంద్ర ప్రతాప్ దేశభక్తి యుత భారతీయ వలసదారుల బృందంలో చేరాడు. బ్రిటిష్ సింహాసనానికి వ్యతిరేకంగా వున్నవారి సహాయంతో బ్రిటిష్ పాలన నుంచి భారతదేశానికి విముక్తి కల్పించేటందుకై సామ్రాజ్యవాదుల్లో వున్న వైరుధ్యాలను వుప యోగించుకోవాలన్నదే వీరి వుద్దేశం. తన పథకంలో భాగంగా, బ్రిటిష్ వ్యతిరేక ప్రపంచ సంఘటనను" ఏర్పాటు చేయాలన్నదే వారి వుద్దేశం, ఇందులో భాగంగానే చివరకు జారు రష్యాను కూడా కలుపు కోవాలని రాజా మహేంద్ర ప్రతాప్ భావించాడు.

అయితే, అటు జారు అధికారులుగానీ, ఇటు కెరెన్‌స్కీ తాత్కాలిక ప్రభుత్వంగానీ భారతీయ వలసవాదుల బృందం కోరిన సహా యాన్ని ఇవ్వటానికి నిరాకరించింది.

రష్యాలో సోషలిస్టు విప్లవం విజయం పొందిన తరువాత సోవియట్ ప్రభుత్వం, బ్రిటిష్ పాలన నుండి భారతదేశపు స్వాతంత్ర్య ం కోసం పోరాడుతున్న సాహసులను కీర్తిస్తూ, ప్రాచ్యంలోని అణగారిన ప్రజల పోరాటాలను బహిరంగంగా సమర్ధించింది.

"విప్లవం గురించిన వుకార్లను", రాజా మహేంద్ర ప్రతాప్ గుర్తు చేసుకుంటూ, "ప్రాచ్యమంతటా మెరుపువలే వ్యాపించింది. ప్రతిచోటా సోషలిజం గురించీ, బోల్షెవిక్‌ల గురించీ, లెనిన్ గురించీ మాట్లాడసాగారు. విప్లవం యొక్క సూత్రబద్ధమైన నినాదాలు నన్నెంతో ప్రభావితం చేశాయి, నేను వెంటనే ఆఫ్ఘనిస్థాన్‌లోని అమీర్‌కు ఒక లేఖ రాస్తూ, రష్యా వెళ్ళాలన్న వుద్దేశం నాకున్నట్లు తెలి పాను. ఆరోజు రానేవచ్చింది, పెట్రోగాడ్‌కు రావలసిందిగా విప్లవ కేంద్రం నన్ను అధికారి కంగా ఆహ్వానించింది. ఆనాటికి సోవియట్లు అధికారంలో వున్నారు".

టెర్మెజ్ నుంచి రాజా మహేంద్ర ప్రతాప్ తాష్కెంట్‌కు చేరుకున్నాడు. ఆ తరువాత అక్కడ నుండి 1918 మార్చిలో పెట్రోగ్రాడ్‌కు చేరుకున్నాడు.

"నా ప్రయాణమంతా పూర్తిగా సాహసాల తో కూడుకున్నదే", అంటూ ఇంకా ఇలా చెప్పాడు. "దేశమంతటా యుద్ధం సాగుతున్నది, మేము పలుమార్లు మా మార్గాన్ని మార్చుకో వలసి వచ్చింది, అధికారం కోసం పోరాటం వుధృతంగా సాగుతున్న పట్టణాల చుట్టూ, జిల్లాల చుట్టూ దారి మార్చుకున్నాము. ఇన్ని ఇబ్బందులు వున్నప్పటికీ పెట్రోగ్రాడ్‌కు త్వరగానే చేరుకున్నాము".

> **"అయితే, అటు జారు అధికారులుగానీ, ఇటు కెరెన్‌స్కీ తాత్కాలిక ప్రభుత్వంగానీ భారతీయ వలసవాదుల బృందం కోరిన సహాయాన్ని ఇవ్వటానికి నిరాకరించింది. రష్యాలో సోషలిస్టు విప్లవం విజయం పొందిన తరువాత సోవియట్ ప్రభుత్వం, బ్రిటిష్ పాలన నుండి భారతదేశపు స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న సాహసులను కీర్తిస్తూ, ప్రాచ్యంలోని అణగారిన ప్రజల పోరాటాలను బహిరంగంగా సమర్ధించింది."**

ఆయన మొదటిసారిగా సోవియట్‌ను రష్యాను సందర్శించిన తరువాత మరో తొమ్మిదిసార్లు వెళ్ళివచ్చాడు, చివరి సారిగా 1930లో వెళ్ళివచ్చాడు.

పెట్రోగ్రాడ్‌లో వేగమైన, కార్యాత్మకమైన జీవన సరళిని చూసి ఆయన ఎంతగానో ప్రభావితుడయ్యాడు. అక్కడ ప్రతిచోటా సమావే శాలు, వూరేగింపులు సాగుతున్నాయి. కళ్ళ ముందే జీవితంలో మార్పులు చకచకా సంభవి స్తున్నాయి. దశాబ్దాల మార్పు ఒక్క రోజులోనే కన్పడుతున్నది. పరాయి దేశాల ప్రతినిధులంద రికీ సోవియట్ ప్రజలు ఇచ్చిన నులివెచ్చని, సౌహార్ధపూరిత స్వాగతం వారిని కదిలించి వేసింది. భారతీయ ప్రతినిధి రాకను పురస్క రించుకుని సోవియట్ దేశ ప్రముఖ నాయ కుడూ, విద్యారంగానికి చెందిన ప్రజా కమిస్సా ర్ అయిన అనటోలి లునాచార్‌స్కీ అధ్యక్షతన భారత ప్రజలతో సమావేశం జరిగింది.

"నిజానికది మరచిపోలేని బ్రహ్మాండమైన సమావేశం! దీనికి దాదాపుగా 25,000 మంది హాజరయ్యారని," ఆయన గుర్తు చేసుకున్నారు.

1915 కాబూల్‌లో ఏర్పాటైన "భారతదేశ తాత్కాలిక ప్రభుత్వానికి" రాజా మహేంద్ర ప్రతాప్‌ను అధినేతగా గుర్తిస్తూ 1918 మార్చి 19వ తేదీన ఆయనకు పెట్రోగాడ్ సైనిక విప్లవ కమిస్సారియేట్ ఒక గుర్తింపు కార్డును ఇచ్చింది. "దీనిని కలిగివున్న రాజా మహేంద్ర ప్రతాప్ రష్యా నుంచి జర్మనీ ద్వారా స్విట్జర్ లాండ్ వెళ్తున్నాడు. వీరితోపాటు, ఆయన వ్యక్తిగత కార్యదర్శి గ్రిగరీ ఖజనోవిక్, ఆయన వద్ద పనిచేసే ఏ. మాజిబ్ ఆలీలు కూడా వున్నారు. రాజా మహేంద్ర ప్రతాప్‌కూ, ఆయన సహచరులకూ కావాల్సిన సహాయాన్ని అందీయ వలసిందిగా రష్యన్ ఫెడరేటివ్ సోషలిస్టు రిపబ్లిక్ విజ్ఞప్తి చేస్తున్నది." ఈ పత్రంపై ఏ. లోఫే సంతకం చేశారు.

1919 వేసవిలో రాజా మహేద్ర ప్రతాప్ ను క్రెమ్లిన్‌లో లెనిన్ కలుసుకున్నాడు. 1947 లో తాను రచించిన జ్ఞాపకాలలో లెనిన్‌తో చేసిన ఇంటర్వ్యూను పేర్కొన్నాడు. కారాఖాన్, ప్రొఫెసర్ వోజ్‌నెసెన్‌స్కీల సహకారంతో ఈ ఇంటర్వ్యూ జరిగింది, తరువాత ఆయన సోవి యట్ రాయబారి సౌరిజ్‌తో కలసి కాబూల్‌కు చేరుకున్నాడు.

డెహ్రాడూన్‌లో పర్యటిస్తున్నపుడు, అక్టో బరు విప్లవ నాయకునితో మీరు చేసిన ఇంటర్వ్యూ గురించి మీ అభిప్రాయమేమిటని రాజా మహేంద్ర ప్రతాప్‌ను అడిగాను. మాతో ఆయన ఇలా చెప్పారు:

"నేను సోవియట్ ప్రభుత్వ అతిథిని. భారతదేశ తాత్కాలిక ప్రధాన మంత్రి అయిన మౌలానా బర్కతుల్లా నాకన్నా ముందే మాస్కోకు చేరుకున్నాడు. నాకొక చక్కని వసతిని ఏర్పాటు చేశారు. ఇది మాస్కోకు చెందిన ధనవంతునిది. రష్యాకు చెందిన 'చక్కెర మహారాజు' నివాసంగా కనిపించింది. నేను రష్యాకు వచ్చిన మొదటిసారే విదేశీ వ్యవహారాలను చూసే ప్రజా కమిస్సా రియేట్‌కు చెందిన ప్రొఫెసర్ వోజ్‌నెసెన్‌స్కీతో స్నేహం కలిసింది. అలానే విదేశీ వ్యవహారాల సహాయ ప్రజా కమిస్సారియేట్‌కు చెందిన కారాఖాన్‌తో కూడా మంచి స్నేహం కలిసింది. వారు మరోసారి నాకిచ్చిన ఆతిథ్యమూ, ఆదరణా మరువలేనివి.

"ఒక రోజున కామ్రేడ్ వోజ్‌నెసెన్‌స్కీ నాకు ఫోన్‌చేసి నా పుస్తకాలను పంపవలసిందిగా కోరాడు. నేను రెలిజియన్ ఆఫ్ లవ్ అన్న దానితో సహా నాదగ్గరున్న వాటిని ఒకతనికి ఇచ్చిపంపాను. అవి లెనిన్ కోసమన్న ఆలోచన నాకప్పటికి లేదు. తరువాత ప్రొఫెసర్ వోజ్‌నెసెన్‌స్కీ నన్ను పిలిచి ఆ మరుసటి రోజునే లెనిన్ మనలను కలుసుకోనున్నాడని తెలియ చేశాడు. ఆయన మాతోపాటు క్రెమ్లిన్‌కు వచ్చాడు. నేను అక్కడికి మౌలానా బర్కతుల్లా, మౌల్వీ అబ్దుల్ రాబ్, టి. ఆచార్య, దలీప్ సింగ్ గిల్, ఇబ్రహీమ్, బర్కతుల్లా సేవకునితో కలసి వెళ్ళాను. వారిలో ఏ ఒక్కరూ బ్రతికిలేరు.

> "కూర్చోవలసిందిగా లెనిన్ మమ్ము కోరాడు. అందరి కన్నా ముందువున్న నేను చిన్న కుర్చీలో కూర్చోవాలని భావించాను. "మీరు ఏ భాష మాట్లాడుతారు ఇంగ్లీషు, జర్మన్, ఫ్రెంచ్ లేదా రష్యన్ మాట్లాడుతారా అని నన్ను ఇంగ్లీషులో అడిగారు. మీరు చక్కని ఇంగ్లీషు మాట్లాడుతున్నారు, మనం ఇంగ్లీషు లోనే సంభాషించుదామని నేను చెప్పాను."

చివరగా మరణించిన వారు టి.ఆచార్య, ఆయన 1946లో బొంబాయిలో చనిపోయారు...

"మేము క్రెమ్లిన్‌కు చేరుకున్నాము."

రాజా మహేంద్ర ప్రతాప్ మహదానందం తో లేచినిలుచున్నాడు, ఆయన కళ్ళల్లో అసాధారణమైన కాంతి కన్పించింది, ఏభై యేళ్ళనాటి దృశ్యాలు ఆయన కళ్ళముందు అకస్మాత్తుగా కదలినట్లున్నాయి.

"అది ఎలా జరిగిందో మీకు చూపుతాను", అని ఆయన చెప్పాడు. "మాకొక విశాలమైన గదిలోకి దారిచూపారు, దీనికన్నా కాస్తపెద్దదే. ముందుగా నేనే లోపలకు అడుగు పెట్టాను. లెనిన్ మాకు అభిముఖంగా వుండి కాగితాలలో లీనమై వున్నాడు. మమ్మలను చూడగానే ఆయన లేచి నిలుచున్నాడు, ఒక్కసారి మావైపు చూచి వడివడిగా మూలకు వెళ్ళి ఒక చిన్న కుర్చీ తీసుకుని వచ్చి తన కుర్చీపక్కనే వేశాడు. మేము ఆయన బల్లవద్దకు వెళ్ళేసరికే ఇదంతా ఆయన చకచకా చేశాడు.

"కూర్చోవలసిందిగా లెనిన్ మమ్ము కోరాడు. ఏ కుర్చీలో కూర్చోవాలా అని నేను ఒక్క క్షణం సందేహించాను, ఆయన తీసుకు వచ్చిన కుర్చీలో కూర్చుందునా, లేక అక్కడే పెద్దవిగా వున్న ఈజీఛైర్లలో కూర్చుందునా అని ఆలోచించాను. అందరికన్నా ముందువున్న నేను చిన్న కుర్చీలో కూర్చోవాలని భావించాను. నా మిత్రులు పెద్ద కుర్చీలలో కూర్చున్నారు. ప్రొఫెసర్ వోజ్‌నెసెన్‌స్కీ నిలుచునే వున్నాడు, మాకు కాస్త దూరంగా ఇబ్రహీం కూడా నిలుచునే వున్నాడు.

"మీరు ఏ భాష మాట్లాడుతారు ఇంగ్లీషు, జర్మన్, ఫ్రెంచ్ లేదా రష్యన్ మాట్లాడుతారా అని నన్ను ఇంగ్లీషులో అడిగారు. మీరు చక్కని ఇంగ్లీషు మాట్లాడుతున్నారు, మనం ఇంగ్లీషు లోనే సంభాషించుదామని నేను చెప్పాను.

"నేను రాసిన రెలిజియన్ ఆఫ్ లవ్ అన్న పుస్తకాన్ని ఆయనకు ఇచ్చాను. అప్పుడాయన, ఇప్పటికే దీనిని చదివాను, ఇది టాల్‌స్టాయిజం ధోరణికి చెందినదని అన్నాడు... అంతకు ముందురోజు ప్రొఫెసర్ వోజ్‌నెసెన్‌స్కీకి ఇచ్చిన లఘు పుస్తకాలను ఆయన లెనిన్‌కు ఇచ్చాడని నేనప్పుడు అర్థం చేసుకున్నాను. ఆ రాత్రే ఆయన వాటిని చదివినట్లు కనిపిస్తున్నది.

"నా దృక్పథం గురించి నేను లెనిన్‌కు వివరించాను. సమాజసేవ చేయవలసిందిగా ప్రకృతి మిమ్మలను ఎంపిక చేసుకున్నదని అన్నాను. ఇదే తన అభిప్రాయమని ఆయన అన్నారు.

నేను ఆయనకు "సరకుల జాబితాను" సమర్పించాను. వెండి, బంగారాలకు బదులుగా ప్రభుత్వం తప్పనిసరిగా గోదుమ, బియ్యం, వెన్న, బొగ్గు తదితరాలను పంపిణీ చేయాలని అన్నాను. ఈ విషయాన్ని తాను పరిశీలిస్తానని లెనిన్ అన్నారు."

"ఆయన, మాలో ప్రతి ఒక్కరినీ ఒకటి రెండు ప్రశ్నలు అడిగారు. ఆ మాటలన్నిటినీ గుర్తు పెట్టుకుని చెప్పటం చాలా కష్టమని," రాజా మహేంద్ర ప్రతాప్ చెప్పాడు. "భారతదేశ విమోచనయే మా లక్ష్యమని సోవియట్ అధ్యక్షునితో చెప్పటం నాకు గుర్తున్నది. ఇబ్రహీంను ఒక ప్రశ్న వేసినపుడు ఆయన రష్యన్‌లో సమాధానం ఇచ్చాడు. రష్యన్ భాషలో ఆయన తడబడుతూ మాట్లాడినప్పటికీ లెనిన్ ఎంతో మెచ్చుకున్నాడు."

సమావేశంలో పాల్గొన్న వారందరికీ సజీవ చేతనత్వాన్ని కల్గించిన రాజా మహేంద్ర ప్రతాప్, వాలు కుర్చీలో కూర్చుని ఆలోచనల్లో మునిగి పోయాడు.

"ఆయనను మెచ్చుకొనటం నాకు సాధ్యం కావటంలేదు. ఆయన ధీశక్తి, చిత్తశుద్ధి, ఆయనలో వున్న మానవీయత, నిరాడంబరత్వమూ, ఆయా వ్యక్తుల స్థాయితోగానీ, జాతితోగానీ సంబంధం లేకుండా జనులను చూసే పద్ధతి వంటివన్నీ గొప్ప విషయాలే. ఆయన కోట్లాది ప్రజల నాయకుడు, ఇప్పటికే ఆయన ప్రపంచ చరిత్రలో భాగమయ్యాడు. ఆయన ఎంతటి వ్యావహారిక జ్ఞానాన్ని కలిగి వున్నాడు, ఎంతటి మేధావి! ఆ సమావేశం నన్నెంతగానో ప్రభావితం చేసింది, ఇది నా జీవితమంతా గుర్తుంటుంది.

"శ్రామిక జనుల మహోన్నత నాయకుడైన లెనిన్ శతజయంత్యుత్సవమని నేను విన్నాను, 1970లో రష్యా అంతటా ఇది ఎల్లెడెలా జరుగనున్నది. యావత్ప్రపంచానికీ ఇదొక మహత్తరమైన ఘటన, ప్రతిచోటా దీనిని వుత్సాహంగా జరుపుకోగలరని నేను నమ్ముతున్నాను."

ఆయనతో మేము సుదీర్ఘమైన చర్చలనే జరిపాము. మాస్కోలో వున్నపుడే, కాబూల్ వరకు తోడు రావలసిందిగా సోవియట్ రాయబారి య. జడ్. సొరిట్జ్‌ను కోరినట్లుగా ఆయన చెప్పాడు, అలానే జరిగింది. సోవియట్ దౌత్యవేత్తలైన ఏ.ఎన్. వోజ్‌నెసెన్‌స్కీ, ఎల్.ఎం. కారాఖాన్‌లతో తనకున్న మైత్రి గురించీ, ఎం.ఐ. కలినిన్ తదితర సోవియట్ నాయకులతో తాను జరిపిన సమావేశాల గురించి కూడా ఆయన వివరించాడు.

### *లెనిన్‌తో పి.ఎస్. ఖంఖోజి ఇంటర్వ్యూ*

కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ మూడవ మహాసభకు సన్నాహాలు జరుగుతున్న తరుణంలో 1921 జూలై 7వ తేదీన వీరేంద్రనాథ్ ఛటోపాధ్యాయ, జి.ఏ. లుహాని, పి.ఎస్.ఖంఖోజీలు కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కార్యనిర్వాహక కమిటీకి, అలానే ప్రాచ్య సమస్యపై ఏర్పడిన మహాసభ కమీషన్‌కు పంపించదలచిన థీసిస్ ఆన్ ఇండియా అండ్ ది వరల్డ్ రివల్యూషన్ అన్న ఒక పత్రాన్ని లెనిన్‌కు పంపించారు. భారతదేశం గురించి చర్చించేందుకుగాను ఇంటర్వ్యూ యివ్వాలని కోరుతూ అదనంగా మరో విజ్ఞప్తిని కూడా జతచేశారు. సమావేశం కోసం మేమందరమూ ఆదుర్దాతో ఎదురు చూశామని తదనంతర కాలంలో వీరేంద్రనాథ్ ఛటోపాధ్యాయ చెప్పారు.

దీనికి సమాధానంగా లెనిన్ ఒక లేఖ రాశాడు. ఆయన బయటకు రాసిన పత్రాల రిజిస్టర్ ఫైలు ప్రకారం 1920 జూలై 8వ తేదీన 501 క్రమ సంఖ్యతో భారతీయ విప్లవకారులకు ఆంగ్ల భాషలో ఒక జాబు రాసినట్లుగా వున్నది. దానిలో ఈ విధంగా వున్నది:

"కామ్రేడ్స్ ఛటోపాధ్యాయ, లుహాని, ఖంఖోజీలకు

"మీ థీసెస్‌ను నేను చాలా ఆసక్తిగా చదివాను. అయితే ఎందుకీ కొత్త థీసెస్? ఈ విషయమై నేను మీతో మాట్లాడుతాను.

"మీ సోదరతుల్యుడు, వి. లెనిన్"

అజియా ఐ ఆఫ్రికా సెగోద్న్య పత్రికలో ప్రచురించిన వ్యాసంలో సోవియట్ పరిశోధకుడు ఆర్.యునిత్స్కయా ఈ విధంగా పేర్కొన్నాడు: "భారతీయ విప్లవకారులతో మాట్లాడాలన్న లెనిన్ వుద్దేశాలు నెరవేరలేదు. ఆ సమయంలో ఇల్యిచ్ అనారోగ్యంతో వున్నారు." ఒక నెల రోజులపాటు ఆయనకు సిక్‌లీవు ఇవ్వటం జరిగింది. కేవలం కేంద్రకమిటీ పొలిట్‌బ్యూరో సమావేశాలకు, సోవియట్ ప్రజా కమిస్సార్ సమావేశాలకూ, శ్రామిక-రక్షణ సోవియట్‌లకు మాత్రమే హాజరయ్యేవారు. జూలై 13వ తేదీన ఆయన సెలవుపై గోర్కీకి వెళ్ళారు.

ఇది ఇలా వున్నప్పటికీ రచయిత పొరపడినట్లుగా కొన్ని కొత్త వాస్తవాలు తెలియచేస్తున్నాయి.

ఉదాహరణకు, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో భారత ప్రతినిధియైన ఎం.ఎన్. రాయ్, బెర్లిన్ నుంచి మాస్కోకు చేరిన స్మృతుల గురించి రాస్తూ, వీరేంద్రనాథ్ ఛటోపాధ్యాయ, పి. ఖంఖోజి, గులామ్ అంబియా ఖాన్ లుహానీలతో సహా పద్నాలుగుమంది హాజరైనట్లు పేర్కొన్నాడు. చిచెరిన్‌తో సమావేశం గురించీ, లెనిన్‌తో ఇంటర్వ్యూ గురించిన వారి విజ్ఞప్తి గురించీ ఆయన రాశాడు. "ఇంటర్వ్యూ ఇవ్వటానికి లెనిన్ అంగీకరించాడు. తమలో తాము ఎంపిక చేసుకున్నన ముగ్గురు ప్రతినిధులను లెనిన్ కలుసుకుంటారని భారతీయ విప్లవకారులకు తెలియచేశారు..." రాయ్ చెప్పినదాని ప్రకారం, లెనిన్‌ను కలుసుకున్న వారిలో ఛటోపాధ్యాయ, బి.దత్‌లు వున్నారు. కాగా, "మూడవ వ్యక్తి ఎవరైనదీ నేను మరచిపోయాను, బహుశ ఆయన ఖంఖోజీయే కావచ్చునని" ఆయన అన్నారు.

ఆ రకంగా అక్కడ జరిగిన ఇంటర్వ్యూ గురించి ఎం.ఎన్. రాయ్ చెప్పాడు.

తన లేఖలో పేర్కొన్న భారతీయులలో ఒకరికి లెనిన్ ఇచ్చిన ఇంటర్వ్యూ గురించిన మరొక ప్రస్తావన ఇంతకు ముందే చెప్పిన సిసిల్ కాయే నివేదికలో బయటపడింది. బ్రిటిష్ గూఢచారి ఏజంట్ల దగ్గరవున్న అనేకానేక నివేదికల నుండీ, ఢిల్లీలోని గూఢచారి విభాగ అధినేత దగ్గర వున్న నివేదికల ద్వారా ఈ సమాచారాన్ని సేకరించి ఇలా రాశాడు: "ఐరోపాలో వున్న సమస్త భారతీయ విప్లవ కారులతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేయాలంటూ, 1920 అక్టోబరులో, ఆనాటికి స్టాక్‌హోమ్‌లో వున్న సుప్రసిద్ధ భారతీయ విప్లవకారుడైన ఛటోపాధ్యాయ ఒక ప్రతిపాదనను పంపాడు.... ఛటోపాధ్యాయ మాస్కోకు వెళ్ళి అక్కడ లెనిన్‌ను కలిశాడు (ఇది తానుగా చెప్పినది).

> ❝ లెనిన్ వద్దకు పంపిం చిన థీసెస్ కర్తలిరువురూ ఇప్పుడు సజీవంగా లేరు, అయితే మీరు మూడవ రచయితను కలుసుకోవచ్చు. నాగపూర్‌లో వున్న డాక్టర్ ఖంఖోజీకి రాయండి. ఆయనకు ఇప్పుడు ఏళ్ళు దాటాయి. అక్టోబరు విప్లవ మహా నాయకునితో చేసిన ఇంటర్వ్యూ వంటి ముఖ్యమైన విషయం ఆయనకు గుర్తుండే వుంటుందని నేను గట్టిగా చెప్పగలను. ❞

వలస ప్రభుత్వానికి చెందిన విలక్షణ ప్రతినిధియైన సిసిల్ కాయే కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారంలో భాగంగా లెనిన్‌తో చేసిన ఇంటర్వ్యూను వ్యాఖ్యానించే ప్రయత్నం చేశాడు. "బోల్షెవిక్ ప్రభుత్వం తన పథకానికి" ఆర్థిక సహాయం చేయగలదని వీరేంద్ర ఛటోపాధ్యాయ భావించినట్లు చెప్పుకొచ్చాడు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కాయే ఆరోపణలను మనం పట్టించుకోకపోయి నప్పటికీ, భారతీయ విప్లవకారులు లెనిన్‌ను ఇంటర్వ్యూ చేశారన్న అంశాన్ని ఈ నివేదిక వెల్లడిస్తున్నది.

భారతదేశానికి చెందిన ప్రముఖ పాత్రికేయుడైన రానా జంగ్ బహదూర్ సింగ్‌తో యునిత్స్కయ వ్యాసం గురించి చర్చించేటపుడు ఈ విషయం గురించి ఆయన అభిప్రాయాన్ని అడిగాను.

"ఈ విషయమై కచ్చితంగా ఏమైనా చెప్పటం చాలా కష్టమని" ఆయన సమాధానం ఇచ్చాడు. "అన్నిటికన్నా ముఖ్యంగా లిఖిత పత్రాలనేవి ఏమీలేవు. లెనిన్ వద్దకు పంపించిన థీసెస్ కర్తలిరువురూ ఇప్పుడు సజీవంగా లేరు, అయితే మీరు మూడవ రచయితను కలుసుకోవచ్చు. నాగపూర్‌లో వున్న డాక్టర్ ఖంఖోజీకి రాయండి. ఆయనకు ఇప్పుడు ఏళ్ళ దాటాయి. అక్టోబరు విప్లవ మహా నాయకునితో చేసిన ఇంటర్వ్యూ వంటి ముఖ్యమైన విషయం ఆయనకు గుర్తుండే వుంటుందని నేను గట్టిగా చెప్పగలను".

"అంటే డాక్టర్ ఖంఖోజీ సజీవులుగానే వున్నారన్నమాట", అని నేను సంతోషంతో అన్నాను.

డాక్టర్ పి.ఎస్. ఖంఖోజీవంటి కొద్దిమంది శక్తిశాలురే భారత విప్లవోద్యమాన్ని లేవదీశారు. ఆయన 1884 నవంబరు 7వ తేదీన పలక్‌వదిలో జన్మించాడు. ఆయన తాతగారైన వెంకటేశ్‌రావు 1857 నాటి సాహసోపేతమైన వలస వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నాడు. ఈయనకు సంబంధించిన కథలు చిన్నప్పుడే విని బ్రిటిష్ పాలన నుండి దేశానికి స్వాతంత్ర్యాన్ని తేచ్చే మార్గాల కోసం అన్వేషించటం మొదలుపెట్టాడు. ఆ తరువాత ఆయన రహస్య విప్లవ కార్యక్రమాలను ప్రారంభించటంతో పోలీసుల దృష్టిలో పడ్డాడు.

1900 సంవత్సరంలో ఆయన ఆయుధాలను, బాంబులను తయారుచేసే రహస్య యువజన సంఘంలో చేరాడు.

ఆకాలంలోనే ఆయన భారత విమోచనోద్యమానికి చెందిన మహా నాయకుడైన బాల గంగాధర తిలక్‌ను కలుసుకున్నాడు, యువజనులను ప్రోత్సహించే ఆయన విదేశాలలో చదువును పూర్తి చేయాలని సలహా ఇచ్చాడు. బ్రిటిష్ వాళ్ళకు వ్యతిరేకంగా బహిరంగ తిరుగుబాటుకు అవకాశం వున్నందున సైనిక శిక్షణను కూడా తీసుకో వలసిందిగా సూచించాడు.

పదిహేడేళ్ళ వయసులో ఖంఖోజీ భారత దేశాన్ని విడచి పెట్టాడు. అదృష్టం ఆయనను యుఎస్ఏకు చేర్చింది. అక్కడే ఆయన బెర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో చేరాడు. ఆ తరువాత మిటరీ అకాడమీలో చేరాడు. తరువాత ఓరెగాన్‌లోని వ్యవసాయ కళాశాలలో సీటు సంపాదించుకున్నాడు.

ఈ కాలంలోనే ఆయన విప్లవ కార్యకలాపాలలో చురుకైన పాత్రను నిర్వహించాడు, అమెరికాలో ఏర్పరిచిన "గదర్" పార్టీ ఆఫ్ ఇండియన్ రివల్యూషనరీస్ స్థాపకుల్లో ఒకరుగా వున్నాడు.

మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం కాగానే, భారత జాతీయ విమోచన యొక్క పోరాట పద్ధతులను చర్చించేటందుకై పోర్ట్‌లాండ్‌లో (ఓరెగాన్) జరగనున్న భారత విప్లవకారుల సమావేశంలో పాల్గొన వలసిందిగా "గదర్" పార్టీ సైనిక విభాగం నుంచి ఆయనకు ఆదేశాలు వచ్చాయి. గదర్" సభ్యులు ఆఫ్ఘనిస్థాన్,

“ ఈ తరుణంలోనే డాక్టర్ ఖంఖోజీ తన జ్ఞాపకాలను భారత పురావస్తు కేంద్రానికి అంద చేశాడు. దురదృష్టవశాత్తు సోవియట్ రష్యాలో ఆయన పర్యటన, లెనిన్‌తో ఇంట ర్వ్యూ, మార్క్సిజం-లెనినిజంతో ఆయన పరిచయం వంటి విషయాలు రాకుండానే ఆ జ్ఞాపకాలు ఆగిపోయాయి. ”

బెలూచీస్థాన్, సింద్ సరిహద్దు ప్రాంతాల నుండి భారత్ తదితర దేశాలలో బ్రిటిష్ వ్యతి రేక కార్యకలాపాలు సాగించాలన్న నిర్ణయం జరిగింది.

న్యూయార్క్‌లోని బ్రిటిష్ కౌన్సిల్ వీరికి పాస్‌పోర్ట్‌లను తిరస్కరించడంతో ఖంఖోజీ నేతృత్వాన భారతీయుల బృందం ఒకటి పర్షియన్ పేర్లతో ఐరోపా చేరి అక్కడ నుంచి కాన్‌స్టాంటినోపిల్ మార్గం పట్టారు. టర్కీలో వారొక సాయుధ బృందాన్ని ఏర్పాటు చేసి బాగ్దాద్‌కు పంపారు. ఇరాన్‌లో ఈ బృందం బ్రిటిష్ వలస సైన్యంలో పనిచేస్తున్న భారతీయు లను పురికొల్పి చర్యలకు ప్రోత్సహిం చింది. ఇది ఇలా వుండగా ఆఫ్ఘనిస్థాన్‌లో రాజా మహేంద్ర ప్రతాప్, మౌలానా బర్కతుల్లా తదితర పలువురు నాయకులు “భారతదేశ తాత్కాలిక ప్రభుత్వాన్ని” ఏర్పాటు చేశారు. బెలూచీ తెగవారితో కూడిన మొట్టమొదటి సైనిక దళం (ఖంఖోజీ నాయకత్వాన) భారతీయ విప్లవ సైన్యంలో చేరింది.

సాహసులైన కొద్దిమంది దేశభక్తులు బ్రిటిష్ జనరల్ ఓ డయ్యర్ నాయకత్వాన వున్న సైనిక పటాలంతో అసమ పోరుకు తలపడ్డారు. ఇరానియన్ బెలూచీస్థాన్ కేంద్రమైన బంపుర్‌కు బయలుదేరిన భారతీయ తిరుగుబాటుదారుల బృందం విముక్తి ప్రాంతాలకు స్వాంతత్ర్యాన్ని కల్పించింది. ఈ బృందాన్ని బ్రిటిష్‌వాళ్ళు సర్-ఇ-దగర్ ఎడారిలో విద్రోహంతో పట్టుకుని ధ్వంసం చేశారు. కొంతమంది తిరుగు బాటుదారులు ఇండియన్ బెలూచీస్థాన్‌కు చేరుకుని అనేక సంవత్సరాలపాటు చురుకైన పాత్రను నిర్వహించారు.

తరువాత కాలంలో ఖంఖోజీ బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా పోరాడుతున్న తెగలలో చేరాడు. విద్రోహాలూ, కలరా తదితర వ్యాధులు, ఆయు ధాల కొరతవంటి కారణాలతో వారు వెనుకడు గు వేయవలసి వచ్చింది. ఖంఖోజీ కూడా అజ్ఞాతంలోకి వెళ్ళటమే కాకుండా చివరకు పకీరులాగా వేషం మార్చుకున్నాడు. వైఫల్యం బాధ ఒకవైపున పీడిస్తుంటే మరోవైపు ఆయన జీవితం ప్రమాదంలో పడింది. ఈ సమయం లోనే ఖంఖోజీ భారత్‌కు తిరిగివచ్చి రహస్య ంగా తిలక్‌ను కలుసుకున్నాడు. అజ్ఞాతంలో వుండవలసిందిగా ఆయన సలహా ఇచ్చాడు. ఆ రకంగా ఆయన ప్రవాసంలో నూతన దశ ప్రారంభమైంది.

ఈ తరుణంలోనే డాక్టర్ ఖంఖోజీ తన జ్ఞాపకాలను భారత పురావస్తు కేంద్రానికి అందచేశాడు. దురదృష్టవశాత్తు సోవియట్ రష్యాలో ఆయన పర్యటన, లెనిన్‌తో ఇంట ర్వ్యూ, మార్క్సిజం- లెనినిజంతో ఆయన పరిచయం వంటి విషయాలు రాకుండానే ఆ జ్ఞాపకాలు ఆగిపోయాయి.

విప్లవ సైనం ఓటమి పొందటంతో ఖంఖోజీ జర్మనీకి చేరాడు. అక్కడ విదేశాలలో భారత జాతీయ విమోచన వుద్యమం యొక్క పునర్నిర్మాణానికి కృషి చేశాడు, అలానే ఇండియన్ న్యూస్ సర్వీస్‌ను, ఇండో-జర్మన్ ట్రేడ్ కంపెనీని స్థాపించాడు. 1920లలో ఆయన సోవియట్ రష్యాను సందర్శించాడు, ఆ తరువాత ఐరోపాలోనూ, తదనంతరం మెక్సికోలో నివసించి తనదైన కృషి చేశాడు. చివరకు 1956లో ముదివగ్గుగా భారత దేశానికి తిరిగి వచ్చాడు.

1966 అక్టోబరు 3వ తేదీన డాక్టర్ ఖంఖోజీకి నేను ఒక లేఖరాస్తూ, లెనిన్‌తో మీ ఇంటర్వ్యూ గురించి తెలుసుకోవాలని నేను చాలా ఆసక్తిగా వున్నాను, ఈ ఘటన గురించి తెలియచెప్పే పత్రాలుగానీ, ఫొటోలుగానీ లేదా ఇతర సమాచారంగానీ వున్నదా అని నేను ఆ లేఖలో కోరాను.

1966 అక్టోబరు 9వ తేదీన నాగపూర్ నుంచి డాక్టర్ ఖంఖోజీ కార్యదర్శి ఆనందరావు జోషి నాకు జవాబు ఇచ్చాడు. డాక్టర్ ఖంఖోజీ మంచంలో వున్నందున సమాధానం చెప్పలేని స్థితిలో వున్నాడు, అయితే లెనిన్‌తో చేసిన ఇంటర్వ్యూ తననెంతో ప్రభావితం చేసిందనీ, ఆయనంటే ఎంతో గౌరవం వున్నదనీ చెప్పా లని కోరుకుంటున్నట్లు ఆయన ఆ లేఖలో పేర్కొన్నాడు. ఐరోపా, అమెరికాలలో తాను కలుసుకున్న మహామహులలో లెనిన్ మహోన్న తుడన్న మాటను కూడా జతచేశాడు.

ఇలా రాయడంలో కొంత ఔచిత్యం లేక పోలేదు. సాధ్యమైనంత త్వరలో నాగపూర్ వెళ్ళాలని భావించాను. అయితే కొన్ని వ్యవహా రాల కారణంగా అనుకోగానే బయలు దేర లేకపోయాను. తిరిగి జనవరిలో డాక్టర్ ఖంఖోజీకి మరో లేఖరాస్తూ కొన్ని ప్రశ్నలు కూడా పంపాను. కాని, 1967 జనవరి 24వ తేదీన ఆయన కార్యదర్శి ఈ దిగువ సందేశం తో నాకొక లేఖ రాసినపుడు నేనెంత నిరుత్సా హానికి గురయ్యాను: “ఈ నెల 20వ తేదీన మీరు రాసిన లేఖను (ప్రశ్నలను కూడా) నిన్నటి వుదయాన్నే అందుకున్నాము. దురదృష్టవశాత్తు ఇది కాస్త ఆలస్యంగా చేరింది. రెండు రోజుల క్రితమే డాక్టర్ ఖంఖోజీ ఈ లోకాన్ని విడచి వెళ్ళిపోయారు...”

ఇక ఎన్ని ప్రయత్నాలు చేసినా నిరుపయో గమేనని, ఖంఖోజీ ఆయన సహచరులు కలసి అక్టోబరు విప్లవ నాయకునితో చేసిన ఇంట ర్వ్యూ గురించిన వివరాలు నాకు తెలిసే అవ కాశం లేనట్లుగా కనిపించింది. కాని, ఇక్కడితో కథ ముగియలేదు.

ఒక రోజున నేను ఢిల్లీలోని నా అధ్యయన గదిలో వుండగా ధూసరవర్ణ శోభితమైన కేశ పాశములు కలిగిన చక్కని యువతి ప్రవేశిం చింది. “మీరు నా మృత భర్తకు లేఖ రాశారు”, అంటూ “నేను ఖంఖోజీ శ్రీమతిని” అని చెప్పింది.

పదహారేళ్ళ ఈ బెల్జియన్ వనిత భారత దేశానికి బహుదూరాన వున్నప్పటికీ ఆయనతో ప్రేమలో పడింది. వారి జీవితానికి స్థిరత్వం లభించలేదు, అనేక కష్టాలను ఎదుర్కొన్నారు, అయినా వారు సంతోషంగానే వున్నారు. తన భర్త తరచుగా రష్యాలో గడిపిన రోజులను గుర్తు చేసుకొనటంతోపాటు, వాటిని తన జీవితంలో విశిష్టమైన రోజులుగా భావించే వాడని ఆమె చెప్పింది. తాను చేసిన వైయక్తిక ఇంటర్వ్యూలనూ, లెనిన్‌తో సాగించిన సుదీర్ఘ సంభాషణలను తనతో చెప్పేవాడని, ఆయనపై లెనిన్ చూపిన ప్రభావం మాసిపోనిదని అన్నారు.

మీ భర్త విప్లవ కార్యకలాపాలను సాగిం చిన కాలానికి సంబంధించి ఏమైనా పత్రాలు ఇప్పటికీ మీవద్ద వున్నాయా అని నేను శ్రీమతి ఖంఖోజీని అడిగాను.

ఆమె ఇలా చెప్పింది: “నాకు సందేహమే.

మేము ఒకచోటి నుంచి మరోచోటికి మారటం, రహస్య కార్యకలాపాల కారణంగా అలాంటివి వుండటం అసంభవమే. తన జ్ఞాపకాలను రికార్డు చేయవలసిందిగా నచ్చచెప్పలేక పోయాను, అందుకు నన్ను నేను ఎన్నటికీ క్షమించుకోలేను... అయితే నాభర్త చనిపోవటానికి ఒక ఏడాది ముందు ఒక రష్యన్ నాగపూర్ మీదుగా వెళ్తూ అక్కడ ఆగాడు. వాళ్ళు చాలా సేపు మాట్లాడుకున్నారు. ఆయన కూడా మీకువలెనే రష్యాలో డాక్టర్ ఖంఖోజీ గడిపిన కాలం గురించీ, లెనిన్‌తో ఆయన చేసిన ఇంటర్వ్యూ గురించి అడిగాడు. బహుశ ఇది 1966 వసంతంలోగానీ, వేసవిలోగానీ జరిగి వుంటుంది..."

ఈ శోధన ముందుకే సాగింది. భారతదేశంలోని యుఎస్ఎస్ఆర్ రాయబార కార్యాలయం రెండవ కార్యదర్శి వి.ఐ. క్రషెనిన్నికోవ్‌ను డాక్టర్ ఖంఖోజీ కలుసుకున్నాడని గ్రహించాను. డాక్టర్ ఖంఖోజీతో ఆయన జరిపిన ఇంటర్వ్యూ పాఠాన్ని1966 ఏప్రియల్ 15వ తేదీన అందుకున్నాను.

దానిలో ఈ దిగువ సమాచారం వున్నది.

దక్షిణ ఇరాన్‌లో (ఇరానియన్ బెలూచీస్థాన్) బ్రిటిష్ వ్యతిరేక జాతీయ-విమోచన వుద్యమ నాయకునిగా పి.ఎస్. ఖంఖోజీ వున్నపుడు 1920 చివరిలోగానీ, లేదా 1921 ప్రారంభంలోగానీ ఇరాన్‌లో వున్నపుడు మాస్కోకు రావలసిందిగా లెనిన్ ఆహ్వానించాడు.

ఇరాన్‌లోని జాతీయ-విమోచన వుద్యమ నాయకులతో వ్యక్తిగత సంబంధాలు పెట్టుకోవలసిందిగా లెనిన్ కోరినట్లు ఖంఖోజీ మాటల ద్వారా తెలుస్తున్నది. దౌత్య సంబంధాలను స్థాపించుకోవాలన్న లక్ష్యంతో 1920 ద్వితీయార్థంలో ఆర్ఎస్ఎఫ్ఎస్ఆర్‌కూ ఇరాన్‌కూ మధ్య సాగుతున్న చర్చలతో  యీ పరిచయాలను ముడివేశారు.

భారతదేశంలో బ్రిటిష్ వ్యతిరేక వుద్యమంతో ఖంఖోజి సన్నిహితంగా ముడివడి వున్నాడని తెలిసిన లెనిన్, వుద్యమ స్థితిగతులపై కచ్చితమైన సమాచారం కావాలని, ఏయే రాజకీయ శక్తులు, బృందాలు పాల్గొంటున్నాయో తెలియచేయాలని కోరాడు. భారతదేశంలో సాగుతున్న జాతీయ-విమోచన వుద్యమంపై మరింత వాస్తవిక దృక్పథాన్ని లెనిన్ కోరుకున్నాడు.

1921 ప్రారంభంలో ఖంఖోజీ ఇరాన్‌ను విడిచిపెట్టి టర్కీద్వారా బెర్లిన్‌కు చేరుకున్నాడు. అక్కడ ఆయన ఎం.ఎన్. రాయ్, ఆర్. గుప్తా, అమెరికన్ కమ్యూనిస్టు అయిన అగ్నేస్ స్మిడ్లీల తోపాటు మరో ఇరువురిని కలుసు కున్నాడు.

> **❝ ఆయనింకా ఇలా చెప్పాడు : లెనిన్‌తో నేను ఇంటర్వ్యూలు చేయటానికి ముందూ, తరువాతా వేర్వేరు దేశాలకు చెందిన పలువురు రాజనీతిజ్ఞులను కలుసుకున్నాను, కాని వారిలో ఎవరూ నన్ను లెనిన్‌వలె ప్రభావితం చేయలేదు. అన్నిటి లోకీ ఆశ్చర్యాన్ని కలిగించే అంశ మేమిటంటే, లక్షలాదిగా వున్న కార్మిక కర్షకుల్లో తనను తాను ఒకనిగా భావించేవాడు, వారి ప్రయోజనాలను మనసులో వుంచుకునే వాడు. లెనిన్‌ది బహు సాధారణ జీవితం, ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలను కోరుకునేవాడు కాదు. ❞**

1921 మార్చిలో ఈ బృందం మాస్కోకు చేరింది.

ఆ సమయంలో లెనిన్, ఆర్‌సిపి(బి) పదవ మహాసభ సన్నాహాలలోనూ, క్రాన్‌స్టాట్ తిరుగుబాటు ఫలితాల ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నంలోనూ మునిగి వున్నందున ఖంఖోజీ వచ్చినపుడు ఆహ్వానించలేకపోయాడు. మాస్కోలోని "లక్స్" హోటల్‌లో ఖంఖోజీకి బస ఏర్పాటు చేశారు. ఆయనను దేశంలో పర్యటిస్తున్న విదేశీ కమ్యూనిస్టులకు పరిచయం చేశారు. ఆయన బృందానికి లునాచార్‌స్కీ నాయకునిగా వున్నాడు, ఆయనతో త్వరలోనే పరిచయం కుదిరింది. ఈ బృందం ఓల్గా ప్రాంతంలోనూ, ఉరల్స్‌లోనూ పర్యటించింది. సోవియట్ ప్రజల విప్లవపోరాటం గురించీ, విద్యావ్యవస్థ గురించీ వివరాలు తెలుసుకున్నారు.

ఈ సమయంలోనే చిచిరిన్‌ను డాక్టర్ ఖంఖోజీ పలుమార్లు ఇంటర్వ్యూ చేశాడు. ఆయన నిరాడంబరత్వమూ, ఆదరణా ఖంఖోజీని ఎంతగానో ఆకర్షించాయి. చిచిరిన్ స్వయంగా సమోవార్‌లో బొగ్గులను సరిచేసేవాడు. ఏ దేశంలోని విదేశాంగ మంత్రినీ ఇలా చూడలేము.

1921 వేసవిలో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ మూడవ మహాసభలో ఖంఖోజీ పాల్గొన్నాడు. మహాసభ ముగిసిన వెంటనే లెనిన్ ఆయనను కలుసుకున్నాడు.

లెనిన్ తన నివాసంలోనే రెండు ఇంటర్వ్యూలను ఇచ్చాడు, ఇవి రెండూ అనధికారికమైనవే. ఈ రెండుసార్లూ ఎం.ఎన్. రాయ్ హాజరయ్యాడు. మొదటిసారి ఇంటర్వ్యూ చేసినపుడు లెనిన్‌కు ఇరాన్ పరిస్థితిని ఖంఖోజీ వివరించాడు. రెండవసారి భారతదేశ పరిస్థితిని వివరించాడు. ఆ సమయంలో జరిగిన సంభాషణా వివరాలేమీ ఖంఖోజీకి గుర్తులేవు. అలానే లెనిన్ ప్రశ్నలూ, వ్యాఖ్యలు కూడా గుర్తులేవు. సంభాషణ మొత్తం ఇంగ్లీషులోనే జరగటం వలన దుబాసీ అవసరం లేకపోయింది, లెనిన్‌కు ఆంగ్లభాషపై మంచి పట్టువుంది.

ఖంఖోజీ తన జ్ఞాపకాలను నెమరు వేసుకొంటూ లెనిన్ చాలా నిరాడంబరంగానూ, మైత్రీభావంతోనూ వుంటాడని ఆయన ప్రగాఢ విజ్ఞానమూ, శక్తివంతమైన తర్కమూ తనపై మరుపురాని ప్రభావాన్ని చూపాయని ఆయన చెప్పారు.

ఆయనింకా ఇలా చెప్పాడు : "లెనిన్‌తో నేను ఇంటర్వ్యూలు చేయటానికి ముందూ, ఆ తరువాతా వేర్వేరు దేశాలకు చెందిన పలువురు రాజనీతిజ్ఞులను కలుసుకున్నాను, కాని వారిలో ఎవరూ నన్ను లెనిన్‌వలె ప్రభావితం చేసినవారు లేరు. అన్నిటిలోకీ ఆశ్చర్యాన్ని కలిగించే అంశమేమిటంటే, లక్షలాదిగా వున్న కార్మిక కర్షకుల్లో తనను తాను ఒకనిగా భావించేవాడు, వారి ప్రయోజనాలను మనసులో వుంచుకునే వాడు. లెనిన్‌ది బహు సాధారణ జీవితం, ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలను కోరుకునేవాడు కాదు.

"లెనిన్ మన కాలానికి చెందిన మహోన్నత నాయకుడు. ఈ ఇంటర్వ్యూలు నా ప్రాపంచిక దృక్పథాన్ని సరిదిద్దాయి. నేను కమ్యూనిస్టు పార్టీలో సభ్యునిగా లేనప్పటికీ లెనినిస్టుగానే వున్నాను, అలానే నిలచిపోయాను".

ఖంఖోజీతో చేసిన ఈ ఇంటర్వ్యూ అన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదు. అయినప్పటికీ లెనిన్ జీవితమూ, కార్యకలాపాల గురించి సరికొత్త వివరాలను శోధించే నూతన అవకాశాలను చూపాయి. ఇవి వివిధ ప్రజలకు చెందిన నాయకమ్మన్యుల జీవితాలపై వెలుగును ప్రదర్శించాయి. వారిలో చాలామంది లెనిన్‌ను ఇంటర్వ్యూ చేశారు. తరచుగా ఆయన పేరు స్వయంగా, వారి భవిష్యజ్జీవితాన్నీ, తమ దేశం కోసం వారు సాగించే పోరాటాన్నీ రూపుదిద్దటంలో కీలకమైన పాత్రను నిర్వహించాయి. ఈ తరహా ఇంటర్వ్యూలూ, సమావేశాలూ సోవియట్ - భారత మైత్రి ప్రారంభాన్ని తెలియచేస్తున్నాయి. లెనిన్ పునాదులు వేసిన ఈ మిత్రత్వం భారత స్వాతంత్ర్యానంతరం విశాలత్వాన్నీ, దృఢత్వాన్నీ పుంజుకున్నాయి.

**(అనువాదం: ఫాతిమా)**

❋

# సిద్ధాంత వేత్త, కార్యదక్షుడు కామ్రేడ్ లెనిన్

(2వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయుడిగా మనస్ఫూర్తిగా గ్రామీణ పేదపిల్లలను అభివృద్ధి చేయడానికి ఎంతో కృషి చేస్తుండేవారు. తమ తండ్రి నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడం, తద్వారా పొందే ఆనందం, నమ్మిన ఆశయానికి కట్టుబడి నికరంగా పనిచేయటం, పనిలో నిమగ్నమై చేయడం, అలాగే తల్లిదండ్రుల నిరాడంబ రతల ప్రభావం లెనిన్ మీద, ఆయన తోబుట్టువుల మీద ఎంతగానో పడింది. బాల్యం నుండే ప్రతి విషయాన్ని కూలంకుషంగా తెలుసుకోవాలన్న అలవాటు సహజంగానే తల్లిదండ్రుల నుండి లెనిన్‌కు అబ్బింది. అతి చిన్న వయస్సులో నుండే సమాజంలోని రాచరిక అన్యాయాలపై గెంతెత్తే లక్షణం లెనిన్‌కు అలవాటు అయింది. ఈ లక్షణాలు లెనిన్‌ను అత్యంత ప్రతిభావంతుడైన విద్యార్థిగా నిలబెట్టాయి.

**విప్లవ భావాలవైపు**

లెనిన్ బాల్యం ముగిసే నాటికి రష్యా అభివృద్ధి నిరోధక రాజ్యంగా మారుతున్నది. కనీస భావ ప్రకటనా స్వేచ్ఛ కూడా భరించలేని పరిస్థితి దాపురించింది. ఈ పరిస్థితులు లెనిన్‌ని విప్లవ, ప్రజాస్వామిక సాహిత్యం వైపు నడిపించాయి. సామాన్య ప్రజల జీవితాల గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి ఆయనలో పెరిగింది. సరిగ్గా ఆ సమయంలోనే రెండు బాధాకరమైన సంఘటనలు వెంటవెంటనే ఆయన జీవితంలో జరిగాయి. ఒకటి ఆయన తండ్రి హఠాత్తుగా గుండెపోటుతో మరణించాడు. కొద్ది నెలల తేడాలోనే ఆయన ఎంతగానో ప్రేమించే అన్న అలెగ్జాండర్‌ని జార్ చక్రవర్తిని హత్య చేయడానికి ప్రయత్నించాడన్న ఆరోపణపై ఉరితీయడం జరిగింది. మా అన్న ఏం చేస్తే నేను అదే చేస్తాను అని చెప్పుకునేంతగా ప్రేమించే అన్న మరణం లెనిన్‌ని కుదిపేసింది. అలెగ్జాండర్ ఉరిపై రష్యా అంతటా తీవ్ర నిరసన పెల్లుబికింది. అలెగ్జాండర్ వీరమరణం పొందాడు. ఆయన వీరోచిత మరణం లెనిన్ ఎంచుకున్న మార్గానికి క్రాంతి నిచ్చింది అని వారి అక్క అన్నా ఎలిజలోవా వ్యాఖ్యానించింది. అన్న మీద ఎంతో ప్రేమాభిమానాలున్నప్పటికీ మనం ఆయన మార్గాన్ని అనుసరించలేము అని లెనిన్ తేల్చిచెప్పటం చూస్తే ఇంత చిన్న వయస్సులోనే ఆయనలోని సైద్ధాంతిక పరిపక్వత మనకి ఆశ్చర్యం కలిగిస్తుంది. తండ్రి, అన్నల మరణంతో ఆ కటుంబానికి కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వం పెన్షన్ నిలుపుదల చేసింది. అన్న విప్లవకారుడు కాబట్టి తమ్ముడైన లెనిన్‌ని ప్రభుత్వం వెంటాడటం ప్రారంభిం చింది. స్కూల్‌లో అన్నింటిలో ప్రతిభావంతు డిగా పేరుతెచ్చుకున్న లెనిన్ కాలేజీలో చేరనీయకుండా చికాకుపర్చారు. ఎట్టకేలకు



భార్య కృపస్కయాతో కామ్రేడ్ లెనిన్–1922

ఆయన న్యాయశాస్త్ర విద్యనభ్యసించి లాయర్‌గా మారాడు. అయితే ప్రజలపై ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండ ఆయన వృత్తిపై దృష్టి కేంద్రీకరించకుండా చేసింది.

**విప్లవ కార్యాచరణ**

17 ఏళ్ల వయస్సులో కాలేజీ నుండి గెంటివేయబడిన వెంటనే ఆయన విప్లవ కార్యాచరణ ప్రారంభమయింది. ప్రభుత్వం ఆయన్ని ఊరు వదిలి పొమ్మని శాసించింది. ప్రతికూల పరిస్థితులను విప్లవోద్యమానికి అనుకూలంగా మలచుకోవటంలో భాగంగా ఆయన తన ప్రవాస జీవితాన్ని దేశంలోని రాజకీయ, సాంఘిక, ఆర్థిక విషయాలకు సంబంధించిన గణాంకాలను అధ్యయనం చేయడానికి ఉపయోగించుకున్నాడు. "నేను ప్రవాస జీవితంలో చదివినంత ఎక్కువగా మరే ఏ ఇతర సందర్భాలలోనూ చదవలేదు. తెల్లవారి నుండి రాత్రి వరకు చదువుతూనే వుండేవాడిని" అని ఆయనే చెప్పాడు. మొదటితరం మార్క్సిస్టుల ఆధ్వర్యంలో నడుస్తున్న మార్క్సిస్టు స్టడీసర్కిల్‌లో సభ్యుడిగా చేరాడు. మార్క్స్, ఏంగెల్స్ రచనలను రహస్యంగా తెప్పించుకుని ఈ స్టడీ సర్కిల్‌లో అధ్యయనం చేసేవారు. కొద్దికాలంలోనే లెనిన్ అసమాన ప్రజ్ఞ, పట్టుదల దేశవ్యాప్తంగానే కమ్యూనిస్టు శ్రేణుల్లో గుర్తింపుతెచ్చాయి. రష్యన్ కమ్యూనిస్టులలో అగ్రగణ్యుడైన ప్లెఖనోవ్ లెనిన్‌ని కలవడం జరిగింది. లెనిన్‌తో మాట్లాడిన అనంతరం... నా జీవితంలో ఇంత ప్రతిభావంతుడైన యువ విప్లవకారుడిని గతంలో ఎన్నడూ కలిసి వుండలేదు అని ప్లెఖనోవ్ పేర్కొన్నాడు. అయితే అప్పటికే ప్లెఖనోవ్‌తో అనేక అంశాలపై లెనిన్ విభేదించడం జరుగుతూ వుండింది. కార్మికవర్గ ఆధిపత్యం, రైతాంగంతో మైత్రి వంటి విషయాలు తీవ్రమైన చర్చనీయాంశాలుగా వున్నాయి. ఆ కాలంలోనే లెనిన్ ఐరోపా దేశాలలో పర్యటించటం ప్రారంభించాడు. ఆ దేశాలలో కమ్యూనిస్టు నాయకులతో చర్చలు చేసేవాడు. చివరి దశలో వున్న ఏంగెల్స్‌ని కలవడానికి విశ్వ ప్రయత్నం చేశాడు. లెనిన్ కార్యాచరణ జార్ చక్రవర్తిని గడగడ లాడించడం ప్రారంభించింది. ఆయనపై నిఘా పెరిగింది. జార్ పోలీసులు ఆయన కుటుంబ సభ్యులను వేధించడం ప్రారంభిం చారు. వృద్ధురాలైన ఆయన తల్లిని పిలిచి ఒక పోలీసు అధికారి వ్యంగ్యంగా "నీ పెద్దకొడుకు ఉరితాడుకి బలయ్యాడు. ఇప్పుడు రెండోకొడుకు (లెనిన్) ఉరితాడు కావాలని గొడవ చేస్తున్నాడు జాగ్రత్త" అని హెచ్చరించటం జరిగింది. ఇవేవీ లెనిన్ విప్లవ కార్యాచరణను తగ్గించకపోగా మరింత ఉధృతం చేయడానికి దోహదపడ్డాయి.

**ఉద్యమ నిర్మాణం దిశగా**

చెల్లాచెదురుగా వున్న కమ్యూనిస్టు గ్రూపులన్నింటినీ ఐక్యం చేయడం, విప్లవ కార్మికోద్యమాన్ని విస్తృత పర్చడం, సైద్ధాంతిక రంగంలో పొరపాటు ధోరణులపై రాజీలేని పోరాటం, ఈ మూడూ ఆయన ఎంచుకున్న లక్ష్యాలు. ఇందులో మొదటగా 1895లోనే "కార్మికవర్గ విముక్తి పోరాట సమాఖ్య" అనే వేదికను ఏర్పాటు చేశాడు. వెనువెంటనే లెనిన్‌ను ప్రభుత్వం అరెస్టు చేసింది. 14 నెలల జైలుశిక్ష విధించింది. 3 సంవత్సరాల పాటు తూర్పు సైబేరియాలో ప్రవాసశిక్ష విధించింది.

అయితే ఆయన తల్లి తన స్వంత ఖర్చుల మీద ఆయన తిరగడానికి అవకాశం పొందు తూ ప్రభుత్వం నుండి అనుమతి తేవడంతో తిరిగి ఆయన అనేక ప్రాంతాలు తిరగడం ప్రారంభించాడు. ఆ కాలంలోనే కృపస్కయాతో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. తరువాత వివాహంతో వారిద్దరు భార్యాభర్త లైనారు. రష్యాలో రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ ఏర్పడటం ప్రవాసంలో వున్న లెనిన్‌ని ఎంతో సంతోషపర్చింది. అయితే జార్ ప్రభుత్వం ఆ పార్టీ సెంట్రల్ కమిటీ నాయకత్వం మొత్తాన్ని అరెస్టు చేసి, నిర్బంధించి పార్టీని ఛిన్నాభిన్నం చేసింది. లెనిన్, కృపస్కయాలు ప్రవాసం నుండే అనేక అంతర్జాతీయ విప్లవ రచనలను తర్జుమా చేసి రష్యాకి పంపించడం ప్రారంభించారు.

అత్యంత కష్టమైన పరిస్థితులలో వుండి కూడా ప్రవాసం నుండే లెనిన్ తన అద్భుతమైన రచన "రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి" అనే గ్రంథాన్ని రచించాడు. దీనితో కార్మిక ఉద్యమంపై పట్టు వున్న నరోద్నిం, లీగల్ మార్క్సిజం వంటి పొరపాటు ధోరణులపై తిరుగులేని దెబ్బతీశాడు. ఈ రచనకు ఆయన వందలాది పుస్తకాలు, గణాంక వివరాలు, అధ్యయనం చేశాడు. ఆ రోజుల్లోనే అతి తక్కువ సమయంలో ఆ పుస్తకం 2400 కాపీలు అమ్ముడుపోయాయి. ఆ తరువాత ఆయన అనేక సైద్ధాంతిక గ్రంథాలను జీవితం చివరివరకు రాస్తూనే వున్నారు. రష్యాలోనూ, అంతర్జాతీయంగానూ, కార్మికోద్యమంలోనూ, కమ్యూనిస్టుల మధ్య వచ్చిన ఏ వివాదాన్ని సైద్ధాంతిక ప్రశ్నకు సమాధానం చెప్పకుండా వదిలిన దాఖలా లేదంటే అతిశయోక్తి కాదు. ఆ రకంగా ప్రపంచ వ్యాపితంగానే కమ్యూనిస్టు ఉద్యమానికి జవసత్వాలు ఇచ్చిన వ్యక్తి ఆయన. లెనిన్ వ్యతిరేకులు సైతం ఈ విషయాన్ని అంగీకరించకుండా వుండలేరు. ఆర్లాండో ఫిజియస్ రాసిన "ప్రజల విషాదం" అనే పుస్తకంలో "లెనిన్ జీవితం 1917 కోసమే వున్నదా! అనిపిస్తున్నది. ఆయనకి వ్యక్తిగత జీవితం లేదు. పాపులిస్టులకు (ఆనాటి ఒక సైద్ధాంతిక వాదం), ఆర్థిక వాదులకు, మెన్షివిక్‌లకు, మాక్, గోర్డనోవన్ వాదనలకు వ్యతిరేకంగా, యుద్ధాలకు వ్యతిరేకంగా, పార్టీ ఏర్పరచటానికీ, పార్లమెంట్‌లో చేరకుండా వుండటానికీ, చేరడానికీ కారణాలు విశదీ కరించడం కోసం, ఉద్యమాల నిర్మాణా నికి జరిపే సైద్ధాంతిక పోరాటమే ఆయన జీవితంగా సాగింది" అని పేర్కొన్నాడు.

1905 విప్లవం విఫలం అయ్యింది. ఇది పార్టీలో తీవ్ర విభేదాలకు దారితీసింది. తిరిగి పార్టీలో సరైన మార్క్సిస్టు పంథాను తీసుకురావడానికి లెనిన్ నడుం బిగించారు. మెన్షివిక్ నాయకుడు డేన్ "లెనిన్ పార్టీని నాశనం చేస్తున్నాడని" ఆరోపించాడు. ఒక వ్యక్తి పార్టీ అంతటినీ ఎలా నాశనం చేయగలడని బోల్షివిక్ ప్రతినిధి అడిగితే డేన్ లెనిన్ గురించి చెబుతూ "అతను 24 గంటలూ విప్లవం కోసం కేటాయిస్తాడు. విప్లవం గురించి తప్ప మరో ఆలోచన ఆయనకు వుండదు. నిద్రలో కూడా విప్లవాన్నే చూస్తుంటాడు. అటువంటి మనిషిని ఏం చేయగలం" అని వాపోయాడు. డేన్ లెనిన్‌ని విమర్శించడానికి చెప్పినప్పటికీ ఆయన చెప్పింది మాత్రం నిజం.

### ప్రభుత్వాధినేతగా

1917 విప్లవం జయప్రదమైంది. తొలి కార్మికవర్గ రాజ్యానికి అధినేతగా కామ్రేడ్ లెనిన్ ఎన్నుకోబడ్డారు. కార్మికుల, కర్షకుల సోవియట్ ప్రభుత్వం ఏర్పడింది. సోషలిస్టు ప్రభుత్వం నిలదొక్కుకునేలా చేయడానికి అహరహరం కృషి ప్రారంభించారు. కార్మికవర్గ ప్రభుత్వాలు ఎలా వుండాలి. జాతీయ, అంతర్జాతీయ రంగాలలో, దౌత్య విషయాలలో కార్మికవర్గ దృక్పథాన్ని ఎలా అమలు చేయా లన్నది ఆయన చేసి చూపించారు. కార్మికుల నుండి సోవియట్‌లకు ఎన్నుకోబడ్డ ప్రతినిధులు కొందరు ఆయన దగ్గరకు వచ్చి తమ పనిలో ఫలితాలు రావటం లేదనీ, తిరిగి తమను ఫ్యాక్టరీలకి పంపించి వేస్తారా అని ఆయన్ని అడిగితే ఆయన "నేను కూడా ప్రభుత్వాధినేతగా గతంలో ఎన్నడూ చేయలేదు కదా! ప్రజలూ, పార్టీ నాకు ఈ బాధ్యత అప్పగించారు. కాబట్టి వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాలి. అలాగే మీరు కూడా మీ కొత్త బాధ్యతలు నిర్వర్తించండి" అని చెప్పి వారినే కాదు యావత్ కార్మికవర్గాన్ని ఉత్సాహపరిచాడు. సోషలిస్టు వ్యవస్థ నిర్మాణానికి, సాధారణ కార్మికులను, శ్రామిక జనాన్ని ఉత్సాహపరిచిన తీరు కమ్యూనిస్టులందరికీ ఆదర్శనీయం.

### అమర్ రహే కామ్రేడ్ లెనిన్

కామ్రేడ్ లెనిన్ జనవరి 21, 1924 సాయంత్రం 6 గం.ల 50 ని.లకు మరణించారు. 1918లో ఆయనపై కాల్పులు జరిగిన అనంతరం శరీరంలో వున్న బుల్లెట్లు క్రమంగా ఆయన ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తూ వచ్చాయి. అయినా 6 సంవత్సరాలపాటు ఆయన అలుపెరగకుండా పనిచేస్తూనే వున్నాడు. డాక్టర్లు నివారించినా ఆయన నన్ను పని నుండి ఆపగలరు గానీ, ఆలోచించకుండా వుంచలేరు కదా అని సున్నితంగా చెబుతూ వుండేవారు. జనవరి 22వ తేదీన రష్యన్ కమ్యూనిస్టు (బోల్షివిక్) పార్టీ, శ్రామిక జనానికి ఈ క్రింది విజ్ఞప్తి విడుదల చేసింది:

"మార్క్సు అనంతరం మన నాయకుడు, ఉపాధ్యాయుడు, మిత్రుడు అయిన లెనిన్ వంటి మహోన్నత వ్యక్తిని కార్మిక విముక్తి ఉద్యమం సృష్టించలేదు. కార్మికవర్గంలో వుండే అన్ని ఉన్నతమైన ధీరోధాత్తమైన లక్షణాలు, నిర్భీతి, దృఢ సంకల్పం, కష్టాలను అధిగమించే ఓర్పు, బానిసత్వం అణచివేతలను అసహ్యించుకునే మనస్తత్వం, కొండలను సైతం పిండిచేయగల విప్లవతత్వం, ప్రజల సృజనాత్మకత శక్తిపై అంతులేని విశ్వాసం, అసాధారణ నిర్మాణ దక్షత, వీటన్నిటికీ ప్రతిరూపం లెనిన్. ఆయన కొత్త ప్రపంచానికి ఒక చిహ్నం".

లెనిన్‌కు మరో విశిష్టత కూడా ఉంది. అదే మంటే ఆయన విప్లవంలోనూ, పార్టీ నిర్మాణంలోనూ, పార్టీని ఐక్యంగా ఉంచటంలోనూ విప్లవ పత్రిక పోషించే పాత్రను అత్యంత ప్రతిభావంతంగా నిరూపించాడు. ప్రత్యక్ష కార్యాచరణకు ఎంత ప్రాధాన్యత ఇచ్చాడో పత్రిక నిర్వహణకూ అంతే ప్రాధాన్యత ఇచ్చాడు. అందువల్లనే ఎన్ని అవరోధాలున్నా విప్లవ శ్రేణులకు మార్గదర్శనం వహించే పత్రిక కార్యకలాపాలు మాత్రం యథావిధిగా కొనసాగేలా జాగ్రత్తలు తీసుకున్నాడు. అందుకనే ఇస్క్రా, రబోచెదైలో, సోషల్ డెమోక్రాట్, ప్రావ్దా పత్రికలు రష్యా విప్లవ చరిత్రతో తమ మనుగడను ముడివేసుకున్నాయి. మార్క్సిజం ప్రచారాస్త్రాలుగా మారాయి. పీడితులను ఉత్తేజపరిచాయి. 1905 తొలి తిరుగుబాటు యత్నం అర్థాంతరంగా ముగించాల్సి వచ్చినపుడు లెనిన్ "అధైర్యపడవద్దు. ఈ చీకటి రోజులు తొలగిపోతాయి. గాలిదుమారం సమసిపోతుంది. నిప్పు కణికలు చల్లబడతాయి. మరో మలయమారుతం వీస్తుంది. కార్మికవర్గ విప్లవం విజయం సాధిస్తుంది" అంటూ ధైర్యాన్ని నూరిపోశాడు. అందువల్లనే లెనిన్ నూతన శకానికి విప్లవంతో స్వాగతం చెప్పిన శక పురుషుడుగా చరిత్రలో స్థానం పదిల పర్చుకోగలిగాడు.

లెనిన్ మరణించి 100 గడిచింది. ఆయన నాయకత్వాన ప్రథమ కార్మికవర్గ విప్లవం ప్రపంచ గమనాన్నే సంపూర్ణంగా మార్చివేసింది. ప్రపంచ వ్యాపితంగా కమ్యూనిస్టు పార్టీలు ఆవిర్భవించాయి. ఆయా దేశాల నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అన్వయించి విప్లవాల జయప్రదానికి కృషి చేస్తున్నాయి. ఆ పార్టీలలో పనిచేసే కమ్యూనిస్టు కార్యకర్తలకు సదా లెనిన్ జీవితం ఆదర్శంగా, అనుసరణీయంగా వుంటూనే వుంటుంది. ❃

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 19, issue: 8 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# మహిళల పట్ల వెనుకబాటు అభిప్రాయాలను పారద్రోలాలి - లెనిన్

"మహిళల్లో ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న సామాజిక కార్యక్రమాలను ప్రోత్సహించాలి. అప్పుడే వారు సాంస్కృతిక వెనుక బాటుతనం నుండీ, తన ఇల్లు, కుటుంబం...ఇదే ప్రపంచం అనుకునే సంకుచిత మనస్తత్వం నుండీ బయటపడతారు.... లైంగిక సంబం ధాలు, వివాహం మొదలైన అంశాల్లో ఒక విప్లవం రాబోతోంది.... మహిళలు లేకుండా ప్రజాబాహుళ్య ఉద్యమం అసాధ్యం... కోట్లాది మంది మహిళలు మనవైపు లేకుండా మనం కార్మికవర్గ నియంతృత్వాన్ని అమలుజరప జాలం. వారులేకుండా మనం కమ్యూనిస్టు పార్టీని నిర్మించలేం. పురుషాధిపత్యంలో అణచి వేయబడుతున్న, బానిసత్వానికీ, దోపిడీకీ గురిచేయబడుతున్న మహిళా జనబాహుళ్యాన్ని చేరుకోడానికి మనం మార్గాలు అన్వేషించాలి.... కార్మికవర్గ నియంతృత్వం అంటే తమకు పురుషులతో సమానంగా – చట్టపరంగానూ, ఆచరణా త్మకంగానూ, కుటుంబంలోనూ, రాజ్యంలోనూ, సమాజంలోనూ – హక్కులు కల్పించడమేననీ, బూర్జువా అధికారాన్ని నాశనం చేయడమేననీ వారు తెలుసుకోవాలి. మహిళపట్ల పురుష ల్లోనూ, మహిళల్లోనూ ఉన్న వెనుకబాటు అభి ప్రాయాలను పారద్రోలి, పాతబడిన, కమ్యూనిస్టే తర మానసిక స్థితిని పూర్తిగా నిర్మూలించడానికి కార్మికవర్గ నియంతృత్వ ప్రభుత్వం, కమ్యూనిస్టు పార్టీతోనూ, ట్రేడ్‌యూనియన్లతోనూ కలిసి అన్ని విధాలా కృషి చేస్తుంది. చట్టం ముందు స్త్రీ, పురుషులు పూర్తిగా సమాన హోదాకలిగి ఉంటారన్న దాంట్లో మరోమాటకు తావులేదు. అన్ని రంగాల్లోనూ ఈ సమానత్వం పాటించడానికి నిజాయితీతో కృషి జరుగుతోంది. మహిళలు ఆర్థిక రంగంలోనూ, పరిపాలనా రంగంలోనూ, న్యాయవ్యవస్థలోనూ, ప్రభుత్వంలోనూ పనిచేయడానికి పెద్ద ఎత్తున వారిని నియమించడం జరుగుతోంది. అన్ని వృత్తి విద్యాసంస్థలనూ వారికోసం తెరిఉంచాం. దాని వల్ల వారు తమ వృత్తి నైపుణ్యాన్నీ, సామాజిక శిక్షణనూ మెరుగు పరుచుకోగలుగుతారు. వారికోసం మేము కమ్యూనిటీ వంటశాలలూ, భోజన శాలలూ, లాండ్రీలూ, రిపేరు షాపులూ, క్రెచ్‌లూ, కిండర్‌గార్టెన్లూ, చిల్డ్రన్ హోమ్‌లూ, అన్ని రకాల విద్యాసంస్థలనూ నిర్వహిస్తున్నాం. ఒక్క మాటలో చెప్పాలంటే మేము ఇంటిపనినీ, పిల్లలకు పాఠాలు చెప్పే పనినీ వ్యక్తిగతం నుండి సామాజిక కార్యక్రమంగా మార్చివేస్తున్నాం. అందువల్ల మహిళలు ఇంటి చాకిరీ నుండి విముక్తి చెందుతారు. భర్తలపై ఆధారపడే అవసరం నుండి బయటపడతారు. దానివల్ల మహిళలు తమ సామర్థ్యాలనూ, ఇష్టా ఇష్టాలనూ సమాజంలో పూర్తిగా ఉపయోగించుకునే అవకాశాలు ఏర్పడతాయి. ఇంటిలో కన్నా మెరుగైన అభివృద్ధి అవకాశాలను కమ్యూనిటీ సెంటర్లలో పిల్లలకు కల్పిస్తున్నాం. ప్రపంచంలోనే అత్యంత పురోగామి మహిళా శ్రామిక చట్టాన్ని చేశాం. దాన్ని సంఘటిత రంగంలోని అధికార ప్రతినిధులు అమలు జరుపుతారు. మెటర్నిటీ హోమ్‌లూ, తల్లీ–పిల్లల హోమ్ లూ, తల్లుల ఆరోగ్య సంరక్షణ కేంద్రాలూ, శిశువులు, పిల్లల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై కోర్సులూ వంటివాటిని ఏర్పాటు చేస్తున్నాం. సమస్యలనూ, నిరుద్యోగాన్నీ ఎదు ర్కొంటున్న మహిళలకు సహాయపడడానికి అన్ని విధాలా కృషి చేస్తున్నాం.....కార్మికవర్గ నియంతృ త్వంలో కమ్యూనిజం ద్వారా మహిళా విముక్తి అనేది గ్రామీణ ప్రాంతాల్లో కూడా జరుగుతుంది. ఈ విషయంలో మన పరిశ్రమలనూ, వ్యవసాయాన్నీ విద్యుద్దీకరించడం ద్వారా చాలా చేయగలం. ఇది చాలా పెద్ద పథకం! ఈ కార్యక్రమం అమలులో చాలా పెద్ద, భయంకరమైన కష్టాలున్నాయి. ఈ కష్టాలు అదిగమించడానికి ఏకైక మార్గం ప్రజల్లో నిగూఢంగా దాగి ఉన్న శక్తులను బయటకు తీసి ఉపయోగించుకోవడమే. ఈ కార్యంలో కోట్లాది మంది మహిళలు పాల్గొనాలి.... వాళ్లిప్పుడు స్థబ్దంగా ఉన్నారు. వాళ్లను కదిలించాలి. రోజు వారీ జీవనం గడపడంలోనూ, తమ జీవితాలకు పరమార్థాలను వెదుక్కోవడంలోనూ తీవ్రమైన ఆందోళనలు వారిని సమస్యలకు గురిచేస్తున్నాయి. గతంలో కొద్దిమందిమాత్రమే ఈ విష యాన్ని గ్రహించగలిగారు గానీ చాలా మంది దీన్ని ఊహించనే లేదు. వారి ప్రశ్నలకు బూర్జువా సమాజం సంతృప్తికరమైన సమాధానాలు చెప్ప లేదు. కమ్యూనిజం మాత్రమే ఈ పనిచేయగలదు. అందుకే మనం పెట్టుబడిదారీ దేశాల్లోని మహిళా బాహుళ్యాన్ని చైతన్యవంతం చేయాలి."

**(1920లో మాస్కోలో క్లారా జెట్కిన్‌తో సమావేశమైనప్పుడు మహిళల విముక్తిపై లెనిన్ చేసిన వ్యాఖ్యలివి. దీన్ని "లెనిన్‌తో నా జ్ఞాపకాలు (మహిళల సమస్యపై ఇంటర్వ్యూ)" అనే పేరుతో 1966లో పునర్ముద్రించారు.**


**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా రూ. **180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

**ఇంటి నెంబరు** ..........................................

**వీధి** ..........................................

**గ్రామం** ..........................................

**మండలం లేదా పట్టణం** ..........................................

**జిల్లా** ..........................................

email : marxistap@gmail.com
: venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.